ఇన్స్పెక్టర్ రాజేంద్ర పడక కుర్చీలో తీరిగ్గా కూర్చున్నాడు. కాళ్ళుబారజాపి స్టూల్ మీదకు తన్నిపట్టాడు. ఆసక్తిగా అపరాధ పరిశోధనలో పాఠకుల పరిశోధన పోటీని చదువుతున్నాడు.

లోపల్నుంచి భార్య సుమిత్ర కంఠం తీయగా వినిపించింది.

"ఏమండోయ్ శ్రీవారూ?" అని పిలుపు.

భార్య అలా నింపాదిగా, ప్రేమ లొలకబోస్తూ పిలిచిందంటే, ఆ వేళకు ఏదో ప్రత్యేక కార్యక్రమం, సినిమాకో, ఎగ్జిబిషన్‌కో, ఉన్నట్టే లెక్క.

అందుకే రాజేంద్ర పలకలేదు. తన పఠనంలోనే ఉండిపోయాడు.

అలకలో భర్తను సాధించటానికి దూసుకువచ్చే సత్యభామలా రివ్వున వచ్చింది.

"ఏమండోయ్! మిమ్మల్నేనండీ!" అంది పెద్దగా, రాజేంద్ర చేతిలోని పుస్తకాన్ని లాక్కుంటూ.

"పుస్తకం లాగెయ్యకు! హంతకుడు దొరికేలాగున్నాడు!" రాజేంద్ర ఆమెను అభ్యంతరపెట్టాడు. "అయినా ఈ పుస్తకాన్ని లాగి పారేసే హక్కులేదు. ఉదయం హోం డెలివరీ పార్శెల్ రాంగానే, ఇద్దరం లాటరీవేసి, అపరాధ నాకూ, సప్లిమెంట్ నీకూ అని వాటా వేసుకున్నామా లేదా?"

"ఇక మాట్లాడితే హక్కులూ, ఉల్లంఘించటాలు! కట్టుకున్న ఆలిమాట ఏమైనా ఆలకించేది ఉందా లేదా అని?"

"ఇంతకీ నీ కొచ్చిన సమస్య ఏమిటో చెప్పు! దాన్ని త్వరగా సాల్వ్‌చేశాకనే, ఇందులో హంతకుడ్ని పట్టుకుంటాను."

"రేపు స్టేడియంలో కుస్తీ పోటీలటగా! పేరు మోసిన వస్తాదులటగా రేపు!" అంది సుమిత్ర గోముగా.

"చూడు! ఆడపిల్లవు! నీకీ కుస్తీలు, మల్లయుద్ధాలూ ఎందుకు చెప్పు! హాయిగా ఏదో, శ్రీ రాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్, మహాకవి క్షేత్రయ్య లాంటి సినిమాలకు వెళ్ళక!"

రాజేంద్ర మేనమామ కూతురే సుమిత్ర. ఆమె తన తల్లిదండ్రులకు ఒక్కతే సంతానం. ఆమె తండ్రికి మగ పిల్లలపై ఆపేక్ష. అందుకే సుమిత్ర పెద్దదయేదాకా మగపిల్లవాడి దుస్తుల్లోనే పెరిగింది. అందుకే కాబోలు ఆమెకు కొన్ని మగవాళ్ళ అలవాట్లూ, మోజులూ ఉన్నాయ్ అనుకున్నాడు రాజేంద్ర.

"ఇంతకీ కుస్తీ పోటీలకు తీసుకెళ్తారా లేదా?" సుమిత్ర రెట్టించి అడిగింది.

"సుమిత్రా! నీవు వెయ్యి చెప్పు! ఈ పూట 'అపన', సాయంకాలం లోపల సప్లిమెంట్ పూర్తి చేస్తేగానీ ఎక్కడకూ కదలను నేను. ఈలోపల యన్టీ రామారావు, శోభన్ బాబు, వాణిశ్రీ, మంజుల వీరంతా కట్టుకుని టౌన్‌లోకి దిగారన్నా నేను రాను! తెలిసిందా!"

"అబ్బ! పెద్ద మీరొక్కరేనా చదివేది, నేనూ పూర్తి చేయాలి సాయంత్రం లోపల, అపన, సప్లిమెంట్‌లను. నేను చెప్పే ప్రోగ్రామ్ ఇవాళ కాదు సారూ! రేపండీ!"

"ఓహో! రేపా! అయితే ఇంకేం! నిరభ్యంతరంగా వెళ్దాం!" గుండెలు కుదుటపడ్డాయి రాజేంద్రకు.

"రేపు డ్యూటీకి వెళ్ళి, ఏ హత్యకేసో, ఖూనీకేసులోనో గడిపి, రాత్రి తొమ్మిదింటికి ఉసూరుమంటూ ఇంటికి వస్తే ఊరుకునేది లేదు. ఇవేళే వెంకయ్యను పంపి టికెట్స్ తెప్పించండి!"

"కావాలంటే రేపు డ్యూటీకి సెలవుపెట్టి అయినా నిన్ను కుస్తీ పోటీలకు తీసుకువెడతాగానీ, ఇక నన్ను డిస్టర్బ్ చెయ్యకు, దీన్ని సాంతం చదివేసేదాకా!" అంటూ సుమిత్ర చేతిలోంచి పుస్తకాన్ని మళ్ళీ లాక్కున్నాడు ఇన్స్పెక్టర్ రాజేంద్ర.

2

చలికాలం కావటం వలన ఆరు దాటుతూండగానే చలి గాలి ప్రారంభమయింది. జీప్‌లో సివిల్ డ్రెస్‌లో కూర్చు న్నాడు ఇన్స్పెక్టర్ రాజేంద్ర. పాతకాలంనాటి వులెనుకోటు తొడుక్కున్నాడు. అతడి ప్రక్కనే స్వెటర్ వేసుకుని తలకు మఫ్లర్ కట్టుకుని ఠీవిగా కూర్చునుంది సుమిత్ర.

జీప్ రద్దీగా ఉన్న బజార్లగుండా పోతున్నది స్టేడియం వైపుగా.

"ఈదఫా ఎవరెవరు సార్, కుస్తీ పట్టేది?" జీప్ డ్రైవర్ వెంకయ్య అడిగాడు.

"సలాంఖాన్, అలీబేగ్‌ల మధ్య! ఈ పోటీలో గత మూడేళ్ళుగా వెండికప్పును సలాంఖానే గెలుచుకున్నాడు." ఇన్స్పెక్టర్ రాజేంద్ర వివరించాడు.

"వెండికప్పుతోబాటు పదివేల రూపాయలు బహుమతి గూడ ఉంటూంది కదండీ! ఏం చేస్తారో అంత డబ్బుని?" ఆశ్చర్యాన్ని ప్రకటించింది సుమిత్ర.

"వస్తాదులు తినే తిండికి లక్ష రూపాయలయినా చాలవు. పదివేలొక లెక్కా! పైగా సలాంఖాన్‌కి ఊరినిండా అప్పులే నట. ఈ పోటీలో పదివేలు రాగానే, భార్యకొంత, అప్పుల వాళ్ళు కొంత ఎగరేసుకు పోతారట!" రాజేంద్ర నవ్వుతూ చెప్పాడు.

"పాపం! ఏడాది పొడుగూ వస్తాదుని మేపటమంటే మాటలా మరి? ఆ భార్య అతడికి అవీ ఇవీ వండిపెట్టలేక పీనుగైపోయి ఉండాలి! ఈ దఫాగూడ సలాంఖాన్ గెలుస్తాడా?" సుమిత్ర అడిగింది మళ్ళీ.

"నూటికి తొంభయ్ పాళ్ళు అతడే గెలవచ్చు. పదిపాళ్లు దైవాధీనం! నేను విన్నదేమంటే, ఆలీబేగ్ ఈసారి ఎలాగైనా వెండికప్పుని గెలుచుకోవాలన్న పట్టుదలతో ఉన్నాడట. అందుకు తగ్గట్టుగా మాంఛి కసరత్తుగూడా చేశాడట!"

జీప్ స్టేడియం ముందు ఆగింది. అప్పటికే అక్కడ పార్కింగ్ స్పేస్‌లో పది పదిహేను కార్లున్నయ్. వాటి ప్రక్కగా జీప్‌ని ఆపారు.

ఇన్స్పెక్టర్ రాజేంద్రకు వులెన్ కోటుతో చిరాకనిపించింది. కోటు విప్పి జీప్ సీట్ మీద పడేశాడు.

"అయ్యో! అక్కడ వదిలేస్తే ఎవరన్నా ఎత్తుకు పోతారండీ!" అంది భార్య సుమిత్ర.

"ఎత్తుకుపోతే పోనీ! పీడా వదిలిపోతుంది. ఎత్తుకుపోయిన వాళ్ళకు పాతిక రూపాయలు ప్రెజెంట్ చేస్తానుగూడా!" రాజేంద్ర నవ్వాడు.

"అది మా నాన్నగారిచ్చిందనే కదా మీ కోపం! అంతగా ఇష్టం లేకపోతే దాన్ని పెట్టెలోనే ఉంచెయ్యక పోయారా?" సుమిత్ర అలక చూపింది.

"పద! పద! కుస్తీలు మొదలవుతున్నట్టున్నయ్!" మాట మారుస్తూ తొందరచేశాడు రాజేంద్ర.

అప్పటికే గ్యాలరీలు నిండుతున్నాయ్. రిజర్వుడ్ సీట్లలోకి వెళ్ళి కూర్చున్నారు ఇన్స్పెక్టర్ రాజేంద్ర, సుమిత్ర.

జీప్ డ్రైవర్ గ్యాలరీలో చోటు చూసుకున్నాడు.

కుస్తీ పోటీలకై ప్రత్యేకంగా నిర్మించారు ఆ స్టేడియంని. ఆవరణ చిన్నది. పైగా జనం బాగా వచ్చారు. పట్టుదలమీద జరిగే పోటీని చూడటానికి.

ఆవరణ మధ్యలో త్రాడుతో నాలుగు వేపుల పెన్సిం గున్న చోట గోదా ఏర్పాటు చేయబడింది.

మరో ప్రక్కగా బాక్సులో సలాంఖాన్ భార్య ఒక్కతే ఠీవిగా కూర్చుని ఉంది. ఆమె మహాకాయంతో, ఖడ్గ మృగంలా ఉంది. ఎబ్బెట్టుగా ఉన్న అలంకరణలోనూ, మేకప్‌తోనూ, మరీ వికారంగా కనిపిస్తోంది.

పహిల్వాన్ లిద్దరూ గోదాలోకి దిగారు.

సలాంఖాన్ ఆరడుగుల ఎత్తున్నాడు. వెడల్పాటి ఛాతీ, కండలు తిరిగిన దేహం, బంగారు పసిమిలో మెరుస్తున్నాడు. చూసేందుకు చిన్నసైజు రాక్షసుడిలా ఉన్నాడు. అతడు తన గడ్డాన్ని నిమురుకుంటూ, గర్వంగా ప్రేక్షకులవైపు కలయ జూశాడు.

"అబ్బ! అతడ్ని చూస్తుంటే హెర్క్యులిస్ వర్ణన గుర్తుకు వస్తోంది కదండీ!" సుమిత్ర అతడి పర్సనాలిటీని మెచ్చుకుంటూ అంది.

"నిజమే సుమిత్రా! కానీ ఈ రోజున అంత పెద్ద శరీరం నేలకు కరుచుకోవాల్సిందే అనిపిస్తోంది నాకు!"

"అందుకు ఏమాత్రం అవకాశం లేదు. ఈ దఫా గూడా సలాంఖానే గెలిచి తీరతాడు. అతడి ప్రత్యర్థికన్న బలం లోనూ, ఆకారంలోనూ అతడే మిన్నగా ఉన్నాడు. సలాం ఖాన్ చేతిలో అలీబేగ్ ఈ దఫా గూడా ఓడిపోవలసిందే!" సుమిత్ర తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

"అడుగో! అతడే అలీబేగ్!" అన్నాడు రాజేంద్ర.

సుమిత్ర మళ్ళీ గోదాలోకి చూసింది.

ఆలీబేగ్ నల్లగా వికారంగా ఉన్నాడు. ఒళ్ళంతా బొచ్చుతో, మనిషిలా ఉన్నాడనేకన్న, అప్పుడే అడవిలోంచి పారిపోయి వచ్చిన గోరిల్లా లాగున్నాడంటే అతిశయోక్తి లేదు. అతడి పాదాలు పెద్దవి. కాళ్ళు కండలు తిరిగి ఉక్కు స్తంభాల్లాగున్నాయ్. అతడి కళ్ళల్లో క్రౌర్యం కొట్టొస్తున్నట్టుగా కనిపిస్తోంది.

ఆలీబేగ్ తొడలు చరుస్తూ, ప్రత్యర్థిని సవాలు చేశాడు. సలాంఖాన్ ప్రతిగా తన తొడలు చరిచి పెద్ద ధ్వని చేశాడు.

ఇద్దరు రిఫరీలు అటూ ఇటూ నిలబడి వాళ్ళ వంకే చూస్తున్నారు.

3

సలాంఖాన్ ఈసడింపుగా చూశాడు ఆలీబేగ్ వంక.

ప్రేక్షకుల కరతాళ ధ్వనులమధ్య, కుస్తీ మొదలయింది. సలాంఖాన్, ఆలీబేగ్ లిద్దరూ చేయీ, చేయీ కలిపారు. మొదటి రౌండ్‌లో సలాంఖానే గెలిచాడు. కానీ రెండో రౌండ్‌లో ఆలీబేగ్‌దే పైచేయి అయింది.

మూడో రౌండ్‌కల్లా సలాంఖాన్, గతంలో మూడుసార్లు ప్రైజ్‌ని కొట్టేసిన పహిల్వాన్ డీలా పడిపోయాడు. అతడి కుడికన్ను వాచిపోయింది. క్రింది పెదవి పగిలి నెత్తురు కారింది. అతడి గుండెలు ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో ఎగసి ఎగసి పడుతున్నయ్.

మరో ముప్ఫయ్ సెకండ్లలో అతడ్ని చిత్తుచేసేశాడు ఆలీబేగ్. ఆలీబేగ్‌తో చిన్నపిల్లవాడితో ఆడినట్టుగా ఆడిన సలాంఖాన్ ఈసారి, ఆలీబేగ్ కొట్టే తాపులకు రక్షణగా చేతులు అడ్డం పెట్టుకోసాగాడు.

అపరాధ పరిశోధన పోటీ-93

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో **75** పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ **75** పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు**30-4-'76** తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జూన్ **'76** నెల సంచికలో ప్రకటిస్తాము. *

1. నేడు అందరూ దీనినే మాట్లాడుతున్నారు__?
(అవినీతిని, అత్యవసర పరిస్థితిని.)

2. ఇది చేయటానికి జంకరు కొందరు__? (ప్రాణ త్యాగము, పాదయాత్ర.)

3. దీనిని చూసి **మానవుడు** నేర్చుకోవలసింది ఎంతో **వుంది**__? (తేనెటీగ, చీమ.)

4. కొందరిలో యీజంతువు లక్షణాలుంటాయి__?
(కోతి, కొండముచ్చు,)

5. భారతదేశం దీనికి ప్రసిద్ధి__? (భత్రాజులకు, బిచ్చగాళ్ళకు.)

ఆలీబేగ్ గ్లోవ్స్ సలాంఖాన్ పొట్టమీద అతి తేలికగా నాట్యమాడినయ్.

ప్రేక్షకుల్లో మాజీ వస్తాదులూ, వెయిట్ లిఫ్టర్స్, మల్ల యోధులూ ఉన్నారు. వాళ్ళంతా సలాంఖాన్ ఓటమిని నమ్మ శక్యం గానట్టుగా చూస్తున్నారు.

'సలాంఖాన్‌కి గాలి తగిలేలా ఎవరో పూనకం చేయించి ఉంటారు. లేకపోతే పిట్టలాగున్న ఆలీబేగ్‌ని చూస్తుంటేనే, పిశాచాన్ని చూసినంత ఇదిగా భయపడతాడేమిటి?' అను కున్నారు కొందరు.

తడబడే అడుగులతో సలాంఖాన్ ఆలీబేగ్‌మీదకు పోబో యాడు. ఆలీబేగ్ అతడి పొట్టలో రెండు చేతుల్తో గుద్దాడు దభీ దభీమని పెద్దగా సింహనాదం చేస్తూ.

సలాంఖాన్ వెనక్కు తూలి పడిపోయాడు.

అతడికి దగ్గరగా వంగాడు రిఫరీ. "ఒకటి, రెండు, మూడు" అంటూ అంకెలు చదువుతున్నాడు రిఫరీ.

సలాంఖాన్ మళ్ళీ లేచాడు, పిడికిళ్ళు బిగించి కసిగా ఆలీ బేగ్ మీదకు పోయాడు.

గట్టిగా తంతే ఎగిరిపడే ఫుట్‌బాలులా మళ్ళీ వెనక్కు వచ్చి పడ్డాడు సలాంఖాన్.

రిఫరీ పది అంకెలు చదవటం పూర్తిచేసినా సలాంఖాన్ లేవలేదు.

సలాంఖాన్ అసిస్టెంట్ వచ్చి సాయంపట్టి అతణ్ని లేవ దీశాడు. నెమ్మదిగా అక్కడ్నుంచి నడిపించుకుని తీసుకు వెళ్ళాడు.

గ్యాలరీల్లో జనం ఆలీబేగ్‌ని అభినందించేందుకు ముందుకు దూకుతున్నారు. వాళ్ళని అదుపులో పెట్టలేక పోలీసులు సత మతమౌతున్నారు.

అక్కడి కక్కడే పెద్ద వెండి కప్పు, పదివేల రూపాయలకు చెక్కూ ఆలీబేగ్ పరం చేయబడినై.

"ప్చ! నమ్మశక్యం కావటంలేదు. సలాంఖాన్ కావాలనే ఓడిపోయినట్టున్నాడు!" స్వగతంలా పైకే అనేశాడు రాజేంద్ర ప్రక్కనే కూర్చున్న లావుపాటి మనిషి.

- "మరీ అంత అన్యాయంగా ఆరోపించకండి! మనం స్వయంగా కళ్ళారా చూశాం గదా?" రాజేంద్ర అతడ్ని రెట్టించి అడిగాడు.

"మీకు తెలీదు సార్! సలాంఖాన్‌ది ఎడమచేతి వాటం. కానీ ఈసారి కుడి చేత్తోనే ఎక్కువ తంటాలు పడ్డాడు!" ఆ వ్యక్తి మళ్ళీ వక్కాణించి పలికాడు.

ఇదేదో కొత్త విషయంలా తోచింది ఇన్స్పెక్టర్ రాజేంద్రకు.

"అంతే కాదు సార్! రెండో రౌండ్‌లో ఆలీబేగ్‌ని చిత్తు చేయటానికి రెండుసార్లు అవకాశం వచ్చినా, వాటిని త్రోసిపుచ్చాడు సలాంఖాన్!"

"అంటే వాళ్ళిద్దరూ లాలూచీ ఆట ఆడారనా మీ అభిప్రాయం?"

"అది ఎన్నటికీ సంభవం కాదు. ఎందుకనంటే, వాళ్ళిద్దరికీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. అలాంటప్పుడు వాళ్ళిద్దరూ ఒక అంగీకారానికిరావటం అయేపని కానేకాదు."

అప్పటికి జనం లేచారు.

"పదండి పోదాం!" సుమిత్ర తొందర చేసింది.

మదగజంలా, గెలుపొందిన సంతోషంతో ఠీవిగా నడుస్తున్నాడు ఆలీబేగ్. అతడ్ని అభిమానులు చుట్టుముట్టారు. అందరూ రిసెప్షన్ హాల్‌కేసి నడిచారు.

"ఏమండీ! మనంగూడ వెళ్ళి అతడ్ని అభినందించి వద్దాం! అందుకు ఆ గొరిల్లా ఎలా కులుకుతాడో చూద్దామా?" సుమిత్ర ముచ్చటపడింది.

4

రిసెప్షన్ హాల్లో సోఫామీద కూలబడ్డాడు ఆలీబేగ్. ఇద్దరు వ్యక్తులు అతడి ఒంటికి ఏదో ఆయిల్ పూసి, కండల్ని రుద్దుతున్నారు.

ఫ్లాష్ కెమేరాలకు పోజులిస్తూ, ప్రెస్‌రిపోర్టర్ల ప్రశ్నలకు బదులు పలుకుతూ, అభిమానులకు ఆటోగ్రాఫ్‌లిస్తూ, ప్రపంచాధిపత్యాన్ని సంపాదించినంతగా పొంగిపోతున్నాడు ఆలీ బేగ్.

మరో కానిస్టేబుల్ జనాన్ని తొలగదీసుకుంటూ, ఇన్స్పెక్టర్ రాజేంద్రకూ, సుమిత్రకూ దారిచేశాడు.

పహిల్వాన్ ఆలీబేగ్‌కి వాళ్ళిద్దర్నీ పరిచయం చేశాడు కానిస్టేబుల్.

"సలాంఖానే గెలుస్తాడని మావారూ, మీరు గెలుస్తారని నేనూ పందెం వేసుకున్నాం. మీరే గెలిచి మావార్ని ఓడగొట్టారు!" అంది సుమిత్ర ఆలీబేగ్‌ని అభినందిస్తూ.

ఆలీబేగ్ కొద్దిగా తలవాల్చి అభివందనం చేశాడు. అందమైన సుమిత్ర వంక అనునయంగా చూస్తూ. "థాంక్యూ మేడమ్!" అన్నాడు యాసగా. అతడి ఛాతీ మరో రెండంగుళాలు పైకి ఉబికింది.

సుమిత్ర చిరునవ్వు నవ్వింది రాజేంద్రవంక చూస్తూ.

ఆలీబేగ్ కూర్చున్న చోటినుంచి లేచాడు. బేరర్ అందించిన తెల్లటి టర్కీ-టవల్స్‌ని నిర్లక్ష్యంగా భుజాన వేసుకుని బాత్‌రూమ్‌లోకి నడిచాడు. బాత్‌రూమ్ తలుపులు మూసి లోపల గడియ పెట్టుకున్నాడు.

లోపల షవర్‌ని త్రిప్పాడు కాబోలు, ఆ శబ్దం గది బయటికి వినిపిస్తోంది.

అయిదు నిముషాలు గడిచాయి. హాల్లో జనం కొద్దిగా పలచబడ్డారు.

పహిలాన్ ఆలీబేగ్ ఖరీదైన దుస్తుల్ని ట్రే మీదుంచుకుని వెయిట్ చేస్తున్నాడు బేరర్.

బాత్‌రూమ్ తలుపులు తెరుచుకున్నాయ్. ఆలీబేగ్ మళ్ళీ ప్రత్యక్షమయాడు. అతడి నడుముకో టవల్ చుట్టుకుని ఉన్నాడు. మరో టవల్‌తో ఛాతీమీద తుడుచుకుంటూ హాలు మధ్యలోకి నడిచాడు.

"సుమిత్రా! మనం వెడదాం రా! అతడు డ్రెస్ చేసుకుని బయటకు వస్తాడులే. కారెక్కబోయే ముందు, అతనికి శుభాకాంక్షలు చెబుదువుగాని మరోసారి!" అంటూ రాజేంద్ర తొందర చేశాడు.

ఇద్దరూ కారిడర్ దాటుకుని బయటకు వచ్చారు. కార్లు కొన్ని అప్పుడే బయలుదేరి వెళ్ళిపోతున్నాయ్. ఇన్స్పెక్టర్ రాజేంద్ర రిసెప్షన్ వైపుగా చూశాడు. అతడు నిల్చున్న చోటునుంచి, చువ్వలు లేని బాత్‌రూమ్ కిటికీగుండా, హాల్లో నిలబడి వైన్‌ని టోస్ట్ చేస్తున్న ఆలీబేగ్ కనిపిస్తున్నాడు.

"ఆ గొరిల్లాగాడ్ని ఉడికించుదామని నేను వెళ్తే, అతడితో రెండుక్షణాలు మాట్లాడేసరికి మీరంతగా అసూయపడాలా?" సుమిత్ర నిష్ఠూరమాడింది.

"చాల్లే! నీ చుప్పనాతి బుద్ధి పోనిచ్చుకున్నావ్‌కాదు! ఏ వంకతో నాతో జగడం వేసుకుందామా అని కాచుకూర్చుంటావ్! అరె! జీప్‌లో వేసున్న నా కోటు మాయమయిందే!" రాజేంద్ర ఆశ్చర్యంతో అరిచాడు.

"నేను ముందే చెప్పానా లేదా? అక్కడ పడేస్తే ఎవరో ఒకరు ఎత్తుకు పోతారని! ఆ కోటు ఎంత ఇన్స్పెక్టర్ గారి దయినా, దొంగలకేం లెక్క చెప్పండి!"

అంతలోనే ఎవరో పెద్దగా అరిచారు.

"అయ్యో! అయ్యో! రక్షించండి! మా అయ్యగారు మాటా పలుకూ లేకుండా పడిపోయారు!" సలాంఖాన్ అసిస్టెంట్ కంఠం అది.

క్షణాల్లో అక్కడకు అందరూ పరుగెత్తుకు వచ్చారు. పోలీసులు రంగంలోకి దూకారు.

ఫ్లాష్‌లైట్ తెచ్చి చూశారు. సలాంఖాన్ గ్రుడ్లు మిటకరించుకుని చూస్తున్నాడు. అతడి ప్రాణాలు ఎప్పుడో అనంత వాయువుల్లో కలసి పోయినయ్.

అతడి టోపీ చిందరవందరై అతడి చెవుల మీదకు జారింది. కోటు పట్టుకుని ఎవరో గుంజినట్టుగా నలిగి పోయింది అతడి కోటు. అతడి ఛాతీలో నాలుగు కత్తిపోట్లున్నయ్. గాయం నుంచి వాలుగా రక్తం కారి కోటు తడిసి పోయింది బారుగా.

డ్యూటీలో ఉన్న ఇన్స్పెక్టర్ గోపాల్ అతని నాడిని చూశాడు. "దేహం ఇంకా చల్లబడలేదు. ఇంతక్రితం కొద్ది క్షణాలముందే ఈ ఘోరం జరిగి ఉండాలి" అన్నాడు శవం మీదనుంచి పైకిలేస్తూ.

పల్చబడుతూన్న జనం తిరిగి మూగారు అక్కడ.

ఇన్స్పెక్టర్ గోపాల్ సలాంఖాన్ కారుని పరీక్షించి చూశాడు. అతడు కూర్చున్న సీటుకుషన్ మీదా, క్రింద పరచిన రగ్గుమీదా, రక్తపు మరకలున్నాయ్. కోటుగుండీ ఒకటి పడి ఉంది రక్తపు మడుగులో.

హతుడి సీటు వెనుక మరో వులెన్ కోటు దొరికింది. దాని గుండీ ఒకటి తెగిపోయి ఉంది.

"ఆ కోటు మీదే కదండి!" సుమిత్ర కంగారుగా అంది.

సీటు వెనుక దొరికిన వులెన్ కోటుమీద గూడ రక్తపు మరకలున్నయ్, అక్కడక్కడా!

ఇన్స్పెక్టర్ గోపాల్, రాజేంద్రకేసి చూశాడు.

"ఇది హంతకుడి కోటే ననటానికి ఎలాంటి సందేహం లేదు. చాలా చౌకబారు రకంది ఇది. ఆనవాలు పట్టేందుకు వీల్లేకుండా టైలర్ లేబిల్ చింపేయబడింది."

"ఐసీ!" ఇన్స్పెక్టర్ గోపాల్ గుడ్లప్పగించి చూశాడు.

"బహుశా సలాంఖాన్ కారులో కూర్చోంగానే, అతడి వెనకాలే హంతకుడు గూడా వచ్చి ఉండాలి. అతడు వచ్చే టప్పుడు ఈ కోటు హతుడి ఒంటిమీదే ఉంది ఉంటుంది!"

"ఎలాగంటారు?"

"ఈ కోటునీ, హతుడి దుస్తుల్నీ బట్టి చూస్తుంటే, వాళ్ళిద్దరి మధ్యా పెనుగులాట జరిగిందని తేట తెల్లమౌతోంది. హంతకుడి కోటు గుండీ తెగిపోయిందిగూడ, ఆ పెనుగులాటలోనే. హంతకుడు కత్తితో మూడు నాలుగు సార్లు పొడిచి ఉంటాడు. తీరా హత్యచేశాక తన కోటుమీద రక్తపు మరకలు పడడం చూసి దాన్ని అక్కడే జార విడిచాడు."

"మరి మీ కోటంటా రేమిటి?"

"అదే! హంతకుడు తన కోటుని ఇక్కడే పారేసి, నా కోటుని వేసుకుని పోయి ఉంటాడనే నా ఊహ! కనుక మిస్టర్ గోపాల్! పోయిన నా కోటుని వెదికి పట్టుకో. దాంతో బాటే హంతకుడూ దొరుకుతాడు." ఇన్స్పెక్టర్ రాజేంద్ర నవ్వుతూ అన్నాడు.

గోపాల్ హ్యాట్ తీసి తల గోక్కున్నాడు. అతడి దృష్టి సలాంఖాన్ అసిస్టెంట్ మీదకు పోయింది. అతడి పేరు హుస్సేన్.

హుస్సేన్ జేబు ఎత్తుగా ఉంది.

"హుస్సేన్! నీ జేబులో ఏముంది?" గోపాల్ అడిగాడు.

"డబ్బు సాబ్! ఇరవయ్ వేలు! మా హుజూర్ చెప్పారు సార్! ఆయన చెప్పినట్టుగానే టౌన్‌లో పెద్ద పెద్ద సేట్లతో పందెం కాస్తినిసార్. సలాంఖాన్ గెలవడని పందెంకట్టాను. అలా కట్టమని సాబే చెప్పినాడు. కుస్తీ పోటీలో ఆలీబేగ్ సాబ్ గెలిచార్! నేను ఇరవయ్ మంది దగ్గర పందెం డబ్బు వెయ్యేసి రూపాయల్ వసూల్ చేస్తిని!"

"నేనప్పుడే చెప్పలేదూ! సలాంఖాన్ ఓటమిలో ఏదో రహస్యం ఉందని!" రాజేంద్ర ప్రక్కనే ఉన్న వ్యక్తి అరిచాడు.

"అసంభవం. దీన్ని నేను ఎంతమాత్రం ఒప్పుకోను. సలాంఖాన్ కావాలని ఓడలేదు. నేనే అతడ్ని నా కండ బలంతో చిత్తుచేశాను. నాకు లభించిన ప్రైజ్ డబ్బుని నాకు కాకుండా చేయటానికి ఇదో ఎత్తులాగుంది!" ఆలీబేగ్ రంకెలు వేస్తూ చిందులు త్రొక్కసాగాడు.

"మీరు శాంతించండి వస్తాదుగారూ! మీరు గెలవటం అన్యాయమని ఎవరూ అనటం లేదు. మాకు కావలసింది ఇంత పెద్ద ఆకారంగల పహిల్వాన్‌ని కిక్కురుమనకుండా ఎవరు హత్య చేశారా అనేదే? కుస్తీ పోటీలు అయిపోగానే సలాంఖాన్ అసిస్టెంట్ హుస్సేన్ తన యజమాని రహస్య ఒప్పందం ప్రకారం బెట్ కట్టిన డబ్బుని వసూలు చేసుకున్నాడు.

"అప్పుడే ఈ విషయాన్ని పసిగట్టిన వ్యక్తి ఎవరో, జరిగిన మోసాన్ని గ్రహించి, కోపోద్రిక్తుడై సలాంఖాన్ వెనుకే పొంచివచ్చి అతడ్ని హత్యచేసి ఉండాలి. మరయితే సలాంఖాన్ ఏం సామాన్యుడా? బకాసురుడంత వ్యక్తి! అతడితో తలపడాలంటే మాటలా? కనుక హంతకుడు కూడా మాజీ వస్తాదో, వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియనో అయి ఉండాలి!" ఇన్స్పెక్టర్ గోపాల్ అందరి వంకా చూశాడు.

హుస్సేన్‌తో పందెం కాసిన ఇరవైమంది సేట్లలో సలాంఖాన్‌కి సమ ఉజ్జీలెవరయినా ఉన్నారేమో అని అక్కడికక్కడే వారందరి పేర్లూ హుస్సేన్‌ని అడిగి తెలుసుకున్నాడు గోపాల్.

కానీ వారిలో సలాంఖాన్‌తో తలపడే సామర్థ్యం గల వాళ్ళెవరూ లేరు మచ్చుకైనా.

బయలుదేరిన జనం అంతా లోపలకు తరలించబడ్డారు. ప్రాథమిక పరిశోధన పూర్తయేవరకూ ఎవరూ వెళ్ళిపోరాదని శాసించారు పోలీసులు.

5

స్టేడియం గ్రౌండ్‌లో జనం గుంపులు గుంపులుగా జేరి హత్య విషయాలే చెప్పుకుంటున్నారు.

మరికొందరు రిసెప్షన్‌హాల్‌లో సమావేశమైనారు.

ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర అందరి దగ్గరా పరీక్షగా వెదుకుతున్నాడు.

"ఏమిటి వెదుకుతున్నారు?" అడిగింది సుమిత్ర.

"ఇంకేముంది? నా కోటు!"

"అక్కడ పారేయకండీ పోతుంది అని మొత్తుకుంటే విన్నారా?"

"అది పోవడమే మంచిదయింది. హంతకుడ్ని పట్టి ఇచ్చేందుకు అదే మనకు ఆధారం!" రాజేంద్ర నవ్వు చూస్తే సుమిత్రకు చిరాకెత్తింది.

ప్రక్కరూములోంచి ఆలీబేగ్ అసిస్టెంట్ అన్వర్ వచ్చాడు. "ఏమిటి? అందరూ ఇంకా ఇక్కడే ఉన్నారే!" అన్నాడు జనం వంక చూస్తూ.

"ఈ కుస్తీపోటీలో సలాంఖాన్ కావాలనే ఓడిపోయాడట! తెలుసా?" సలాంఖాన్ అభిమానులెవరో అన్నారు.

"ఎవడా మాట అనేది? వాడ్ని తోలు వలిచేస్తాను. మా సాబ్ ఎంతో శ్రమపడి, కండలు పెంచి, నేర్పు సంపాదించి మరీ, సలాంఖాన్‌ని చిత్తుచేసేశాడు" అన్వర్ చిందులు త్రొక్కాడు.

"అది సరేలే! ఇప్పుడు సలాంఖాన్ చచ్చిపోయాడు తెలుసా?" గోపాల్ అతడి వంక చూస్తూ అన్నాడు.

"చాల్లెండి పరాచికాలు! ఆ ముసలాడు ఇంకా మా సాబ్ చేతుల్లో ఎన్నిసార్లు ఓడిపోవాలో! అప్పుడే ఛస్తే ఎలా?"

"ఇది నిజమేనబ్బా! సలాంఖాన్ చనిపోయాడు."

"నిజంగా! అయితే ఈ ఓటమిని భరించలేక అల్లా దగ్గరికి పారిపోయి ఉంటాడు? హ్హ హ్హ!" అన్నాడు అన్వర్.

"హత్యతోబాటు మరో దొంగతనం గూడా జరిగింది" రాజేంద్ర నింపాదిగా అన్నాడు.

"హాయ్! హాయ్! ఇది మరీ వింతగా ఉంది, ఏం పోయిందేమిటి?" అన్వర్ కులుక్కుంటూ అడిగాడు.

"నా కోటు పోయింది. దాని కోసమే నేను ఇంత సేపట్నుంచీ వెదుకుతూంట! అమ్మయ్య! ఇప్పుడది దొరికింది!" రాజేంద్ర నిట్టూర్పు విడిచాడు.

అన్వర్ ముంచేతి మీద మడత వేసిన కోటు వ్రేలాడు తోంది. దాన్ని లాక్కున్నాడు రాజేంద్ర.

"ఇది నాదేనండీ! మీరు లాక్కుంటా రేమిటి?" అన్వర్ గోల పెట్టాడు.

"చూడు మిస్టర్! ఇది నా కోటు అని ఋజూపర్చ గలను. కోటు కుడిప్రక్కన సిగరెట్ కాల్చిన మరక వుంది. ఎడమవేపు జేబుకు చిల్లి వుంది. టైలర్ లేబిల్ ఉంది, చూసుకో!"

ఈ దఫా అన్వర్ ఆశ్చర్యం ప్రకటించాడు. "అయితే ఈ కోటు చాలాసేపట్నుంచి నా దగ్గరే వున్నదే! ఇది మీదయితే, మరి నా కోటు ఏమయినట్టూ?"

రక్తసిక్తమైన కోటు మడత వేయబడి ఉంది ఇన్‌స్పెక్టర్ గోపాల్ దగ్గర. రాజేంద్ర దాన్ని అందుకుని మడత విప్పకుండానే దాన్ని అన్వర్‌కి అందించాడు. "బహూశా ఇదే మీ కోటు అనుకుంటాను."

"అవునండోయ్! ఈ రెండు కోట్లూ ఒకే రంగులో వుండటం మూలాన్న ఆ తేడా కనుక్కోలేకపోయాను."

రాజేంద్ర తన కోటుని పరీక్షగా చూశాడు. దాని భుజాల దగ్గర చిరుగులున్నయ్, కుట్లు ఊడిపోయాయి.

"ఏమిటయ్యా ఈ అన్యాయం! మంచి కోటుని తీసుకుని ఇలా చిరగ్గొడతారా?" విసుక్కున్నాడు రాజేంద్ర.

"అయితే రాజేంద్రగారూ! మీ కోటు దొరికితే హంత కుడు దొరుకుతాడన్నారు కదా? కోటేమో దొరికింది. మరి హంతకు డెక్కడ?" ఇన్‌స్పెక్టర్ గోపాల్ అడిగాడు అమాయకంగా.

"ఆ పాయింటుకే వస్తున్నానండీ! సలాంఖాన్‌ని కత్తితో పొడిచాడు హంతకుడు. అంటే అతడూ సలాంఖాన్‌కి సమ

ఉజ్జ అయి వుండాలి. తర్వాతి అంశం. సలాంఖాన్ గెలిస్తే పదివేలు లభిస్తయ్. కాని వెను వెంటనే అతడి ఋణ దాతలు గ్రద్దల్లా ఆ డబ్బుని తన్నుకుపోతారు. ఈ అపాయం నుంచీ తన్ను తాను రక్షించుకునేందుకు సలాం ఖాన్ బ్రహ్మాండమైన పథకం వేశాడు.

"తను ఓడిపోతే, తన బాకీదారులు సంవత్సరం దాకా తన జోలికి రారు. తర్వాత, చాలామంది ప్రేక్షకులు ఈ దఫా గూడా సలాంఖానే గెలుస్తాడని అభిప్రాయపడు తూండాలి. ఈ అవకాశాన్ని వినియోగించుకుని పెద్ద పెద్ద ధనికులతో తన అసిస్టెంట్ చేత తలకు వెయ్యేసి రూపా యలు పందెం కాయించాడు. ఆ రకంగా సలాంఖాన్ తన ఓటమివల్ల రెండు విధాలా లాభం పొందాడు. అందుకే అతను కావాలనే ఓడిపోయాడు.

"అయితే కుస్తీ పోటీలు ముగుస్తూనే ఈ విషయం ఎలానో బయటపడింది. హంతకుడు కోపోద్రిక్తుడై సలాం ఖాన్‌తో తలపడి, కత్తితో పొడిచి ఈ ఘోరం తల పెట్టాడు."

"వండర్‌ఫుల్! హత్యకు కారణాన్ని బాగా ఊహించారు రాజేంద్రా! ఇంతకీ హంతకుడెవరో వివరించలేదు!" గోపాల్ అడిగాడు, తన బెల్టుకున్న రివాల్వర్‌ని సర్దుకుంటూ.

"హంతకుడు నా కోటుని బలవంతంగా తన శరీరానికి పట్టించుకున్నాడనేది, కోటు భుజాలవద్ద చిరుగులే చెబు తున్నాయ్. అంటే అతడిది నాకన్న పెద్ద పర్సనాలిటీ అన్న మాట. తర్వాత అతడు హత్య చేసేటప్పుడు ఒక కోటుని ధరించే వున్నాడు. హత్య జరిగాక, తన కోటుమీద రక్తపు మరకలు పడటాన్ని గ్రహించిన హంతకుడు కోటు విప్పి కారులోనే పడేశాడు. అతడికి కోటు లోపల మరో

చొక్కానో, లేక బనీనో వుంటే వాటితోనే వెళ్ళిపోయి వుండేవాడు. అవేమీ లేకపోవటంతో, అతడు అర్ధనగ్నంగా వున్న తనను ఎవరైనా ఇట్టే గమనించగలరని ప్రక్కనే జీప్‌లో కనబడుతూన్న నా కోటు వేసుకొని వెళ్ళిపోయాడు."

"అంటే హంతకుడికి కోటు మినహా ఏమీ లేకుండా వచ్చాడనా? అసంభవం! ఈ చలిలో ఒంటిన బనీను గూడ లేకుండా ఎవరు వస్తారు సార్!" గోపాల్ అభ్యంతరం పలికాడు.

"రాజేంద్ర ఏం మాట్లాడుతున్నాడో సరిగా తెలిసే మాట్లాడుతున్నాడా అని నా అనుమానం!" వస్తాదు ఆలీ బేగ్ కోపంగా చూశాడు.

"ఇంతమందిలో ఎవరూ నా మాటల్ని శంకించలేదు. గుమ్మడికాయల దొంగ ఎవరంటే, భుజాలు తడుముకున్నట్టుగా, నీవే ఉలిక్కిపడ్డావ్! మిస్టర్ ఆలీ బేగ్! నీవే ఈ హత్యచేశావ్! స్నానంచేసే మిషతో బాత్‌రూమ్‌లోకి నగ్నంగా వెళ్ళావ్. తలుపులు మూసుకున్నావ్, షవర్ తిప్పి, ఊచలులేని కిటికీలోంచి బయటకు వెళ్ళావ్. మీ కారులో అన్వర్ కోటుతీసి తొడుక్కున్నావ్! సలాంఖాన్‌ని హత్యచేశావ్! నీ కోటుమీద రక్తం చింది పడింది.

అందుకే దాన్ని అక్కడే పారేశావ్! నీ ఒంటిమీద లంగోటా తప్ప మరేం లేదు. ఆ ఆకారంతో వెడితే నిన్ను ఎవరైనా చూస్తే ఉత్తరోత్తరా ప్రమాదం! అందుకే నా కోటు వేసుకున్నావ్! నీ కారుదాకా నడిచివెళ్ళి నా కోటు నక్కడే వదిలేసి కిటికీలోంచి మళ్ళీ బాత్‌రూమ్‌లోకి వచ్చావ్! లోపల షవర్ చప్పుడువలన, బాత్‌రూమ్ బయట వేచివున్న మేమందరం నీవు ఇంతసేపూ లోపలే వున్నావని అనుకుంటామని నీ పథకం."

"నిన్ను, నిన్ను ఏం చేస్తానో చూడు!" అంటూ పళ్ళు కొరుకుతూ, పిడికిళ్ళు బిగించి ముందుకు వచ్చాడు ఆలీబేగ్.

రాజేంద్ర చటుక్కున ప్రక్కకు త్రిప్పుకుని, ఆలీబేగ్‌కి కాలు అడ్డంపెట్టి బ్రేక్ వేశాడు.

'ధన్'మంటూ ఆలీబేగ్ నేలను కరుచుకున్నాడు.

రివాల్వర్‌ని అతడి వీపుకానించి "హాండ్సప్" అని అరిచాడు ఇన్‌స్పెక్టర్ గోపాల్,

"ఇంతకీ అతడ్నెందుకు హత్యచేశావ్?" గర్జించాడు రాజేంద్ర.

"సలాంఖాన్ దయాదాక్షిణ్యాలమీద నేను గెలిచాననే విషయాన్ని సహించలేకపోయాను. పైగా ఇరవై మందితో పందెం కాయించి, ఇరవై వేలు గెలిచాడు. కుస్తీపోటీలో గెలిచిన నేను కేవలం పదివేలతో తృప్తిపడాలా? ఓడి పోయినవాడు ఎవరికీ తెలియకుండా, గుట్టుచప్పుడు కాకుండా ఇరవై వేలు గెల్చుకోవటాన్ని నేను ఆమోదించలేకపోయాను. అందుకే ఆవేశంలో అంతపని చెయ్యాల్సివచ్చింది" అవ మానంతో తలదించుకుని పోలీస్ వాన్‌లో ఎక్కాడు ఆలీబేగ్.

"మీ రీ సమయంలో వుండటంవలన హంతకుడ్ని వెంటనే పట్టుకోగలిగాం సార్! మీకు చాలా థ్యాంక్స్!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ గోపాల్, రాజేంద్రను అభినందిస్తూ.

"థ్యాంక్స్ నాకు కాదండీ! వాస్తవానికి అది నా కోటుకి చెందాలి!" నవ్వుతూ చెప్పాడు ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర.

"ఆ కోటు మీ మామగారిచ్చిందని గూడ చెప్పడం మర్చిపోకండి!" అంది సుమిత్ర భర్తను మోచేత్తో పొడుస్తూ.

రాజేంద్ర తృప్తిగా నవ్వుకున్నాడు. జీప్ ముందుకు సాగింది.

★

పాఠకుల ప్రశ్నలు

జొన్నలగడ్డ రమాదేవి, రాజమండ్రి.

అన్నయ్యా? ఈ ప్రపంచంలో అతి నిర్మలమైనది ఏమిటి?

పాపాయి చిరునవ్వు.

పోచంపల్లి నారాయణ, బొంబాయి-13.

సినిమా జీవితములో పూలపాన్పులే కాదు, ముండ్ల బాటలు కూడా వుంటాయంటారు. నిజమా?

మాది సినిమా జీవితం కాదు—పత్రికా జీవితం.

మార్ని రాజా, రాజమండ్రి-3

శ్యామ్‌జీ! మీ కలం పేరు ఏమిటి?

హీరో. చైనా మేడ్.

న్యాయపతి రమేష్‌బాబు, బరంపురం.

దేవుడే మీ దగ్గరకు వచ్చి, వరం ఏదైనా కోరుకోమంటే, మీరు ఏం కోరుకుంటారు?

తన మహిమతో అపన, సప్లిమెంట్‌లను 20వ తేదీకల్లా పాఠకులకు అందజేసి రమ్మంటాను.

సి. హెచ్. గంగారాజం, బొంబాయి.

మన దేశంలో పేదరికం నిర్మూలన అవుద్దో, కాదో అని నా అనుమానం?

నాయకులంతా చిత్తశుద్ధితో పూనుకుంటే పేదరికం నిర్మూలన పెద్ద సమస్య కాదు.

ఆర్. జీవన్, పెంటకలాన్.

రెడ్డిగారూ! అన్నిటి ధరలు కాస్తో, కూస్తో తగ్గుముఖం పట్టాయి. పేపరు ధర తగ్గలేదా?

పత్రికలకు వాడే ఫారిన్ న్యూస్ ప్రింటు ధర ఇంతో అంతో పెరుగుతున్నది తప్ప తగ్గటమంటూ ఇంతవరకు జరుగలేదు. పైగా పోస్టలు చార్జీలు, ప్రింటింగ్ రేట్లు, నిర్వహణ ఖర్చులు యెప్పటికప్పుడు పెరుగుతూనే వున్నాయి.

బెల్లంకొండ నాగేశ్వరరావు, గుంటూరు.

ఎడిటర్‌జీ! నేను మీ పత్రికకు ఎన్ని కథలు పంపినా, అవన్నీ తిరిగి వస్తూనే వున్నాయి. ఆ కథలు మీకు నచ్చనట్లేనా?

అంతేకదా, మరి!

టి. యస్వీ. పిళ్ళే, హైద్రాబాదు.

రెడ్డిగారూ! డిటెక్టివ్ నవల్సులో డిటెక్టివ్ ఎప్పటికి గెలుస్తూ ఉంటాడు. విలన్స్ ఓడిపోతారు. డిటెక్టివ్ ఓడిపోయి—విలన్స్ గెలిస్తే ఎలా ఉంటుంది?

అప్పుడప్పుడు అదికూడా జరుగుతూనే వుంటుంది కదా. క్లైమాక్స్‌కు ముందు.

జి. రాజారెడ్డి, దేవలంపేట.

శ్యామ్‌జీ! జ్యోతిష్య శాస్త్రం దృష్ట్యా మీకు 1977లో సినిమా తీసే సంకల్పం వుండేట్లు తెలుస్తుంది. నిజమేనంటారా?

మీ జోస్యం నిజం కాకపోవచ్చు. అయినా 1977లో కదా! అంటే ఇంకా ఏడాది వుంది. వేచి చూద్దాం!! ★

బహుమతి గ్రహీతలు (3)

కుమారి ఎమ్. వి. సుబ్బలక్ష్మి

స్వస్థలము నరసాపురం. కానీ పుట్టిన ఊరు గుడివాడ. ప్రస్తుత నివాసము హైదరాబాదు. చదివింది బి. ఇడి. అయినా, ఆర్. టి. సి. లో ఎకౌంట్ సెక్షన్‌లో క్లర్కుగా పని చేస్తున్నాను.

వివిధ పత్రికలలో పడే పోటీలలో పాల్గొనటం నాకు ఇష్టమైన కార్యక్రమం. హైస్కూలు, కాలేజి చదువులో అనేక జాతీయ, అంతర్జాతీయ వ్యాసరచన పోటీలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్స్ వచ్చినవి. నాకు ఎక్కువగా ప్రోత్సాహం ఇచ్చేది యిల్లాంటి విషయాలలో మా నాన్నగారు.

పత్రికలు, అభిమాన రచయితల నవలలు చదవటం, సినిమాలు చూడటం నా హాబీ. కొమ్మూరి సాంబశివ రావు, యద్దనపూడి సులోచనారాణి, వసుంధర, యఱ్ఱంశెట్టి శాయి మొదలైనవారు నా అభిమాన రచయితలు. ఎక్కువగా నేను ఇష్టపడే పత్రికలు అపరాధపరిశోధన, చందమామ. నాగేశ్వరరావు, శోభన్ బాబు, వాణిశ్రీ నా అభిమాన తారలు.

వివాహ విషయంలో పెద్దలు నిర్ణయించి చేసినవే సరైనవని నా అభిప్రాయం.

"అపరాధ పరిశోధన"లో నిర్వహించిన వివిధ పోటీలలో నాకు ఇంతవరకు 'మీ తీర్పు ఏమిటి'లో 2, 'అపన పోటీ'లో 2, 'పాఠకుల పరిశోధన పోటీ'లో 3, 'క్రైమ్‌లో తమాషాలు'లో 2 బహుమతులు లభించాయి.

ఎల్. రామగోపాల్

కిరాయి హంతకులు

రాత్రి పది గంటలయింది.

అప్పుడే మొదటి ఆట వదిలిపెట్టారు. చక్రవర్తి సినిమా హాల్లోంచి బయటకు వచ్చి, సిగరెట్ వెలిగించి, తాపీగా నడవటం మొదలు పెట్టాడు.

రోడ్లన్నీ చాలా సందడిగా ఉన్నాయి. కిక్కిరిసిన జనం ఒకర్నొకరు నెట్టుకుంటూ వెళుతున్నారు.

చక్రవర్తి తనను నెట్టుకుంటూ వెళుతున్న జనాన్ని చూసి చిన్నగా నవ్వుకున్నాడు. తనెవరో వాళ్ళకు తెలియదు. అందుకే అంత ధైర్యంగా తన దగ్గరకు రాగల్గుతున్నారు. నిజంగా తనెవరో తెలిస్తే, తన దగ్గరకు రావడమే కాదు, తన వైపు చూడడానికే భయపడుతారు జనం.

మూడు సంవత్సరాలనుంచి అహర్నిశలు ఒక అంతు తెలియని అనామక హంతకుడి కోసం గాలిస్తున్నారు పోలీసులు. అతని రూపురేఖలు ఎలా వుంటాయ్, అతనెక్కడ వుంటాడో ఎవ్వరికి తెలియదు. అయినా వెదుకుతూనే వున్నారు. ఆ అనామక హంతకుడు తనేనని తెలిస్తే....? చిన్నగా నవ్వుకున్నాడు.

తను ఏ హత్య చేసినా చాలా పకడ్బందీగా చేస్తాడు. ఆరు హత్యలు చేసి కూడా, పోలీసులకు ఎలాంటి ఆధారం వదలకుండా తప్పించుకొని తిరగగల్గుతున్నాడు.

తన కెవ్వరిమీదో కోపం వుండి కాదు ఆ హత్యలు చేసింది, తన భుక్తి కోసం చేశాడు ఆ ఆరు హత్యలు. ప్రతి ఒక్కడికి పొట్ట గడవడానికి ఏదో ఒక వృత్తి వుండాలి. తన వృత్తి హత్యలు చెయ్యడం. డబ్బిస్తే, ఎవర్ని హత్య చేయమంటే వాళ్ళను హత్య చేస్తాడు.

కిరాయి హంతకుడు తను!

ఏదో కారు వేగంగా వచ్చి తన పక్కనే షడన్ బ్రేకుతో ఆగేసరికి, ఉలిక్కిపడి తల తిప్పాడు చక్రవర్తి.

డ్రైవింగ్ సీట్లో ఒక అందమైన యువతి కూర్చొని ఉంది. చక్రవర్తి అనుమానంగా ఒకసారి పరిసరాలు గమనించాడు. ఆ వీధిలో జనం అంత బాగా లేరు.

"హల్లో! చక్రవర్తీ! గెటిన్!" కోకిల స్వరంలా ఉంది ఆమె కంఠం.

ఆమె ఎవరో తనకు తెలియదు. అయినా తన పేరు పెట్టి పిలిచింది. ఎవరయినా తన క్లయింటా? లేక ఇదే దయినా పోలీసుల పన్నాగమా? ఏం చేయాలి? ఆలోచిస్తున్నాడు చక్రవర్తి.

చటుక్కున కారు డోర్ తెరుచుకుంది.

"మిస్టర్ చక్రవర్తీ! మర్యాదగా కారెక్కు" కరకుగా వుంది ఆమె కంఠం. ఒక చేతిలో నల్లటి పిస్తోలు, చీకట్లో కూడ మెరుస్తూంది.

చక్రవర్తి ఒక్కక్షణం ఆశ్చర్యపడి, వెంటనే తేరుకొని మాట్లాడకుండా కారెక్కి కూర్చున్నాడు.

కారు ముందుకు కదిలింది. చక్రవర్తి ఏమీ మాట్లాడ లేదు ఆమె వైపే చూస్తూ వుండిపోయాడు. ఒక చేత్తో స్టీరింగ్ కంట్రోల్ చేస్తూ, ఇంకో చేత్తో పిస్టలు తనకు గురి పెట్టి వుంది. ఆమె చేతివైపు ఒక్క నిముషం పరీక్షగా చూశాడు.

పిస్టల్ను పట్టుకున్న ఆమె చెయ్యి, కొద్దిగా కూడా వణకడం లేదు. పిస్టలు షూటింగ్‌లో ఎంతో అనుభవం వున్నదానిలా, పిస్టలును స్టడీగా కరెక్ట్ పొజిషన్‌లో పట్టుకుంది. కారు కుదుపులకు కూడా ఆమె చెయ్యి కదలడం లేదు.

చక్రవర్తి చిన్నగా నవ్వాడు. "సిగరెట్ వెలిగించ వచ్చా?" అడిగాడు నవ్వుతూ.

"డోంట్ మూవ్! ఇలా జరుగు" అని కారుని స్లోజేసి, స్టీరింగ్ వదలిపెట్టి, ఆ చేత్తోనే అతని పాకెట్‌లోని సిగరెట్ పెట్టి, లైటర్ తీసి పక్కగా పెట్టి, "ఇప్పుడు వెల్గించు" అంది ఆమె.

చక్రవర్తి భుజాలెగరేసి, సిగరెట్ వెల్గించాడు. "ఇంతకూ అసలు విషయమేమిటో చెప్పలేదు!" అన్నాడు పొగ రింగులురింగులుగా వదులుతూ.

"చెబుతాను! తొందరపడకు!" అంది రోడ్డు వైపే దృష్టి కేంద్రీకరించి.

చక్రవర్తి మళ్ళీ మాట్లాడలేదు. పది నిముషాలు గడిచాయి. ఢిల్లీ నగరం దాటి వచ్చేసారు. దూరంగా కొండలు కన్పిస్తున్నాయి.

కారు నెమ్మదిగా కొండలవైపు తిరిగింది, ఒక పెద్ద కొండ చాటుగా కారాపి, "దిగు!" హెచ్చరించింది ఆమె.

చక్రవర్తి ఒక నిశ్చయానికి వచ్చాడు. కారు డోర్ తెరచి, క్రిందకు దిగబోతూ, చటుక్కున వెల్లకిలా పడి, కాళ్ళతో ఆమె చేతిలో వున్న పిస్టలు ఎగరగొట్టాడు. అనుకోని ఈ సంఘటనకు ఆమె ఒక్క క్షణం బెదిరిపోయింది.

"వ్రేలు కూడ కదపకు! ఈసారి వంతు నాది" హెచ్చరించాడు చక్రవర్తి. అతని చేతిలో ఆటోమ్యాటిక్ మెరుస్తోంది.

ఆమె నవ్వింది. చిన్నగా కాదు. పెద్దగా నవ్వింది. "గుడ్! నీలాంటివాళ్ళే నాకు కావలసింది! పిస్టలు పారెయ్యి! నాతో రా!" అంటూ, క్రింద పడివున్న తన పిస్టలు అందుకొని ముందుకు నడిచింది.

చక్రవర్తి ఆమె ప్రవర్తనకు ఆశ్చర్యపోతూ, నెమ్మదిగా ఆమెను అనుసరించాడు.

పది నిముషాలపాటు చిన్నచిన్న గుట్టలు, బండలు దాటి ఒక గుహలా వున్న ప్రదేశం ముందు ఆగింది ఆమె.

"లోపలికి రా!" అంది చక్రవర్తివైపు చూస్తూ.

లోపలంతా చీకటిగా-వున్నా, ముందుకు పోయేకొలది ఎక్కడో కాస్త వెలుగు వస్తున్నట్లనిపించింది.

లోపలికి వెళ్ళగానే చక్రవర్తి ఆశ్చర్యపడ్డాడు. చాల విశాలంగా వుందా గుహ. నేలంతా చక్కగా చిమ్మినట్లు చాల శుభ్రంగా వుంది. అక్కడక్కడ కొవ్వొత్తులు వెల్గుతున్నాయి. గుహ మధ్యలో ఒక స్థంభానికి ఎవర్నో కట్టేసి వున్నారు.

అతన్ని చూడగానే చక్రవర్తి ఒక్క క్షణం విస్తుపోయాడు. 'రతన్' అనుకున్నాడు మనస్సులో. రతన్ కూడ తనలాంటి కిరాయి హంతకుడే. ఒకసారి పోలీసులకు పట్టుబడి తప్పించుకున్నాడు. అప్పటినుంచి అనేక రకాల వేషాలలో తిరుగుతూ వుంటాడు.

"నువ్వా? చక్రవర్తీ!" అన్నాడు రతన్ ఆశ్చర్యంగా.

"వెల్! ఇద్దరూ ఒకర్నొకరు గుర్తుపట్టారన్నమాట!" అంటూ, ఆమె రతన్ కట్లు విప్పి, పిస్టలు ఇద్దరికీ గురి పెట్టింది. "మిమ్మల్నేదో చేయాలని ఇక్కడకు తీసుకు రాలేదు. నాకు మీ సహాయం కావాలి! తప్పనిసరి పరిస్థితులలో మిమ్మల్ని అలా తీసుకురావలసివచ్చింది. కోపగించుకో వద్దు. నేనన్నిటికి తెగించాను" అంది ఆమె దూరంగా వున్న ఒక పెద్ద బండమీద కూర్చుంటూ.

రతన్ అలసటగా ఒళ్ళు విరుచుకొని, చక్రవర్తివైపు చూచాడు.

చక్రవర్తి తల ఊపి, "అలాగే! అసలు నువ్వెవరు! విషయమేమిటో చెప్పు!" అన్నాడు తనూ ఒక రాయిమీద కూర్చుంటూ.

"నా పేరు సుజాత. మీరిద్దరూ కలిసి ఒక హత్య చేయాలి! చెయ్యగలరా?" అడిగింది ఇద్దరివైపు సూటిగా చూస్తూ.

చక్రవర్తి పెద్దగా నవ్వాడు. "అందుకా ఇంత హంగామా! ఒక హత్య చేయడానికి ఇద్దరు కావాలా? నేనొక్కడినే చేస్తాను! చెప్పు! ఎవర్ని హత్య చెయ్యాలి?" అడిగాడు నవ్వుతూ.

సుజాత చక్రవర్తి కళ్ళల్లోకి నిశితంగా చూస్తూ, "పరిస్తాన్ అంబాసిడర్ 'అక్తర్'ను హత్య చెయ్యాలి! చెయ్యగలవా!" అంది గంభీరంగా.

ఉలిక్కిపడ్డారు ఇద్దరూ. "పరిస్తాన్ అంబాసిడర్‌నా?" ఇద్దరూ ఆశ్చర్యంగా అడిగారు.

"ఏం! భయంగా వుందా? అందుకే ఇద్దరూ కలిసి చేయాలన్నది, మీలో ఏ ఒక్కరైనా ఈ హత్య చెయ్యగలరా? చెయ్యలేరు! నాకు తెలుసు. అందుకే ఇద్దర్నీ పిలిచాను. ఈ హత్యచేస్తే చెరొక లక్ష రూపాయలిస్తాను!" అంది సుజాత.

"లక్ష రూపాయలే!" ఆశ్చర్యపోయాడు రతన్.

చక్రవర్తి ఆమెవైపు సూటిగా చూచి, "అసలు పరిస్తాన్ అంబాసిడర్‌ను హత్యచేయించవలసిన అవసరం నీకేమిటి? నువ్వు చూస్తే, ఒక సామాన్య సంసారస్త్రీలా వున్నావ్! ఆ పరిస్తాన్ గూఢచారిని హత్య చేయించవలసిన అవసరం నీకేమొచ్చింది!" అడిగాడు అనుమానంగా.

ఒక్క క్షణం ఆమె మొహం దీనంగా మారిపోయింది. "చెబుతాను. కాని ఒక విషయం గుర్తుంచుకోండి! అంతా విని మాట తప్పకూడదు.

నా భర్త 'విజయ్' మన దేశ స్పెషల్ బ్రాంచి ఏజెంటు. మా కిద్దరు పిల్లలు. ఈ మధ్య మన దేశంలో ఏదో కొన్ని ముఖ్యమైన కాగితాలు మాయం కావడానికి కారకుడు పరిస్తాన్ అంబాసిడర్ అక్తర్ అని తెలిసిన మావారు, రెండు రోజులు అహర్నిశలు అతన్ని వెంటాడి అసలు రహస్యం తెలుసుకున్నారు. 'అక్తర్' పరిస్తాన్‌లో ఒక పేరుమోసిన గూఢచారి. మన దేశంలో గూఢచారిగా అడుగు పెడితే, వెంటనే పట్టుబడిపోతానని, పరిస్తాన్ ఆదేశంతో, వాళ్ళ దేశం తరపున అంబాసిడర్‌గా మనదేశంలో స్థిర పడి, గూఢచారి వృత్తి కొనసాగిస్తున్నాడు.

కాని వాళ్ళు ఎలా పసికట్టారో, నా భర్త వాళ్ళ విషయం తెల్సుకున్నాడని గ్రహించి, నా భర్తను చంప డానికి వెంటాడారు. మా ఇంట్లో జొరబడి నా భర్తను, పిల్లల్ని కాల్చి చంపారు. అంతేకాదు, నా శీలాన్ని కూడ నాశనంచేసి వెళ్ళారు." అని ఒక్క నిముషం ఆగి, "అప్పటి నుంచి నాలో ద్వేషం రగిలింది. పచ్చటి మా సంసారాన్ని నాశనం చేసిన ఆ కిరాతకుడు బ్రతికివుండటానికి వీల్లేదు. అజ్ఞాతంగా వుంటూ వాడిని చంపడానికి ప్రయత్నించాను. కాని లాభం లేకపోయింది. నా దగ్గర కావలసినంత డబ్బు వుంది. అదంతా మీకిచ్చేస్తాను. ఆ దుర్మార్గుణ్ణి చిత్రహింస చేసి చంపాలి. అంతవరకు నాకు శాంతి లేదు. ఏం చెయ్య గలరా?" ఆవేశంగా అడిగింది సుజాత.

ఇద్దరూ ఒక్క నిముషం మాట్లాడలేదు.

రతన్ సుజాతవైపు పరీక్షగా చూశాడు. సుమారు పాతి కేళ్ళుంటాయి. తెల్లటి శరీరచ్ఛాయ, అందమైన గుండ్రటి మొహం, పెద్దపెద్ద కళ్ళు, సన్నటి ముక్కు, చిన్న పెదాలు, శంఖంలాంటి మెడ, ఎత్తైన వక్షోజాలు; సుజాతను చూస్తుంటే రతన్‌కు నరాలన్నీ ఉద్రేకంతో బిరుసెక్కాయి.

"మీరిద్దరూ కలిసి ఈ హత్య చెయ్యలేరా?" ఈసారి ఆమె కంఠంలో ఏదో దిగులు ధ్వనిస్తోంది.

చక్రవర్తి లేచి నిలబడ్డాడు. "నేను చేస్తాను. ఒక కుల స్త్రీని మానభంగం చేసినందుకు, నా దేశభక్తుడ్ని చంపి నందుకు కసి తీర్చుకుంటాను. నేను హంతకుడినేగాని. దేశ ద్రోహిని కాదు. ఇన్నాళ్ళు నా వృత్తిలోని కాఠిన్యాన్ని, ధైర్యాన్ని ఈసారి ఉపయోగిస్తాను. ఆ గూఢచారిని చిత్ర హింసపెట్టి చంపుతాను." ఆవేశంగా అరిచాడు చక్రవర్తి.

సుజాత చక్రవర్తివైపు ప్రశంసాపూర్వకంగా చూచింది.

"నేనూ చక్రవర్తితో చేయి కలుపుతాను. వాణ్ణి చంపేంత వరకు నేను నిద్రపోను! ఈ విషయంలో నువ్వు నిశ్చింతగా వుండు." చెప్పాడు రతన్.

సుజాత కళ్ళు ఆనందంతో మిలమిల మెరిసాయి.

2

రాత్రి పన్నెండు గంటలయింది.

ఢిల్లీ వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. పరిస్తాన్ ఎంబసీ కార్యాలయానికి ఎదురుగా కొంచెం దూరంలో వున్న కిళ్ళీకొట్టు కీనీడలో నిలబడి, పరిస్తాన్ ఎంబసీ కార్యాలయం వైపే పరీక్షగా చూస్తున్నాడు చక్రవర్తి.

పరిస్తాన్ ఎంబసీ కార్యాలయం మేడమీద గదిలో లైట్లు వెల్గుతున్నాయి. అదే 'అన్వర్' నివాసం. ఎంబసీ కార్యా

లయం చుట్టూ పెద్ద ప్రహరీ ఉంది. పరీక్షగా అటువైపు చూస్తూ 'లోపలికి ఎలా వెళ్లాలి?' అని ఆలోచిస్తున్నాడు చక్రవర్తి.

అయిదు నిముషాలు గడిచాయి. విసుగ్గా రేడియం వాచీ వైపు చూచాడు. పన్నెండుంబావు అయింది. పన్నెండు గంటలకు వస్తానన్న రతన్ ఇంకా రాలేదు. రతన్ మీద కోపం వచ్చింది చక్రవర్తికి.

అంతలో రతన్ చప్పుడు లేకుండా పరుగెత్తుకొచ్చాడు.

"నీవు చాలా ఆలశ్యం చేసావ్!" విసుక్కున్నాడు చక్రవర్తి.

"సారీ! ఫ్రెండ్స్ త్రాగమని బలవంతం చేస్తే కాదన లేకపోయాను" అన్నాడు రతన్ నొచ్చుకుంటూ.

"నెవర్ మైండ్! పద వెళ్దాం" అని ఒకసారి చుట్టూ చూచి, చటుక్కున రోడ్డు దాటి, పరిస్తాన్ ఎంబసీ కార్యాలయం ప్రహరీగోడ దగ్గరకు వచ్చాడు.

అమావాస్య రోజులు కావడంవల్ల చాలా చీకటిగా ఉంది. ప్రహరీగోడ షుమారు ఏడు అడుగులు ఉంటుంది. రతన్ ఒక్కసారి బలమంతా ఉపయోగించి, ఊపిరి బిగబట్టి ఒక్కసారిగా ప్రహరీ పైకి ఎగిరాడు. చక్రవర్తి చటుక్కున అతని నడుం పట్టుకొని క్రిందకు లాగాడు.

"యూ ఇడియట్! ఇది పరిస్తాన్ ఎంబసీ కార్యాలయమే కాదు. ఒక గూఢచారి నివాసం అని కూడా గుర్తుంచుకో! తొందరపడి ప్రాణాలు పోగొట్టుకోకు. అలా చూడు. ఆ ప్రహరీ పైన ఉన్న ఫెన్సింగ్ వైరులో ఎలక్ట్రిసిటి ఉందని నా అనుమానం" అంటూ జేబులోంచి ఒక నాణెం తీసి ఫెన్సింగ్‌కు తగిలేలా విసిరాడు.

ఆ నాణెం ఫెన్సింగ్‌కు తగలగానే, పెద్ద వెలుగుతో మండి క్రింద పడిపోయింది.

"చూచావా? ఒక్క క్షణం ఆలస్యం అయివుంటే నల్లగా మాడిపోయేవాడివి" అన్నాడు చక్రవర్తి కోపంగా రతన్ వైపు చూస్తూ.

"సారీ చక్రవర్తీ! ఇలాంటి విషయాల్లో నాకు అంతగా అనుభవం లేదు" అన్నాడు నొచ్చుకొంటూ.

చక్రవర్తి మాట్లాడలేదు. ఫెన్సింగ్ వైపే పరీక్షగా చూచాడు. ప్రహరీపైన అంచుకు, ఫెన్సింగ్‌కు మధ్య కొంత స్థలం వుంది. జాగ్రత్తగా వెళ్ళగలిగితే, ఒక మనిషి ఆ స్థలంలో దూరిపోవచ్చు. కాని చాలా జాగ్రత్తగా వుండాలి. ఏమాత్రం తగిలినా మాడిపోతాడు. అయినా రిస్కు తీసుకోక తప్పదు. అంతకంటె మార్గం లేదు.

"రతన్! నేను చెప్పేది జాగ్రత్తగా విను. నేను చెప్పిందానికి ఏమాత్రం భిన్నంగా జరిగినా, నువ్వూ నేను ఇద్దరం మాడిపోతాం జాగ్రత్త" అని హెచ్చరించి, చేయ వలసింది చెప్పాడు. రతన్ ఒక నిముషం ఆలోచించి తల వూపాడు.

చక్రవర్తి ప్రహరీ గోడవారగా వంగాడు. రతన్ చక్ర వర్తి వీపు మీద నిలబడి, ఫెన్సింగ్ వైరు తగలకుండా, తలను చేతులను అవతలకు చేర్చి, ప్రహరీ గోడ అవతలి అంచును పట్టుకున్నాడు.

చక్రవర్తి లేచి నిలబడి, ప్రహరీకి వ్రేలాడుతున్న రతన్ నడుం పట్టుకొని నెమ్మదిగా పైకి ప్రాకి, ప్రహరీ అవతలి అంచును పట్టుకున్నాడు.

చక్రవర్తి ఆయాసంతో గట్టిగా నిట్టూర్చి, "రతన్!

జాగ్రత్త! శరీరం అంతా స్టడీగా వుంచి, నడుం వరకు ముందుకు జరుగు. ఆ తర్వాత నీ శక్తినంతా ఉపయోగించి, ప్రహరీ గోడను నీ రెండు చేతులతో బలంగా నెట్టి, శరీరం ఏమాత్రం పైకి లేవకుండా అలాగే ముందుకు పడి పోవాలి. చిన్న చిన్న గాయాలు తగిలినా ఫర్వాలేదు. ప్రాణాలు పోకుండా చూచుకో!" హెచ్చరించాడు చక్రవర్తి.

రతన్ జవాబు చెప్పలేదు. శరీరం ఉక్కు కడ్డీలా బిగించి, నెమ్మదిగా నడుం వరకు జరిగి, అరిచేతులతో ప్రహరీని బలంగా నెట్టి, చటుక్కున ముందుకు బోర్లా పడ్డాడు.

అంత ఎత్తునుంచి బోర్లా పడటంవల్ల మొహం అదిరి పోయింది రతన్‌కు. ముక్కుల్లోంచి రక్తం కారుతున్నట్లు అనిపించి, కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు.

రెండు నిముషాల్లో చక్రవర్తి కూడ క్రిందపడి, లేచి నిలబడ్డాడు.

"దెబ్బలు బలంగా తగిలాయా?" చిన్నగా అడిగాడు చక్రవర్తి.

రతన్ తల అడ్డంగా ఊపి, "ఊహూ! లేదు! ముక్కు లోంచి మాత్రం రక్తం కారుతూంది!" అన్నాడు.

"ఉష్! అరవకు! ఎవరో వస్తున్నట్లున్నారు ఇలా రా" అంటూ చప్పుడు కాకుండా రతన్‌ను లాక్కొని పెద్ద పొద చాటుకు వెళ్లాడు చక్రవర్తి.

ఎవరో ఇద్దరు వ్యక్తులు వచ్చి వాళ్ళ భాషలో ఏదో మాట్లాడుకొని, టార్చిలైట్ వెలుగులో చుట్టూ ఒకసారి చూచి వెళ్ళిపోయారు.

చక్రవర్తికి వాళ్ళ భాష అర్థం కాకపోయినా, తాము

మీకు తెలుసా?

1. వేట్‌కిన్ సిటీ 109. ఎకరాల చిన్న పట్టణం.

2. 'బేరేస్ఫోర్డ్ మూవ్' అనే ముత్యము 1800 గ్రాముల బరువున్నది.

3. భగవద్గీత ప్రపంచంలోని అన్ని భాషల్లోనూ అనువదించ బడింది.

4. ప్రపంచంలో అతి పొడుగరి 'జీక్ అర్లీ'. ఇతడు 8 అడుగుల 8 అంగుళాల పొడవున్నాడట.

5. అతి పొట్టివాడు 'వాల్ట బోయెనింగ్'. ఇతని పొడవు కేవలం 20 అంగుళాలే.

6. భూమ్మీద ప్రతి 20 నిమిషాలకొకసారి భూకంప మొస్తుంది.

7. ఒక అంగుళం వర్షమంటె ఒక ఎకరం భూమిలో 100 టన్నుల నీరు గుమ్మరించినట్లని అర్థం.

—చాగాపురం నాగేశ్వరరావు.

దూకిన శబ్దం విని వచ్చారని వూహించాడు.

ఒక్క నిముషం ఇద్దరూ గుండెల నిండా గాలి పీల్చుకొని పొదచాటునుంచి కదలి ముందుకు నడిచారు.

"ఇటువైపు వద్దు. వెనక వైపు నుంచి ప్రయత్నిస్తే మంచిదనుకుంటాను" అన్నాడు రతన్.

చక్రవర్తి తల వూపి, రతన్‌ను అనుసరించాడు. ఇద్దరూ ఎంబసీ కార్యాలయం వెనుక వైపుకు వచ్చారు.

ఎవరో వస్తున్న చప్పుడయింది. చటుక్కున ఇద్దరూ ఒక మూలగా వున్న గోడకు ఆనుకుని, వూపిరి బిగబట్టి నిలుచుండిపోయారు.

ఎవరో యిద్దరు సిపాయిలు గస్తీ తిరుగుతున్నారు. ఏదో మాట్లాడుకుంటూ వెళ్ళిపోయారు.

"వీళ్ళు మళ్ళీ తిరిగి వచ్చేసరికి నాలుగైదు నిముషాలు పడుతుంది. ఈ లోపల ఇద్దరం పైకి చేరుకోవాలి" హెచ్చరించాడు చక్రవర్తి.

వెనకవైపు నీటిగొట్టంలాంటివేమీ కన్పించలేదు. నిరాశగా పెదిమ విరిచాడు రతన్.

"డోంట్ వర్రీ! నా భుజాల మీద ఎక్కి పైన వున్న 'సన్ షేడ్'ను అందుకొని నీవు పైకి వెళ్ళి నాకు చేతులు అందియ్యి" అన్నాడు చక్రవర్తి.

రెండు నిముషాల్లో ఇద్దరూ 'సన్ షేడ్' మీదకు చేరుకున్నారు. చక్రవర్తి ఒకసారి పైకి చూచాడు. అక్కడ నుంచి అ_ర్తర్ వుంటున్న గది కనీసం పది అడుగుల దూరంలో వుంది. అక్కడికి వెళ్ళడానికి ఎలాంటి ఆధారం కన్పించలేదు. సాలోచనగా భృకుటి చిట్లించాడు.

ఇంతలో మళ్ళీ సిపాయిలొొస్తున్న చప్పుడయింది. ఇద్దరూ చటుక్కున 'సన్ షేడ్' మీద బోర్లా పడుకున్నారు. సిపాయిలు వెళ్ళిపోయిన చప్పుడు విన్పించి ఇద్దరూ లేచి నిలబడ్డారు.

"ఏం చేద్దాం?" అడిగాడు చక్రవర్తి విసుగ్గా.

రతన్ తీవ్రంగా ఆలోచించాడు. మెరుపులా ఒక అయిడియా తట్టింది. చెప్పాడు చక్రవర్తికి.

"చాలా రిస్క్ తీసుకుంటున్నామేమో! ఏమాత్రం పట్టు సడలినా ఇద్దరి ప్రాణాలు పోయాయన్నమాటే" అన్నాడు చక్రవర్తి.

"ఫర్వాలేదు. అసలు ఈ పనికి ఒప్పుకోగానే ప్రాణాల మీద ఆశలు వదులుకున్నాం. కనీసం ఇంత రిస్క్ కూడా తీసుకోకపోతే, ఇలాంటివి సాధించడం అసాధ్యం" అన్నాడు రతన్,

"జాగ్రత్త! అంతా నీమీద ఆధారపడి వుంది. నీ జంప్ పెద్దదయితే, నేను వెనక్కి పడిపోతాను" అన్నాడు చక్రవర్తి హెచ్చరింపుగా.

చక్రవర్తి మోకాళ్ళమీద కూర్చున్నాడు. రతన్ గోడను ఆసరాగా పట్టుకొని, చక్రవర్తి రెండు భుజాల మీద నిలబడ్డాడు.

"రెడీ....ఒన్....టూ....త్రీ...." చటుక్కున ఒక్క వూపులో పైకి లేచాడు చక్రవర్తి. ఆ విసురుకు రతన్ పైకెగిరి, 'అక్తర్' వుంటున్న గది కిటికీ అంచును పట్టుకుని వ్రేలాడసాగాడు.

అంతలో మళ్ళీ సిపాయిలొొస్తున్న చప్పుడయింది. చక్రవర్తి చటుక్కున బోర్లా పడుకున్నాడు.

రతన్‌కు ఏం చేయాలో తోచలేదు. తన అదృష్టం బాగుండక, వాళ్ళిద్దరిలో ఎవరైనా పైకి చూశారా, తను శవంగా మారి క్రిందపడతాడు. రతన్ మనస్సు ఒక్క-క్షణం స్థంభించిపోయింది. వూపిరి బిగబట్టి బల్లిలా గోడకు అతుక్కు-పోయాడు.

రెండు నిముషాలు గడిచాయి. సిపాయిలు వెళ్ళిపోయారు.

రతన్ గట్టిగా ఊపిరి పీల్చి, శరీరంలో శక్తినంతా. చేతుల్లో కేంద్రీకరించి, ఒక చేత్తో కిటికీ అంచు పట్టుకొని, రెండవచేత్తో కిటికీకి వున్న అద్దాన్ని పైకి ఎత్తాడు. గదిలో ఎవ్వరూ ఉన్నట్లు లేదు. నెమ్మదిగా రెండు చేతులూ లోపలికి పోనిచ్చి కిటికీ అవతలి అంచు పట్టుకొని, తల కొద్దిగా క్రిందకు వంచి చక్రవర్తికి సైగ చేశాడు.

చక్రవర్తి రెండు కాళ్ళు పట్టుకొని, నెమ్మదిగా పైకి ఎక్కా-డు. ఇద్దరూ కిటికీ గుండా గదిలోకి అడుగు పెట్టారు. గదిలో ఎవ్వరూ లేరు. ఒక మంచం, రెండు బీరువాలు, బట్టల స్టాండు మాత్రం వున్నాయి.

"బహుశ ఇది అక్తర్ పడక గది అయి వుంటుంది" అన్నాడు రతన్ నెమ్మదిగా.

చక్రవర్తి తల వూపి, గది ద్వారం దగ్గరకు వెళ్ళి బైటకు తొంచి చూచాడు. ఆ గదిలో ఒక వ్యక్తి, వీపు ద్వారం వైపు పెట్టి, కుర్చీలో కూర్చొని ఏదో వ్రాసుకుంటున్నాడు.

ఇద్దరూ నెమ్మదిగా లోపలికి నడిచారు.

"వెల్‌కం మై డియర్ ఫ్రెండ్స్! ఇద్దరూ చేతులెత్తండి! పిచ్చి పిచ్చి వేషాలు వేసారా ప్రాణాలు పోతాయి!" అతను

వెనక్కి తిరగకుండానే హెచ్చరించాడు.

ఒక్కక్షణం ఇద్దరూ స్రూన్పడిపోయారు. రతన్ చటుక్కున ముందుకు దూకాడు. మొహాన్ని రాచుకుంటూ వెళ్ళింది తుపాకీ గుండు.

"బి కేర్‌ఫుల్! నా గురి తప్పటం అంటూ వుండదు" హెచ్చరించాడు. కుర్చీ క్రింద వున్న అతని చేతిలో పిస్టలు పొగలు కక్కుతోంది.

ఇద్దరూ మాట్లాడకుండా అలాగే నిలబడిపోయారు. అతను కుర్చీలోంచి లేచి వెనక్కి తిరిగాడు.

అతని మొహం చూడగానే చక్రవర్తికి వాంతి వచ్చినట్లనిపించింది. అతని మొహమంతా పచ్చిపుండులా గాయాలతో నిండిపోయి వుంది. అక్కడక్కడ నల్లటి మచ్చలు కన్పిస్తున్నాయి.

"నా మొహం చూస్తుంటే భయంగా వుందా! ఏడు సంవత్సరాల నుంచి, అనేక దేశాల్లో గూఢచారిగా నా పనులు జయప్రదంగా నిర్వహించి, నేను పొందిన బహుమతులు ఇవి. ఎంతోమంది ఎన్నో విధాలుగా నన్ను చంపాలని ప్రయత్నించారు. కాని ఏ ఒక్కరూ చంపలేక పోయారు ఈ అక్తర్‌ను. ఆఫ్టాల్! యీ భారతదేశపు ఏజంట్లు నన్ను చంపగలరా?" అని పక పక నవ్వి ఒక్కక్షణం వాళ్ళవైపు చూచి ముఖం చిట్లించాడు.

"నిజం చెప్పండి! మీరెవరు? భారతదేశపు ఏజెంట్లేనా" గద్దించాడు అక్తర్.

"అవును!" అన్నాడు రతన్ ఏదో ఆలోచిస్తూ.

"నో, కాదు! నాకు తెలియని భారతదేశపు ఏజెంటులేదు.

అందరి ముఖాలు నాకు తెలుసు. మీరిద్దరూ కొత్తవాళ్ళయి వుంటారు అవునా?" అడిగాడు.

రతన్ తల వూపి, "అన్ని విషయాలు చెబుతాను! కాసిని మంచినీళ్ళు కావాలి" అన్నాడు నెమ్మదిగా.

అంతే! రతన్ చెంప అదిరిపోయింది. బోర్లాపడ్డాడు నేలమీద.

"ఇడియట్! నీకు మంచినీళ్ళు కావాలా? చెప్పు! మీ రెవరో ఎందుకు వచ్చారో చెప్పు" గద్దించాడు అక్తర్.

"నేను చెబుతాను! ఈ బటన్ వైపు చూడండి" అన్నాడు చక్రవర్తి.

అక్తర్ చక్రవర్తి వైపు తిరిగి "ఏమిటది? ఏముంది అందులో?" అనుమానంగా అడిగాడు.

అంతే! వెల్లకిలా పడ్డాడు అక్తర్. చేతిలోని పిస్టల్ ఎగిరి దూరంగా పడింది. చక్రవర్తి చేతిలో సైలెన్సర్ రెండుసార్లు మొరిగింది. అక్తర్ గుండె పట్టుకొని అలాగే ఉండిపోయాడు.

"యు హావ్ డన్ వెరీ వెల్! ఒక్క చెంప దెబ్బతో క్రిందపడగానే అనుకున్నాను నువ్వేదో ప్లాను వేశావని. అందుకే అతని దృష్టి నీమీద లేకుండా నా వైపుకు తిప్పుకున్నాను!" అన్నాడు చక్రవర్తి, రతన్ వైపు ప్రశంసా పూర్వకంగా చూస్తూ.

రతన్ చనిపోయిన 'అక్తర్' వైపోసారి చూసి, "మన పని అయిపోయింది పద వెళదాం" అన్నాడు.

"ఒక్క నిముషం! మనం ఇంతదూరం రానే వచ్చాం! మనదేశానికి సంబంధించిన రహస్య పత్రాలు ఏమైనా

ఉంటే తీసుకెళదాం!" అంటూ గదంతా కలయజూసాడు చక్రవర్తి.

టేబులు సొరుగులో ఏవో వ్రాసిన కాగితాలు కన్పించాయి. వాటిని మడిచి జేబులో పెట్టుకున్నాడు.

"పద వెళ్దాం" అని వెనక్కి తిరగబోతూ, ఏదో అనుమానంవేసి వేస్ట్‌పేపర్ బాస్కెట్ బోర్లించి చూచాడు. ఏదో ఫిలిం రీల్ క్రింద పడింది.

"ఇదేదో చాలా ముఖ్యమయినదై వుంటుంది. లేకపోతే ఇంత జాగ్రత్తగా దీన్ని దాచరు" అని జేబులో పెట్టుకొని ఇద్దరూ గది బయటకు వచ్చారు.

ఎవరో వస్తున్న అలికిడి విన్పించి, ఇద్దరూ పక్కగా వున్న గదిలో జొరబడి తలుపులు మూశారు.

ఎవరో ఒక వ్యక్తి అక్తర్ వుంటున్న గది వైపు వెళ్ళడం, తలుపు సందులోంచి చూచిన ఇద్దరి గుండెలు గుబగుబలాడాయి.

"ఇప్పుడేం చేద్దాం? అక్తర్ చనిపోయినట్లు తెలిస్తే మనల్ని ప్రాణాలతో వదలరు" అన్నాడు రతన్ భయంగా.

చక్రవర్తి గదంతా పరిశీలించాడు. అద్దాలు బిగించి వున్న కిటికీ వైపు చూచి, చటుక్కున దాని దగ్గరకు వెళ్ళి క్రిందకు చూచాడు. ఎదురుగా సింహద్వారం కన్పిస్తూంది.

అప్పుడు విన్పించాయి అక్తర్ గదిలోంచి కేకలు, "మర్డర్? మర్డర్!" అరుస్తున్నాడతను.

క్రింద వున్న సిపాయిలంతా బిల బిల మంటూ పైకి వస్తున్నారు.

"రతన్! కమాన్ క్విక్! మనం తెగించాలి తప్పదు. ఇక్కడనుంచి సుమారు 15 అడుగులు వుండవచ్చు నేల!

కాళ్ళు విరిగే ప్రమాదం వుంది. అయినా తప్పదు. క్విక్! జంప్!" అరిచాడు చక్రవర్తి.

రతన్ ఊపిరి బిగబట్టి చటుక్కున క్రిందకు దూకాడు. చక్రవర్తికూడ వెంటనే దూకాడు.

క్రింద పడగానే ఇద్దరూ చటుక్కున లేచి నిలబడ్డారు.

"రతన్! క్విక్, రనప్!" అన్నాడు చక్రవర్తి.

రతన్ పరుగెత్తలేకపోతున్నాడు. కాలు బెణికినట్లుంది. పడుతూ, లేస్తూ పరుగెత్తుతున్నాడు. సింహద్వారం గేటు దగ్గరకు వచ్చేసారు.

అప్పటికే చాలమంది సిపాయిలు బయటకు వచ్చారు. అందరి చేతుల్లో తుపాకులు మెరుస్తున్నాయి.

"క్విక్! పరుగెత్తు!" అరిచాడు చక్రవర్తి.

ఒక్క దూకు దూకి, సింహద్వారం దాటి, బోర్లా పడి పోయాడు రతన్. భుజంలో తుపాకి గుండు దిగబడింది.

చక్రవర్తి సందేహించలేదు. రతన్‌ను రెండు చేతుల్తో పట్టుకొని భుజంమీద వేసుకొని ముందుకు పరుగెత్తాడు.

వెనక సిపాయిలు తరుముకొస్తున్న చప్పుడువిన్పిస్తూంది. తుపాకులు పేలుతున్నాయి. మెలికలు తిరుగుతూ పరుగెత్తు తున్నాడు చక్రవర్తి.

కిళ్ళీకొట్టు దగ్గరగా వచ్చేసాడు. కిళ్ళీకొట్టు వారగా, గోడచాటున తన కారు వుంది. అందులోకి ఎక్కగలిగితే చాలు అనుకున్నాడు చక్రవర్తి.

రతన్‌ను మోసుకుంటూ పరుగెత్తడంవల్ల అలసటగా వుంది. కారు దగ్గరకు పరుగెత్తి, రతన్‌ను కార్లోకి విసిరేసి, స్టీరింగ్ ముందు కూర్చోబోయాడు. కుడికాలు భగ్గుమంది,

గుండు చీలమండలో దిగింది. నిప్పుకణం పెట్టినట్లనిపించింది. చటుక్కున కారు స్టార్ట్‌చేసి ఆక్సిలేటర్ బలంగా నొక్కాడు.

తుపాకుల శబ్దానికి కొందరు ఇళ్ళల్లోంచి బయటకు రావడం మొదలుపెట్టారు. క్రమంగా తుపాకుల శబ్దం దూరం అయింది. చక్రవర్తి స్పీడు తగ్గించలేదు.

పది నిముషాల తర్వాత కొండవారగా కారాపి, రతన్‌ను భుజంమీద వేసుకొని కుంటుతూ గుహలోకి వెళ్ళాడు.

రతన్‌ను నేలమీద పడేసి, అలసటగా కళ్ళు మూసుకున్నాడు. కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది. నిలబడే శక్తి లేక అలాగే నేలమీదకు ఒరిగిపోయాడు చక్రవర్తి.

3

చల్లటి నీళ్ళు మొహంమీద పడేసరికి మెలకువ వచ్చింది చక్రవర్తికి. నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

ఎదురుగా సుజాత నవ్వుతూ నిలబడివుంది. బలహీనంగా నవ్వి, రతన్ వుండే చోటువైపు చూచాడు. రతన్ లేడు. ఆశ్చర్యంగా తల తిప్పాడు. ఎదురుగా ఎత్తైన గట్టుమీద పడుకొని రొట్టె తింటున్నాడు రతన్.

రతన్ చక్రవర్తివైపు చూచి చిన్నగా నవ్వాడు.

సుజాత ఫ్లాస్కులో కాఫీ పోసి చక్రవర్తికి అందించింది.

"నిజంగా మీరింత త్వరగా ఈ పని పూర్తి చేయగలరని అనుకోలేదు!" అంది సుజాత ప్రశంసాపూర్వకంగా.

చక్రవర్తి నవ్వి, అక్తర్ ఇంట్లోంచి తెచ్చిన కాగితాలు, ఫిలిం రోల్ సుజాతకు అందించాడు.

"ఇవి అక్తర్ ఇంట్లో దొరికాయి. ఇందులో మన దేశానికి సంబంధించిన రహస్య విషయాలు వుండవచ్చు.

దయచేసి మన ప్రభుత్వానికి అందజేయండి!" అన్నాడు నెమ్మదిగా.

సుజాత వాటివైపు ఒకసారి చూచి, "చక్రవర్తీ! నిన్నెలా అభినందించాలో అర్థం కావడంలేదు! ఎందరో స్పెషల్ బ్రాంచి ఏజెంట్లు చేయలేని పని మీరిద్దరూ చేసారు. ఇది నిజంగా చాల ముఖ్యమైనది. అక్తర్ మన దేశంలో గూఢచారిగా ఉంటున్నాడని నిరూపించే సాక్ష్యం ఇది!" అంది ఆనందంగా.

చక్రవర్తి మాట్లాడలేదు. తలంతా తిరుగుతున్నట్లనిపించింది. తల వాల్చి అలాగే పడుకున్నాడు.

సుజాత రతన్‌వైపు చూచి "కాఫీ త్రాగుతావా?" అడిగింది. రతన్ తల ఊపాడు. సుజాత కాపీ ఇచ్చి, "చాల నొప్పిగా ఉందా?" అంది గాయాన్ని పరీక్షిస్తూ.

సుజాతను చటుక్కున రెండు చేతుల్తో పట్టుకొని పైకి లాక్కున్నాడు రతన్.

"ఛీ! వదులు! దుర్మార్గుడా!" పెద్దగా అరిచింది సుజాత.

పెద్దగా నవ్వాడు రతన్. "సుజాతా! మర్యాదగా లొంగిపో! లేదా బలవంతంగానైనా అనుభవించితీర్తాను! నువ్విచ్చే బోడి డబ్బుకోసం ఈ పని చేసాననుకుంటున్నావా? కాదు! నీ కోసం చేసాను. మర్యాదగా లొంగిపో!" రెండు చేతులతో సుజాతను పైకి లాక్కున్నాడు.

"రతన్! మర్యాదగా సుజాతను వదలిపెట్టు!" గంభీరంగా విన్పించింది చక్రవర్తి కంఠం.

సుజాతను వదలి చక్రవర్తివైపు చూచాడు రతన్. చక్రవర్తి చేతిలో పిస్టలు మెరుస్తూంది.

"అయామ్ సారీ! చక్రవర్తీ!" అని అటువైపు తిరిగి పడుకున్నాడు.

"సుజాతా! నీకేం భయంలేదు! ఇలా వచ్చి కూర్చో!" అన్నాడు చక్రవర్తి.

'ఢాం' అని పేలింది రతన్ చేతిలో పిస్టలు. మెలికలు తిరుగుతూ పడిపోయాడు చక్రవర్తి. గుండెల్లోనుంచి రక్తం కారుతోంది. తల వాల్చేసాడు చక్రవర్తి.

సుజాత భయంగా లేచి నిలబడింది. ఆమె శరీరం భయంతో వణికిపోతూంది.

"ఇప్పుడెక్కడికి పోతావ్? మర్యాదగా లొంగిపో!" సుజాతవైపు అడుగులేసాడు రతన్.

సుజాత భయంగా రెండడుగులు వెనక్కి వేసింది. రతన్ సుజాతపైకి దూకాడు. అంతే! గుండె పట్టుకొని వెల్లకిలా పడిపోయాడు.

సుజాత ఆశ్చర్యంగా చూచింది.

చక్రవర్తి భారంగా కళ్ళెత్తి సుజాతవైపొకసారి చూచి తల వాల్చేసాడు. అతని చేతిలోని సైలెన్సర్‌లోంచి ఇంకా పొగ వస్తోంది.

★

"ఎప్పుడూ ఎవరిచేత మాటలు పడని రామారావు, పాపం ఆఫీసరుచేత అన్ని చివాట్లు తిన్నాడేమిటి ఈ రోజు? కొంపదీసి పుట్టింటికెళ్ళిన వాళ్ళావిడ వస్తానన్న రోజుకు రాలేదా!"

"అదేం కాదురా! వాడికి ప్రతినెలా 28 వ తారీఖున "అపన" వి. పి. వస్తుందట. ఈ రోజు 5 వ తారీఖు అయిన ఇంకా రాకపోవటంతో దిగులుగా దాన్ని గురించి ఆలోచిస్తూ అన్ని తప్పులు వ్రాసేశాడు..."

—హెచ్. వి. ఎస్. సుబ్రహ్మణ్యం, మౌలాలి.

ఈనెల జోక్స్

—అంజన్ &
రాజీ

(కోర్టులో)

ప్లీడరు: ఏమయ్యా! మీ ఎదురింటి సుబ్బయ్యను 'వెధవా' అని తిట్టావా లేదా?

ముద్దాయి: తిట్టానండి.

ప్లీడరు: దున్నపోతా అని?

ముద్దాయి: తిట్టానండి.

ప్లీడరు: గాడిదా అని?

ముద్దాయి: అరెరె! అది మరిచిపోయానండి.

*　　　*　　　*

కవి సమ్మేళనం జరుగుతోంది. ఒక కవి లేచి ఉద్రేకంగా చదివేస్తున్నాడు కవిత.

"పైజామా ఒకటి....జాకిట్లు రెండు"

"లంగాలు మూడు....లుంగీలు నాలుగు."

"బాడీలు అయిదు....బనీన్లు ఆరు."

అంటూ ఎత్తుకున్న ఈ కొత్తరకం కవితా ధోరణిని అంతా ఆనందంగా ఆస్వాదిస్తున్న తరుణంలో తేరుకున్నాడు కవి. చేతిలోని కాగితాన్ని పరీక్షగా చూసి, "మహాజనులారా!

క్షమించాలి. యిప్పటి వరకూ కవితకు బదులు చాకలి పద్దు చదివేశాను పొరపాటున," అన్నాడు.

* * *

ఒక బిజీ ఆఫీసర్ దగ్గర ఒక బంట్రోతున్నాడు. ఆఫీసర్‌ని కలుసుకోడానికి ఎవరొచ్చినా లోపలికి పంపేవాడుకాదు.

"చాలా అర్జంటు" అన్నా. "ఆఁ అందరూ యిలాగే అంటారుగాని దయచెయ్యండి," అని పంపివేశేవాడు.

ఒకనా డొకామె వచ్చింది ఆఫీసర్‌ని కలుసుకోడానికి. బంట్రోతు ససేమిరా పంపనన్నాడు లోపలికి.



"నే నెవర్నో తెలుసా? ఆయన భార్యను," అందావిడ కోపంగా.

"ఆఁ ఆఁ అందరూ అలాగే అంటార్లెండి," అన్నాడు బంట్రోతు ఎప్పటిలాగే తాపీగా. అంతే ఆవిడ అపరకాళికా దేవియై ఆఫీసంతా ఓ గంటసేపు వీరవిహారం చేసింది. ఆవిడను శాంతింప జేయటానికి ఆ ఆఫీసరుగారు మూడు చెరువుల నీళ్ళు త్రాగవలసి వచ్చింది.

* * *

"పెద్దయ్యాక నేను డాక్టర్ నవుతా!" రమేష్.

"నేను యింజనీర్ నవుతా!" రవి.

"నేను పైలట్ నవుతా!" రాజేష్.

"మరి నువ్వే మవుతావు పాపా?" పాపను అమ్మ అడిగింది.

"అమ్మనవుతా!" పాప సమాధానం.

*　　*　　*

గాజుల కిష్టయ్య తన మలారంతో వీధిన పడ్డాడు. దార్లో ఒక పోలీసు మూటమీద లాఠీతో కొట్టి "ఏమున్నా ఇందులో," అని గద్దించి అడిగాడు.

"మీ రింకో దెబ్బ వేశారంటే ఏమీ ఉండవండి." ఏడుపు ముఖంతో జవాబిచ్చాడు కిష్టయ్య.

*　　*　　*

ఒక త్రాగుబోతు త్రాగి రోడ్డుమీద నడుస్తున్నాడు.

దార్లో ఒక స్తంభాన్ని గుద్దేశాడు.

"క్షమించండి సార్! చూసుకోలేదు." అని క్షమాపణలు చెప్పుకున్నాడు.

తరువాత ఒక పెద్ద చెట్టును గుద్దేసి, "మన్నించండి పహిల్వాన్ గారూ," అన్నాడు.

ఓ పోస్ట్ బాక్స్‌ని గుద్దేశాడు మళ్ళీ.

"ఏరా! వెధవా! చూసుకుని నడవలేవూ," అని ఎగిరాడు ఆ పోస్టు బాక్స్‌మీద.

*　　*　　*

"మీ ఊళ్ళో ఒక్కరికికూడా ఎప్పుడూ జబ్బు చెయ్యదని చెప్పావు. మరి ఈయనెందుకిలా నీరసంగా ఉన్నాడు రోగిష్ఠి

వాడిలా?"

"పాపం! ఈయన మా ఊరి డాక్టరుగారు!"

*　　*　　*

"ఈ అయిదుగురిలో మీ కొడుకెవరో పోల్చుకోండి చూద్దాం?" అంది నర్సు అప్పుడే పుట్టిన అయిదుగురు శిశువుల్ని చూపిస్తూ.

"ఆ నల్లగా ఉన్నవాడే నా కొడుకు," అన్నాడు గుర్నాధం.

"అరే! ఎలా కనుక్కున్నారు!" ఆశ్చర్యపోయింది నర్స్.

"ఆశ్చర్యం ఏమీ లేదు. మా ఆవిడ ఎప్పు డేదివండినా మాడ్చేస్తుంది."

*　　*　　*

"ఏరా పెళ్ళి చేసుకున్నావా? లేక యింకా నువ్వే వంట చేసుకుంటున్నావా?"

"రెండింటికీ ఒకటే జవాబు—అవును."

*　　*　　*

"నేను పెళ్ళి చేసుకుంటే ఎంతమంది యువకులు బాధ పడతారో తెలుసా?" అంది రాణి గర్వంగా.

"అబ్బా! అంత మందిని చేసుకుంటున్నావా?" ఆశ్చర్య పోయింది సుచేత.

* * *

"మా కాలంలో ధాన్యం బస్తా మూడు రూపాయలు తెలుసా!"

"యిప్పుడూ అంతే....ఖాళీది.

* * *

రైల్లో కిటికీ ప్రక్కన యిద్దరు ప్రయాణీకులు కూర్చు న్నారు.

ఒకడు చలేస్తుందంటూ కిటికీ అద్దం మూసేశాడు.

రెండోవాడు గాలాడ్డం లేదంటూ అద్దం పైకెత్తేశాడు.

అలా ఆ యిద్దరూ ఒకళ్ళు మూయడం, ఒకళ్ళు తెరవడం చేస్తూ దెబ్బలాడుకుంటున్నారు.

దగ్గరకు వెళ్ళి చూశాన్నేను. అసలా చట్రానికి అద్దం లేనే లేదు.

* * *

ప్రఖ్యాత ఆటగాడు ఒకసారి తీవ్రంగా జ్వరపడ్డాడు.

డాక్టర్ జ్వరంచూసి, "ఫెంటాస్టిన్! 108 డిగ్రీలుంది నీకు జ్వరం," అన్నాడు.

"ప్రపంచ రికార్డ్ ఎంత డాక్టర్?" కుతూహలంగా ప్రశ్నిం చాడు ఆటగాడు.

* * *

"ఏమిటండీ! యిన్ని బస్సులు వెళ్ళిపోతున్నా ఏదీ ఎక్కరేం!"

"యిరవై ఏడో బస్సులో యెక్కమన్నాడండి మాబావ. యింకా పద్ధెనిమిది బస్సులేగా వెళ్ళింది?"

* * *

"యిదిగో పరంధామం! నీ కుక్కని అదుపులో పెట్టుకో! మా ఆవిడ పాట పాడడం మొదలుపెట్టగానే నీ కుక్క మొరుగుతోంది రోజూ!"

"ముందు మీ ఆవిడేగా మొదలు పడుతోంది."

* * *

రోడ్డుమీద యిద్దరు పరుగెడుతున్నారు.

వెనక పరుగెత్తుతున్నతన్ని ఆపి, "ఏం జరిగింది?" అనడిగాను.

"వాడు చదివిన కవిత్వం నేను విన్నానా? నా కవిత్వం వినకుండా పారిపోతున్నాడు దొంగ వెధవ." అని మళ్ళీ పరుగు లంకించుకున్నాడు. ★

సీతాదేవి కప్పుకున్న రగ్గుని మెల్లగా తొలగించి రిస్టువాచీ చూచుకుంది. టైము సాయంత్రం 7 గం॥లు దాటుతోంది.

ఆమెలో కంగారు మొదలైంది. చివాలున మంచం దిగి చెప్పల్స్ తొడుక్కొని, జారుతోన్న రగ్గుని వొంటి నిండా కప్పుకుని మెల్లగా కిటికీవద్దకి చేరుకుంది. కిటికీ అద్దంలోంచి బైటికి తొంగి చూసింది.

బైటి ప్రకృతి స్పష్టంగా కనిపించడంలేదు. పొగమంచు పొరల మధ్య వీధి దీపాలు వెండి ముద్దల్లా మెరుస్తూన్నయ్. వీధులు నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా నిట్టూరుస్తున్నయ్.

ఆమెలో కంగారు ఎక్కువైంది. గుండెలు వేగంగా కొట్టుకోసాగినయ్. గిరుక్కున వెనక్కి తిరిగి డ్రాయింగ్ రూములోకి చేరుకుంది. కుర్చీలో కూలబడి టీపాయ్‌మీది ఫోన్‌ని ముందుకి లాక్కొని రిసీవర్‌ని చేతికి తీసుకుంది. పోలీస్ స్టేషన్‌కి డయల్ చేసింది.

"ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి స్పీకింగ్."

"నేను మిసెస్ ఆనందరావుని మాట్లాడుతున్నాను. ఆయన ఐదున్నరకే ఆఫీసు వొదిలారట, కాని ఇంకా ఇల్లు చేరలేదు. నా కెందుకో భయంగా వుంది. విల్ యూ ప్లీజ్ హెల్ప్‌మీ!" అంది సీతాదేవి అతి ప్రయత్నంమీద.

"మిసెస్ ఆనందరావ్! మీరు అనవసరంగా కంగారు పడుతున్నారేమో? ఆనందరావుగారు బహుశా ఏ క్లబ్బుకో, మిత్రుడింటికో వెళ్ళి వుండొచ్చుగా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి.

"నోనో! వారు ఆఫీసు వొదిలితే మరెక్కడికీ వెళ్ళరు. ఏదయినా అత్యవసరమైన పనిమీద వెళ్ళవలసి వస్తే నాకు ముందుగా ఫోన్ చేస్తారు. పైగా కారుకూడా లేదు. సర్వీ

సింగ్‌కి యిచ్చాము! వారు ఏమయ్యారో అర్థంకావడంలేదు."

"డోన్ట్ వర్రీ మిసెస్ ఆనందరావ్! నేనిప్పుడే బయలు దేరుతున్నాను. ఓమాటు ఆఫీస్‌కివెళ్ళి దర్యాప్తు చేసిన పిదప మీకు ఫోన్ చేస్తాను. అవసరమైతే మిమ్మల్ని కలుసు కుంటాను. అంతదాకా నిశ్చింతగా వుండండి!" అన్నాడు ఇందుమూర్తి.

"అలాగే! మీరు వెంటనే బయలుదేరాలి! ప్లీజ్!" సీతా దేవి రిసీవర్‌ని ఫోన్‌మీద పెట్టి బరువుగా నిట్టూర్చింది.

2

ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి 'రావ్ అండ్ రత్నం' ఆఫీసు ముందు జీపు దిగాడు. తలమీదుగా చెపుల్ని కప్పుకున్న మఫ్ల ర్‌ని ఓమాటు సర్దుకుని గుమ్మం కేసి నడిచాడు.

మేడమీద ఆఫీసు గదిలో దీపం వెలుగుతోంది. నాబ్ తిప్పి గ్లాస్‌డోర్ తెరుచుకుని, కారిడార్‌లోకి చేరుకున్నాడు. గుమ్మంవద్ద కాపలావున్న దర్వాను స్టూలుమీంచి లేచి సెల్యూట్ చేశాడు.

"ఆనందరావుగారున్నారా?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

"లేరు సార్. వెళ్ళిపొయ్యారు!" అన్నాడు దర్వాను.

"ఎప్పుడు? ఐదింటికే?"

"అవునుసార్ అయిదింటికే వెళ్ళిపొయ్యారు" అన్నాడు దర్వాను కంగారు కంగారుగా. "రాజరత్నంగారు మాత్రం ఏవో కాగితాలు చూసుకుంటున్నారు."

ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి తిన్నగా మేడ మెట్లెక్కి- మీదికి చేరుకున్నాడు. మేనేజింగ్ పార్ట్‌నర్ రాజరత్నం ఆఫీసు గది ముందు పచార్లు చేస్తోన్న బంట్రోతు, బూట్ల చప్పుడు విని కాబోలు కంగారుగా ముందుకి వచ్చి, "ఎవరు

కావాలి సార్?" అని ప్రశ్నించాడు.

"ఆనందరావుగారు."

"లేరు సార్. వెళ్ళిపొయ్యారు."

"ఎప్పుడు? ఆరింటికే?"

"అవును సార్. ఆరింటికే వెళ్ళిపొయ్యారు" బంట్రోతు కంగారుగా జవాబు చెప్పాడు. "రాజరత్నంగారొక్కరే వున్నారు సార్ లోపల."

"దట్సాల్ రైట్!" ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి తిన్నగా స్వింగ్ డోర్ తెరుచుకుని లోపలికి చేరుకున్నాడు.

మేనేజింగ్ పార్ట్‌నర్ రాజరత్నం ఏవో కాగితాలు తిరగేస్తున్న వాడల్లా బూట్ల చప్పుడు విని, తల పైకెత్తి "హల్లో మిస్టర్ ఇందుమూర్తీ! రండి! రండి! కూచోండి! ఏమిటిలా వచ్చారు?" అని ప్రశ్నించాడు.

"ఆనందరావుగారి కోసం" కుర్చీలో కూచుంటూ జవాబు చెప్పాడు ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి.

"వారు వెళ్ళిపోయి చాలాసేపయింది. ఐదున్నరకే వెళ్ళిపొయ్యారు. ఇంట్లో లేరా" అని ప్రశ్నించాడు రాజరత్నం.

"ఏమో! నేను ఇంటికి వెళ్ళలేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ అతగాడి కళ్ళల్లోకి చూస్తూ.

"నో—నో—అదికాదు. ఇంకా ఇంటికి రాలేదని వారి మిసెస్ ఇక్కడికి ఫోన్ చేశారు. అందుకని అలా అడిగాను. మీరు అక్కడ్నించే వస్తున్నారేమో అనుకున్నాను" అన్నాడు రాజరత్నం తడబడుతూ.

"నిజమే! మిసెస్ ఆనందరావుగారు నాకూ ఫోన్ చేశారు. ఆ విషయమే దర్యాప్తు చేద్దామని బయలుదేరాను. ఎక్కడికి వెళ్ళి వుంటారో చెప్పగలరా?"

"వారు ఆఫీసు వొదిల్తే ఇంటికి తప్ప మరెక్కడికీ వెళ్ళరు. క్లబ్బులకి వెళ్ళడం వారికి అలవాటులేదు. చీకటి పడకముందే ఇల్లు చేరుకుంటారు. పైగా యీ రోజు చలి విపరీతంగా వుంది. ఈ చలిలో ఎక్కడికి వెళ్ళారో అర్థం కావడం లేదు," అన్నాడు రాజరత్నం.

"నిజమే! ఈరోజు కోల్డు చాలా టెరిబుల్‌గా వుంది. టెంపరేచర్ జీరో డిగ్రీస్‌కి దిగిపోయినట్లుంది" అంటూ ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి కుర్చీలోంచి లేచి ఎదురుగావున్న గ్లాస్ విండో వద్దకి చేరుకున్నాడు. విండో గ్లాసులోంచి బైటికి తొంగిచూశాడు.

క్రింద అఖాతమయిన లోయ. లోయ మధ్య మెల్లగా ప్రవహిస్తోన్న జీవనది. నదీ ప్రవాహంలో నీటిపైన తేలుతోన్న మంచుగడ్డలు. భవనం అంచున కొండమీద సన్నటి కాలిదారి. కాలి దారికి అటూ ఇటూ వెండి ముద్దల్లా వెలుగుతోన్న విద్యుద్దీపాలు కనిపించాయి అస్పష్టంగా. జనసంచారంలేదు. ఆ భవనం ఓ కొండమీద నది వొడ్డున కట్టబడి వుందని అర్థమైంది ఇన్‌స్పెక్టర్‌కి.

రెండు నిమిషాలపాటు ఆ కాలి బాటకేసే చూస్తూ నిల్చుండి పోయ్యాడు. తరువాత వెనక్కి తిరిగి "ఆనందరావుగారి కారు సర్వీసింగ్‌కి వెళ్ళినట్టు తెలిసింది. వారు ఇంటికి వెళ్ళడానికి ఏ టాక్సీనో వుపయోగించి వుండాలి. ఏ కంపెనీకి ఫోన్ చేశారో చెప్పగలరా?" అని ప్రశ్నించాడు.

మేనేజింగ్ పార్టనర్ రాజరత్నం చిన్నగా నవ్వాడు. "ఆనందరావుగారి సంగతి మీకు తెలీదు. డబ్బు విషయంలో చాలా జాగ్రత్త మనిషి. చిల్లి గవ్వకూడా వృథాగా ఖర్చు చెయ్యరు. ఈ భవనం వెనుక నది గట్టుమీద కాలి బాటంట

నడిచి వెళ్ళితే పది నిమిషాల్లో వారు ఇల్లు చేరుకోవచ్చు. కారు లేకపోతే వారు ఆ కాలి బాటంట వెళ్ళడం అలవాటు," అన్నాడు.

"అలాగా?" ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి సాలోచనగా తల పంకించాడు. "ఏడున్నర తరువాత ఆ దారంట ఎవరూ నడవరనుకుంటాను?"

"అవును. కాని ఆయన ఐదున్నరకే వెళ్లారుగా?"

అంతలో టేబుల్‌మీది టెలిఫోన్ మోగింది. రాజరత్నం రిసీవర్‌ని తీసుకుని "ఎస్! రావ్ అండ్ రత్నం ఆఫీస్!" అన్నాడు.

"స్టేషన్‌నుండి హెడ్‌కానిస్టేబుల్ ఏకాంబ్రం మాట్లాడుతున్నాను. అక్కడ ఇన్‌స్పెక్టర్‌గారుంటే వారితో అర్జంటుగా మాట్లాడాలి! రిసీవర్‌ని వారికివ్వండి."

"అలాగే" అంటూ రిసీవర్‌ని ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తికి అందించాడు రాజరత్నం. "హెడ్‌కానిస్టేబుల్ ఏకాంబ్రం మీతో మాట్లాడతాడట."

ఇందుమూర్తి రిసీవర్‌ని అందుకుని "ఎస్! ఇందుమూర్తీ స్పీకింగ్! ఏమిటి విషయం?" అని ప్రశ్నించాడు.

"రివర్ బాంక్ కాలిబాటమీద ఆనందరావుగారి శవం పడివుందట సార్! బీటు పోలీసు ఇప్పుడే ఫోన్‌చేశాడు," అన్నాడు ఏకాంబ్రం.

"మైగాడ్! అయితే నేనిప్పుడే బయలుదేరుతున్నాను. నలుగురు పోలీసుల్ని వెంటబెట్టుకుని నువ్వు తిన్నగా అక్కడికి వచ్చెయ్! ఇంతకీ ఆ శవాన్ని ఆనందరావేనని గుర్తుపట్టారట్నా?"

"శవం ఆనందరావు గారిదేనట సార్! బీటు పోలీసు ఆనందరావుగార్ని బాగా ఎరుగునట!"

"దట్సాల్ రైట్!" అంటూ రిసీవర్‌ని ఫోన్‌మీద పెట్టేసి "మిస్టర్ రాజరత్నం! ఆనందరావుగారినెవరో హత్య చేశారు! మనం వెంటనే వెళ్ళాలి!" అన్నాడు.

"ఏమిటీ ఆనందరావుగార్నా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు రాజరత్నం.

"అవును. వెళదాం పదండి!" ఇన్‌స్పెక్టర్ అడుగు ముందుకేశాడు.

3

'రివర్ బాంక్ ఫుట్‌పాత్'కి ఇరవై అడుగుల దిగువ ఓ చట్టుబండమీద ఆనందరావుగారి శవం అస్తవ్యస్తంగా పడివుంది. ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి అక్కడికి చేరుకోగానే శవంవద్ద కాపలావున్న బీటుపోలీసు ఎటెన్‌షన్‌లో నిల్చుని సెల్యూట్ చేశాడు.

ఇన్‌స్పెక్టర్ శవంకేసి పరిశీలనగా చూశాడు. శవం బోరగిలపడివుంది. తలమీద మెదడుపైన దెబ్బతగిలి రక్తం చెంపలమీదుగా జారి భుజాలు తడిసివున్నయ్. చెంపలమీద జారిన రక్తపుచారలు గడ్డకట్టి నల్లబడి వున్నయ్. అతడు కట్టుకున్న రిస్టువాచీ దెబ్బతగిలి 5-39 గం॥లకే ఆగివుంది. పక్కనే అతని తాలూకు ఫౌన్‌టెన్‌పెన్ పడివుంది.

ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి బీటుపోలీసుకేసి తిరిగి ప్రశ్నించాడు. "నువ్వీ శవాన్ని ఎప్పుడు చూశావు?" అని.

"ఇప్పుడే సార్! పది నిముషాలు కూడా కాలేదు. నేనిప్పుడే డ్యూటీలోకి వచ్చాను. ఫస్టరౌండ్‌లోనే కనిపించింది శవం. వెంటనేవెళ్ళి పరిశీలించాను. అప్పటికే ప్రాణం

పోయి చాలా సేపయినట్టుంది. శరీరం బాగా చల్లబడి పోయింది. తక్షణం అక్కడ్నించి పబ్లిక్ టెలిఫోన్ బూత్‌కి పరుగెత్తి స్టేషన్‌కి ఫోన్ చేశాను" అన్నాడు బీటుపోలీసు.

ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి దృష్టి అక్కడ పడివున్న పెన్ మీద పడింది. వెంటనే పెన్‌ని చేతిలోకి తీసుకుని జేబు లోంచి డైరీతీసి గబగబా రాసి, పక్కకి తిరిగి, రాజరత్నం కేసి చూచి, "పెన్ను చాలా బాగ రాస్తోందికదూ?" అన్నాడు. అతని ముఖం సంతోషంతో విప్పారింది.

రాజరత్నం అవునన్నట్టు తలూపాడు. కాని ఆనందరావు గారి హత్యకూ, పెన్ను బాగా రాయడానికీ గల సంబంధ మేమిటో అతనికి బోధపడలేదు.

ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి వెంటనే పక్కకి తిరిగి "ఇక్కడికి ఎదురుగా వున్న యీ బిల్డింగుపైనే కదూ మీ ఆఫీసు?" అని ప్రశ్నించాడు.

రాజరత్నం అవునన్నట్టు తలూపాడు.

"మీ ఆఫీసు గది కిటికీ గాజుతలుపు తెరిచి అక్కడ్నించి ఓ బరువైన వస్తువుని క్రిందికి తోస్తే వుజ్జాయింపుగా ఇక్కడ పడవచ్చు కదూ?" అని ప్రశ్నించాడు.

"మీరెందుకలా ప్రశ్నిస్తున్నారో నాకు అర్థం కావడం లేదు" అన్నాడు రాజరత్నం.

ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి చిన్నగా నవ్వాడు. "మిస్టర్ రాజరత్నం! నిజాన్ని నా నోటంట వినాలని వుందా? అయితే చెబుతా వినండి! మీరన్నట్టు ఆనందరావుగారు 5-30 గంటలకే పొయ్యారు. అంటే ఆఫీసునుండి కాదు. ఈ లోకంలోంచి. ఐదున్నరకే మీరతడ్ని హత్యచేసి ఏడు దాటింతరువాతే శవాన్ని ఇక్కడ పడవేయించారు. ఏడు

గంటలదాకా యీ దారంట జనం నడుస్తూంటారు గనక ముందుగానే శవాన్ని యిక్కడ పడవేయించడానికి మీకు వీల్లేకపోయింది," అన్నాడు.

"అబద్ధం! నేనతడ్ని హత్య చెయ్యలేదు." బిగ్గరగా అరిచాడు రాజరత్నం. "ఆనందరావుగారు కాలుజారి ప్రమాదానికి గురి అయివుండొచ్చు!"

"మిస్టర్ రాజరత్నం! ఆవేశపడకండి! నేను చెప్పేది సాంతంగా వినండి! మీ రన్నట్టు ఆనందరావుగారు ప్రమాదానికే గురి అయివుంటే 5.30 గం॥లకే అతని ప్రాణం పోయి వుండాలి. అంటే అప్పటినుండీ ఆనందరావుగారి శవం ఇక్కడే పడివుండాలి. 7 గం॥ల దాకా యీ దారంట జనం నడుస్తారు. కాని ఎవరూ శవాన్ని చూడలేదు. బీటుపోలీసు వచ్చేదాకా ఎవరి దృష్టినీ పడకుండా వుండడం అసంభవం.

ఇప్పుడు 7 గంటల నలభై నిముషాలు అయింది. అప్పటి నుండి ఇప్పటి వరకు అంటే దాదాపు 2 గంటల 10 నిమిషాలు శవం యీ ఆరుబైట యీ చలిలో పడివున్న మాట నిజమే అయితే, ఆయనగారి కలం అంత సాఫీగా ఎలా వ్రాస్తుందో ఆలోచించారా? కలంలోని సిరా గడ్డ కట్టకుండా వుంటుందా?" అని ప్రశ్నించారు.

మేనేజింగ్ పార్ట్నర్ రాజరత్నం బిక్కమొహం వేశాడు

"ఆనందరావుగారి తలమీద అయిన గాయాన్ని బట్టీ, ఆగిపోయిన వాచీని బట్టీ ప్రాణం 5.30 గం॥ల ప్రాంతంలో పోయి వుంటుందని తెలుస్తోంది. అయితే అప్పటి నుండి ఇప్పటివరకు శవం ఎక్కడున్నట్టు? దీనినిబట్టి ఆయన మరణానికి కారణం ప్రమాదం కాదని ఋజువవుతోంది. మీరూ,

మీ బంట్రోతూ, మీ ఆఫీసు దర్వానూ ముగ్గురూ కలిసే యీ హత్య చేశారు. ఆనందరావుగారు ఎప్పుడో ఆఫీసు విడిచి వెళ్ళారని నన్ను నమ్మించేందుకు మీ ముగ్గురూ ప్రయత్నించారు. కాని యీ విషయంలో మీరు కూడ బలుక్కోలేదు. అందుచేత ఒక్కొక్కరు ఒక్కొక్క టైము చెప్పారు.

ఆనందరావు గారు యీ సాయంత్రం ఆఫీసు విడిచి బైటికి వెళ్ళినట్టు ఎలాంటి సాక్ష్యమూ లేదు. అందుచేత మీరే అతడ్ని హత్యచేసి 7 గం॥ల తరువాతే శవాన్ని ఆఫీసు గదినుండి క్రిందికి జార విడిచారన్న విషయం రూఢి అవుతోంది. మీ ఆఫీసు రికార్డ్సు పరిశీలిస్తే మీరు ఆనందరావు గార్ని హత్య చెయ్యడానికి కారణ మేమిటో విశద మవుతుంది. అది అంత కష్టమైన పనేం కాదు. ఏమంటారు?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఇందుమూర్తి రాజరత్నంకేసి తీక్షణంగా చూస్తూ.

పాపం, రాజరత్నం తల వొంచేశాడు, తన నేరాన్ని అంగీకరిస్తున్నట్టు. ★

ఒక సైనికుని కాలికి గాయం తగిలింది. డాక్టరు అతనిని ఆపరేషన్ టేబిల్ మీద పడుకోబెట్టి, కత్తులతో ఆ గాయం కెలుకుతున్నాడు.

సైనికుడు: (బాధతో) డాక్టర్! బాధ భరించలేక ఛస్తున్నానయ్యా! అరగంటనుంచి ఆ గాయం అలా కెలుకుతున్నా వేమిటి?

డాక్టర్: తుపాకీగుండు కోసమయ్యా. వెతుకుతున్నాను.

సైనికుడు: అబ్బబ్బా! అది నా జేబులోనే వుందయ్యా! గుండు తగలగానే పీకేసి జేబులో వేసుకున్నాను.

—జి. ఈశ్వర్, గార్ల.

మీ ప్రశ్నలకు, ప్రముఖ న్యాయవాది
శ్రీ పోతుకూచి సాంబశివవుగారి జవాబులు

సత్యం, బండముంద.

ప్ర: పెండ్లి చేసుకుని, ఒంటరిగా ఫారిన్ వెళ్ళి 5 సం॥ రాల తర్వాత నేను నీకు పనికి రాను, వేరే పెళ్ళి చేసుకో అని రాసిన ప్రబుద్ధునికి అతని భార్య కోర్టులో దావావేస్తే వచ్చే ఫలిత మేమిటి?

జ: సత్యంగారూ! పనికిరాను అంటే మీ వుద్దేశంలో ఏమిటి? భర్తగా తన విధులు నిర్వహించే స్థితిలో లేనట్లా? లేక మరెవరినైనా పెండ్లి చేసుకుని మధ్యలో వదిలినట్లా? మరి "కోర్టులో దావా" అన్నారు—ఏ దావా? ఏ కోర్టులో— అనేక కోర్టుల్లో అనేక రకాల దావాలుంటాయి. అతనో భర్తగా అశక్తుడైతే ఏ భార్య మాత్రం చేసేదేముంది? 'ఫారిన్' అంటే ఏ దేశం మీ దృష్టిలో! అనేక దేశాలలో అనేక నియమావళి వుంది. కొంతకాలం ఆ దేశంలో వుంటే 'పౌరుడు' కావచ్చు. మరో దేశం సంగతి చెప్ప నప్పుడు—అతని పౌర హక్కులేమిటో తెలియదుగా-ఇంత అసందిగ్ధ ప్రశ్నకు ఏం జవాబు ఇవ్వగలను?

కుమారి ప్రేమ్‌వీణావినయకుమారి, రుద్రంపూర్.

ప్ర: తనయుడు నేరం చేసి తప్పించుకుపోతే అతన్ని పట్టుకోవడం కోసం, తండ్రిని జైల్లో పెడతారా? లేక అలా బెదిరించవచ్చా?

జ: మీరేదో ఇటీవల స్టంటు సినిమాలు చూస్తుంటారు. మరి సినీమాల్లో అలా చేయవచ్చు. నేరం చేసినవాడు కొడుకని తెలిస్తే, ఆ కొడుకు చేసిన నేరానికి అరెస్టు 'లా' ప్రకారం సాధ్యమైతే అతన్నే జైల్లో పెడతారు. తండ్రి పోలీసులకు తెలియకుండా కొడుకును దాచినట్లు ఋజువైతే ఆ ఆచూకీ తెలుసుకోడానికి పోలీసులు తమ ప్రయత్నాలు తాము చేస్తారు. అవసరమైతే కటకటాలల్లో తండ్రిని పెట్టి బెదిరించడం కూడా—

సి. హెచ్. నాగేశ్వరరావు, టిటాగర్.

ప్ర: నాకు తెలిసిన వ్యక్తి ఒక త్రాగుబోతు దానికి భయ పడతాడు. దూరం నుంచే తాగుబోతును చూసి ఏదో ఐపోతాడు. చట్టప్రకారం త్రాగుబోతుపై ఏదైనా చర్య తీసుకోవచ్చా?

జ: దూరం నుంచి తాగుబోతును చూస్తే, ఏదో ఐపోతా డన్నారు—పాపం! అతనికి నరాల బలహీనత మానసిక భయం ఏవో వుండి వుంటాయి. చట్టరీత్యా చర్య ఎందుకు? ఆయన్ను ఏదైనా ఘట్టి వైద్యుడి దగ్గరకు తీసుకు వెళ్ళి శారీరక, మానసిక ఆందోళన పోయేలా ప్రయత్నించండి.

టి. యస్వి. పిళ్ళై, హైదరాబాద్.

ప్ర: హత్య, కిడ్‌నాపింగ్, దొంగతనం మూడింటిల్లో ఎక్కువ శిక్ష దేనికి పడుతుంది?

జ: మొదటి నేరానికే మోపిడంత శిక్ష.

యం. ఎ. గోపాల్, కూచనపల్లి.

ప్ర: మీరు పట్టిన కేసు లనేకం కదా? డబ్బు, కీర్తి, కామతృష్ణ వీటిలో ఏది ఆధారంగా జరిగిన నేరాల కేసులు మీరు ఎక్కువ చేశారు, ఎందువల్ల?

జ: కీర్తి కావాలనుకున్నవాడు నేరం చేయడం కష్టం. చాలా మంచిగా వుంటాడు. అతని మంచితనం ఆసరాగా ఇతరులు నేరం చేస్తూంటారు. అటువంటి వాళ్ళు నా చుట్టూ వున్నారు. కాని కేసులివ్వలేదు నాకు. నాకూ అడగడం మొహమాటం! ఏమంటారు!

ఇంక డబ్బు కోసం కేసులు చేస్తూనే వున్నాను. నేనూ డబ్బు కోసం కేసు చేస్తాను. నా క్లైంటు కూడా డబ్బు కోసం నాచేత కేసు వేయిస్తాడు. ఇది పరస్పర సహకారం.

ఇక కామతృష్ణ కేసులా! కొన్ని చేశానా-కామతృష్ణ వున్నవారని నిందితులైన వారి పక్షాన, అటువంటివారికి బలియైనవారి పక్షాన—ఈ రెండు రకాలలో ఆడ మగ కూడా వుండవచ్చు—మరి ఈ కేసులు నడుస్తుంటే మీరు వినాలి. ప్రశ్నలు,సమాధానాలు; చెప్పే కథలు రసవత్తరంగా వుంటాయి.

హావంతీ రఘు, బోర్గాం.

ప్ర: సార్, 'లా'లో 'యువర్ ఆనర్' అంటే ఏమిటి?

జ: అది ఒక గౌరవ సంబోధన. మీరు గౌరవనీయులు అని అర్థము. ఈ మధ్య మన హైకోర్టు యిలా జడ్జీలను అనక్కర్లేదని ఆర్డరు పాసు చేశారు. కాని అలవాటైన మా వకీళ్ళ నోళ్ళకు ఇంకా తాళం పడక, యీ మాట అంటూనే వున్నాం. తరతరాల అలవాటు ఒక్క రోజులో పోతుందీ! క్రింది కోర్టుల్లో కేసులు చేసే అలవాటున్నవారు హైకోర్టులో కూడా 'మై లార్డ్' అనబోయి, 'యువర్

ఆనర్' అనేస్తూంటారు—ఏదో ఒక గౌరవం జడ్జీలకివ్వటం న్యాయం కాదా!

ఆర్. జీవన్; పి. లక్ష్మయ్య, పెంటాకలాన్.

ప్ర: మామొక్క చేనులోని చెఱకు గాలికి వంగి మా ప్రక్కవారి దాంట్లోకి వెళ్ళింది. వాళ్లు దాన్ని నరికారు. ఇది న్యాయమేనా?

జ: చాలా అన్యాయం. కాని ఆ ప్రశ్న అడగవలసింది చెరుకు మొక్క. దాని వకాలత్ మీరు తీసుకున్నారా? చెరుకు గాలికి వంగింది కనుక అలా వంగడం చెరుకు నేరం కాదు. గాలి వంచడం తన సహజ గుణం, అదీ నేరం కాదు. వంగిన చెరుకుని నరకడం నేరం కాదు. అవతలి చేను వాడు తన అడ్డు తొలగించుకొన్నాడు. కానీ ఇందులో అన్యాయమైనది ఏమిటంటే, నరికిన చెరుకు గడ అవతలి చేనువాడు ఒక్కడే తినడం—అందులో సగం మీకు వాటా వుంది, అడిగి తీసుకోండి. ఇందులోని నేరస్థులు చెరుకు గడ, గాలి, మీరూ కాదూ, మీ ప్రక్క చేనువాడూ కాదు.

బి. బి. యన్. వి. యస్. కొల్లాపురి, అమలాపురం.

ప్ర: న్యాయం చౌకగా పేద ప్రజలకు అందజేయాల న్నారు మన నాయకులు! అది సాధ్యమా? ఏవిధంగా చేయాలి?

జ: న్యాయం చౌకగా అందించడం అంటే, ప్రభుత్వం ఎక్కువ ఖర్చుపెట్టి లాయర్లద్వారా ఉచితంగా పేదవారికి న్యాయ సలహాలు ఇప్పిస్తుంది మరి. కార్మిక శాసనాల ద్వారా కార్మికులు తమ వేతనాలు, ఇతర ఆర్థిక హక్కులు పొందే కేసులకు ఖర్చులు చాలా తక్కువ. ఇది కొంత వరకు చౌకగా న్యాయం అందించడమే కదూ!

★

వెలుగు వెన్నెల్లు - నల్లని నిముషాలు

పెందుర్తి మాస్టర్జీ

"విహారు చేయవలసిందల్లా ఒక అందమైన అమ్మాయిని హత్యచేయటం. ఇది మీరు చేసిన హత్యల్లోకి అతి తేలికయింది. సులభమయింది...." ఒక్క క్షణం ఆగాడు జగన్నాధం.

నలుగురు రౌడీలు కుతూహలంగా వింటున్నారు, అతని మాటలు.

"అది యీ వూరులోనే వసంత మహల్‌లో వూరికి దూరంగా మూడు ఎకరాల స్థలంలో పాతికేళ్ళనాడు కట్టించ బడింది. ఆ భవంతికి తూర్పున వంద గజాల దూరంలో ట్రంక్ రోడ్, కుడివైపు పెద్ద చెరువు. ఎడమవైపు సరుకు తోటలు, వెనుకభాగంలో యిష్టం వచ్చినట్లు పెరిగిన గడ్డి దుబ్బులు...."

"ఆ యింట్లో ఎందరుంటారు?" భైరవ్ అడిగాడు.

నలభై ఏళ్ళ భైరవ్ జీవితంలో పాతికేళ్ళకు పైగా జైలులోనే గడిచిపోయింది. కాలిన తుమ్మ మొద్దులాంటి ఆకారం. నీగ్రోమనిషిలా వుంటాడు. మానభంగం కేసులో మూడుసార్లు జైలుకు వెళ్ళిన పెద్ద క్రిమినల్.

"ఆ యింట్లో వున్నది ముగ్గురు. ఒకడు ఆ భవంతి యజమాని శంకర్రావు. ఐదేళ్ళ క్రితమే అంధుడయి పోయాడు. రెండవమనిషి ఆ యింటి నౌకరు నారాయణ నమ్మకస్తుడు," జగన్నాధం ఆగాడు.

"అరుణకు పెళ్ళి అయిందా?" భూపాల్ అడిగాడు.

కిలుం పెట్టిన ఇత్తడి గంగాళంలా వుంటాడు, దోనె కడుపు, దొప్ప చెవులు, నెత్తురు చారల కళ్ళు, ముఖమంతా మశూచి మచ్చలు. కుడిచెంపమీద కత్తిగాటు వుంటుంది.

"పెళ్ళి యింకా కాలేదు ఇప్పుడే ప్రేమలో పడింది. ఆమె ప్రేమికుడు రాజు. రాజు ఎప్పుడు ఆ భవంతికి రాడు. యిద్దరు పరోక్షంగానే కలుసుకుంటారు. అరుణ ప్రతిరోజు కాలేజీ అయ్యాక ట్యూషన్‌కి వెళ్ళి తొమ్మిదిగంటలకు వస్తుంది."

"యీ హత్యకు మాకెంత యివ్వగలవు?" భైరవ్ ప్రశ్న.

"పది వేలు."

"పదివేలు యిస్తున్నావంటే ఆమెద్వారా నీకు పదిలక్షలు లభిస్తుందన్నమాట" రాకా అన్నాడు సిగరెట్టు వెలిగిస్తూ.

రాకా సన్నగా పీలగా వుంటాడు, ఒక కన్ను పోయింది. ఒక మనిషిని కత్తితో పొడవాలంటే చెట్టుకు కత్తి గ్రుచ్చినట్లు గుచ్చివేయగల అఖండుడు.

"నాకు ఎంత లభించినా అది మీకు అనవసరం. మీరు నిజాయితీగా వుంటే మరొక ఐదువేలు యిస్తాను."

"గుడ్, యీ హత్య నేరం నీవు చేయలేదని అది మేమే చేశామని విట్నెస్‌గా మా నాలుగు ఆకారాలు నౌకరుకు కనిపించాలి." వాళ్ళందరికి బాస్‌లాంటి మురుగన్ అన్నాడు.

కండలు తిరిగిన బాక్సర్‌లాంటి ఆకారం మురుగన్‌ది. సీసా బ్రాంది హాయిగా త్రాగగలడు. పుష్టిగల మనిషి కాబట్టి అందరిని తిరగబడి చంపగలడు.

"అవును అది ముఖ్యం. అప్పుడు యీ హత్య నేనే చేశానని అనుమానించటానికి అవకాశం వుండదు. నాకు సంబంధించిన 'ఎలిబి' నేను చూసుకుంటాను. మీరు మాత్రం యిలా చేయాలి."

"అయితే యాభై వేలు కావాలి" భైరవ్ అన్నాడు.

"మీరు ఎవరితోను మాట్లాడ వలసిన అవసరం లేదు. ఎవ్వరినీ ఏ విధంగా చంపనవసరం లేదు, చాలా తేలిక."

"చట్టానికి తేలిక బరువుతో సంబంధంలేదు. ఒక హత్య అయినా ఏడు హత్యలయినా శిక్ష ఒక్కటే," రాకా అన్నాడు.

"మేము నిజాయితీగా వుంటాం. ఇది దొంగల్లో నిజాయితీ. నీవు యాభై వేలు యిస్తే మళ్ళీ నీ ముఖం చూడం లేదా నీ యిష్టం. మరొక మాట. మేముకాకుండా ఆ యింట్లో ఎవరు ఏవిధమయిన దారుణం చేసినా ఖరీదు లేకుండా నిన్ను చంపుతాం," భూపాల్ అన్నాడు గంభీరంగా.

కొన్ని క్షణాల తర్వాత "రైట్ యిదిగో పదివేలు రేపు రాత్రి ఎనిమిది గంటలకు మీరు ఆ యింట్లో అడుగు పెట్టాలి. పదిగంటలలోపు మీరు హత్య చేయడం ముగిసి పోవాలి."

* * *

రెండంతస్తులమేడ పిల్లర్స్ నీలంగాను, మేడ మబ్బు రంగులోను వుంది. ఆ మేడకు చుట్టూ అందమయిన గార్డెన్ నైట్‌క్వీన్, గులాబీ, డాలియా మొక్కలతో రమణీయంగా వుంది. గార్డెన్ మొక్కల మధ్య పచ్చని గడ్డి గుబుర్లు పెరిగివున్నాయి.

నగరానికి కాస్త దూరంగా వున్న మేడ అది. గెస్ట్ హౌస్‌లాంటి ఆ మేడ శంకర్రావు మనశ్శాంతి కొరకు కట్టించబడింది. ఆ మేడలో పైన నాలుగు, క్రింద ఆరు గదులు, మధ్య హాలు. పై భాగానికి హాలునుండి కట్టబడ్డ మెట్లు వున్నాయి. పైభాగంలో ఒకటి బెడ్‌రూం, ఒకటి డ్రెసింగ్, మరొకటి బాత్‌రూము, ఇంకొకటి అరుణ

రీడింగ్ రూము. క్రిందభాగంలో ఒకటి స్టోర్ రూము, ప్రక్కనే వంటగది, ఒకటి డ్రాయింగ్ రూము, మరొకటి శంకర్రావు గది, మిగిలిన రెండు గదులు అవసరార్థం వినియోగించుకుంటారు.

రాత్రి ఏడు గంటల సమయంలో ఆకాశం నల్లబడి మబ్బులు కమ్మాయి. అక్కడక్కడ మెరుపులు, అప్పుడప్పుడు వికృతమైన ఉరుములు. చలిగాలి తెరలుగా వీస్తుంది.

"నారాయణ" శంకర్రావు పిలిచాడు.

"అయ్యగారు." అంటూ వచ్చాడు నారాయణ.

"వర్షం వచ్చేలా వుంది. అమ్మాయి అరుణ యింకా రాలేదు. నాకేదో భయంగా వుందోయ్!"

"అమ్మగారు కారులోనే గదా వచ్చేది. మీరేమీ బెంగపడకండి వచ్చేస్తారు. టైము ఏడే గదా అయింది." అన్నాడు నారాయణ.

శంకర్రావు బరువుగా నిట్టూర్చాడు.

ఎక్కడో పిడుగు పడ్డట్టు వికృతమైన శబ్దం.

రోడ్డుమీద కారు ఆగిన చప్పుడు. నారాయణ ఆత్రుతగా గుమ్మం దగ్గరకు వెళ్ళాడు. క్షణంలో మెట్లెక్కి వస్తున్న ఆకారాల్ని చూసి శిలాప్రతిమలా అయిపోయాడు.

"నారాయణ! ఎవరు వచ్చింది?"

క్షణంలో భూపాల్ నారాయణని ముఖంపై గుద్దాడు. నారాయణ పడిపోయాడు. "అయ్యగారూ! దొంగలు!" కంగారుగా అరిచాడు. రాకా బిగ్గరగా నవ్వి, నారాయణను జుట్టుపట్టుకొని లేపి స్తంభానికి కట్టివేశాడు.

"ఆc దొంగలా!" కంగారుగా ఫోను దగ్గరకు వెళ్ళ

ఫిర్యాదులు
COMPLAINTS BOX

గుర్!
గుర్!!
గుర్!!!

బోయాడు. అప్పటికే ఫోను అందుకున్న భైరవ్ శంకర్రావు ముఖంపై గుద్దాడు.

"గుడ్డినాయాలా! ఫోన్ చేస్తావే" అన్నాడు భీకరంగా నవ్వి.

వర్షం ప్రారంభమైంది. "ఎవరు మీరు? ఎవరు?"

"పిచ్చినాయాలా! దొంగలు పేరు చెపుతారా? మేం హంతకులం. పేరు అసలు చెప్పం తెలుసా?" మురుగన్ అన్నాడు.

"మీ అమ్మాయి ఎక్కడ?" పదునైన కత్తి గొంతుమీద పెట్టి కఠినంగా అడిగాడు రాకా.

"ఇంకా రాలేదు....యింకా రాలేదు...." వణికిపోతున్నాడు శంకర్రావు. అప్పటికే గదులన్నీ వెదకివచ్చిన యిద్దరు లేదు అన్నట్లు సైగచేశారు.

మురుగన్ మాట ప్రకారం నలుగురు నాలుగు గదుల్లో దాక్కున్నారు. "ఒరేయ్ గుడ్డి శంకర్రావు! మీ అమ్మాయి వచ్చాక అనవసర ప్రసంగం చేశావా! నీ కళ్ళముందే యీ ఆరు గుండ్లు మీ అమ్మాయి గుండెల్లో దూసుకుపోతాయి. జాగ్రత్త!" హెచ్చరించారు.

ఆకాశం విరిగి పడేటట్లు ఉరుములు, సూర్యుడు పగిలినట్లు మెరుపులు. హోరున వర్షం. ప్రకృతిలో భయంకరమైన కల్లోలం.

అంత వర్షంలో పూర్తిగా తడిసి గభాలున లోపల ప్రవేశించి తలుపు బిగించింది అరుణ. "నాన్న కారు భలే తమాషాగా చెడిపోయింది. ఫర్లాంగు దూరంలో ఆగిపోయింది." అంటూనే శంకర్రావు దగ్గరకు వచ్చి "ఏమిటి నాన్నా! అలా వున్నావు?" అంది.

"అమ్మా! ఈ ఇంట్లో దొంగలున్నారు. పారిపో!" నారాయణ అరిచాడు. మరుక్షణంలో రివాల్వర్ పేలింది. నారాయణ భుజంలోనుండి దూసుకుపోయింది గుండు.

అరుణ కెవ్వున అరిచింది.

మెట్లు దిగి వస్తున్నాడు భైరవ్, స్టోర్ రూములోనుండి వస్తున్నాడు రాకా. మరొక గదిలోనుండి భూపాల్, మూలగా కూర్చున్నాడు మురుగన్. అందర్నీ చూసిన అరుణ పై ప్రాణాలు పైనే పోయాయి.

అరుణ అందమైన ఇరవై ఏళ్ళ యువతి. అందం ఒక ఆడదై పుడితే ఆమెలా వుంటుంది. గోల్డ్ స్పాట్ కలర్ చీరె బొడ్డు దిగువగా కట్టటంతో పిరుదుల ఎత్తులు, సన్నని నడుము, అందమైన వంపులు కనిపిస్తున్నాయి.

భైరవ్ ఆమె అందాన్ని త్రాగేస్తున్నట్లు పెదవులు చప్పరించాడు. తడిసి సన్నగా, నగ్నంగా కనిపిస్తున్న ఆమె శరీరంలో అణువణువు చూస్తున్నాడు రాకా. కామంతో కళ్లు విప్పారాయి భూపాల్ కి. మురుగన్ ఆమెను నఖశిఖ పర్యంతం పరీక్షిస్తున్నాడు.

"ఒరేయ్! పిట్ట భలే జోరుగుంది, ఒక పట్టు పడదాం."

"నా బిడ్డనేం చేయకండి. నా బిడ్డనేం చేయకండి." కంగారుగా అరుస్తున్నాడు శంకర్రావు.

మురుగన్ రాకాకు సైగచేశాడు. రాకా రివాల్వర్ పిడితో శంకర్రావును కొట్టాడు. 'నాన్నా!' అంటూ వెళ్ళబోయింది అరుణ. భూపాల్ చటుక్కున చెయ్యి పట్టుకున్నాడు.

"వద్దులు. చివరిసారిగా తండ్రిని చూస్తుంది." మురుగన్ అన్నాడు. భూపాల్ వదిలివేసి వికృతంగా నవ్వాడు. అరుణ

తండ్రిని కౌగలించుకొని ఏడ్చింది. "రాకా! తలుపు తాళం వెయ్యి" అన్నాడు.

రాకా మెయిన్ డోర్ లాక్ చేశాడు.

నాలుగు పులుల మధ్య లేడిపిల్లలా అయింది అరుణ.

గుండెల్లో రైలుపట్టాల మోత. వణికిపోతున్న శరీరం, బెదరిపోతున్న చూపులు. దిక్కులేని ఆడదైపోయింది.

ఏం చేయాలి? ఎలా చెయ్యాలి?

అరుణ క్షణంలో మెరుపులా పైభాగంలో రీడింగ్ రూములోనికి పరుగెత్తి తలుపు బిగించుకుంది. నలుగురు వికృతంగా నవ్వారు. ఆ భవంతి మెర్క్యురీ లైట్ల వెలుగులో పట్టపగలులా వుంది.

అరుణ తలుపులు బిగించి నిట్టూర్చింది. గొంతు తడారిపోతోంది. తడిసిపోయిన శరీరం, బట్టలు చెమటతో తడవసాగాయి.

"తలుపు పగలకొట్టు" భైరవ్ అన్నాడు.

"నువ్వే కానివ్వు భైరవ్! నీవు కాస్త బలవంతుడివి. ముందు అనుభవం నీది. తరువాత మాది. నీవు వచ్చేవరకు హాలులో కూర్చుంటాము. ఊఁ క్విక్!" అన్నాడు రాకా భైరవ్‌ను ముందుకు తోస్తూ.

మెరుపు మెరిసింది. మెరుపులాంటి ఆలోచన వచ్చింది అరుణకు. గబగబ అల్మరా తెరిచింది. అందులోనుండి వైర్ముక్క తీసి రెండువైపులా తీగె కనిపించేలా పళ్ళతో గబగబ లాగింది.

ఒకే ప్లగ్‌లో పాజిటివ్, నెగెటివ్ కలిసేలా వైర్ పెట్టింది. ఫట్‌మని ఫీజులు పోయాయి.

అంతా అంధకారమైంది.

"కరెంట్ పోయిందా?" భూపాల్ ప్రశ్న.

"నో. ఫీజు ఎగిరిపోయింది. తెలివిగల అఖండురాలు. జాగ్రత్త! ఎట్టి పరిస్థితిలోనూ బయటకు వెళ్ళకూడదు. భైరవ్ రివాల్వర్‌తో కాల్చు." మురుగన్ అన్నాడు.

భైరవ్ రివాల్వర్‌తో లాక్ పగలగొట్టి తలుపు తెరిచాడు.

అంతా చీకటి! అంధకారమయం!!

అగ్గిపుల్ల వెలిగించాడు. ఆ గదిలోనుండి మరొక గది లోనికి దారి వుంది. వెతుకుతుంటే అగ్గిపుల్ల అయిపోతుంది. ఎక్కడో ఏదో అలికిడి అవుతున్నట్లు నిట్టూర్పులు. నిశితంగా గాజుల శబ్దంగాని, అడుగుల శబ్దంగాని వినిపిస్తుం దేమో గమనిస్తూ గదంతా మూరుమూలలు వెతుకుతున్నాడు.

అప్పుడప్పుడు మెరుపు. ఆ మెరుపు వెలుగులో గదిలో అన్ని వస్తువులు కనిపిస్తున్నాయి. భైరవ్ అగ్గిపుల్ల గీసి నడుస్తుంటే భూతమో, దయ్యమో నడుస్తున్నట్లు అనిపి స్తుంది,

"ఏం భైరవ్! కనిపించలేదా?"

"తొందరలేదు. బైటకు పోలేదు." సమాధానం.

బీరువా తెరిచిన చప్పుడు. అరుణ బీరువాలో దాక్కుంది. బీరువాలో వున్న చీరెలు అడ్డుగాపెట్టి నిలబడింది. భయంతో గుండెలు దడదడమంటున్నాయి. రక్తం వేగంగా ఉరకలు వేస్తూంది. ఏది వెలుగో, ఏది చీకటో తెలియని అంధకారం.

అది డ్రెసింగ్ రూము. ఆ గదిలోనికి భైరవ్ వచ్చినట్లు అడుగులు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఆ అడుగులు దగ్గరవు తున్నాయి. అరుణ శ్వాస ఆగిపోయింది. భైరవ్ బీరువా ముందు నిలబడి తలుపు లాగాడు. తను లోపల లాగింది. భైరవ్ నవ్వి బలంగా లాగాడు. అరుణ వదిలేసింది. భైరవ్ తూలి క్రింద పడ్డాడు. ఆవేశంగా లేచాడు.

అగ్గిపుల్ల గీచి బీరువాలోనికి చూశాడు. అన్ని చీరెలు. రవికలు చిందరవందరగా వున్నాయి. భైరవ్ లోపలకు చెయ్యిజాపి తడమసాగాడు.

అరుణ తల వెంట్రుకలు వేళ్ళకు తగిలాయి. అరుణ పై ప్రాణాలు పైనే పోయాయి. "ఎక్కడికి పోతావే బొమ్మా!" అంటూ భైరవ్ నవ్వి ఆమె వెంట్రుకలు వేళ్ళకు మెలిపెట్టి బలంగా లాగాడు.

తూలి ముందుకు పడింది అరుణ. క్రింద భైరవ్, పైన అరుణ పడ్డారు. భైరవ్ పకాలున నవ్వాడు.

అప్పటికే అరుణ చేతుల్లో మెరుస్తున్న కత్తి భైరవ్ గుండెలో ఎడమవైపు బలంగా దిగిపోయింది. మాట లేకుండా ఎవరో తోసినట్లు క్రింద పడిపోయాడు భైరవ్. క్షణాలలో ప్రాణం పోయింది.

అరుణ ఆ గదిలోనుండి మరో గదిలోనికి వెళ్ళి పోయింది.

గదిలోనికి వచ్చిన ముగ్గురు భైరవ్‌ను పిలిచి సిగార్ లైటర్ వెలిగించారు. తెరచిన నోరు, తెల్లని కళ్ళు, గుండె నుండి కారిన రక్తం చూసి నిస్తుపోయారు. ముగ్గురి ముఖాలు ఎర్రనయ్యాయి.

మురుగన్ గబగబ మెయిన్‌డోర్ దగ్గరకు వెళ్ళాడు. ఆ డోర్ మూసేవుంది. అంటే అరుణ బయటకు వెళ్ళలేదు.

"రాకా, భూపాల్, జాగ్రత్త! తలుపులన్నీ వేస్తే పిల్లి అయినా పులిలా మీదపడుతుంది. ఈ అంధకారంలో ఒక ఆడదాన్ని ఏమీ చేయలేకపోతే చావటం మంచిది. వెతకండి. గదులన్నీ వెతకండి."

జోరుగా వర్షం కురుస్తోంది. పిడుగులు పడుతున్నాయి.

మెరుపులు మెరుస్తున్నాయి. హోరున వీస్తోంది గాలి.

వంటగదిలో మూలగా నిలబడి గజగజ వణికిపోతోంది అరుణ. రాకా బూట్లచప్పుడు, తలుపులు తెరిచి దభాలున మూసిన చప్పుడు వినిపిస్తూంది. అప్పటికి ఆ గది చీకటిగానే వుంది. కాని ఎవరైనా అగ్గిపుల్ల గీస్తే!

ఏడవాలనిపిస్తోంది అరుణకు. ఆగంతకుల కాళ్ళు పట్టుకొని ప్రతిమాలాలనుకుంది. అయినా ఫలితం వుండదు.

కాల్ గ్యాస్‌మీద చెయ్యిపడింది. ఆ గదిలోనుండి బాత్ రూములోనికి దారి వుంది. ఏం చెయ్యాలి? ఏదో ఒకటి చెయ్యాలి.

ఆ గదిలో చేయవలసిన పని ముగించి, బాత్ రూములో నించి అరుణ వెనుక రూంలోకి వెళ్ళింది.

రాకా వంటగది తలుపు గభాలున తెరిచాడు.

సిగార్ లైటర్ వెలిగించాడు.

క్షణంలో గదంతా భగ్గుమంది. ఆ గదంతా జ్వాలలు లేచాయి. ఆ జ్వాలలు రాకాను చుట్టుముట్టాయి. రాకా బిగ్గరగా అరిచి క్రిందపడిపోయాడు. ఇద్దరు సమీపించే లోపుగానే కాలిపోతూ తన్నుకుంటూ చచ్చిపోయాడు.

"ఏమిటీ మంటలు?" భూపాల్ అన్నాడు ఆశ్చర్యంగా.

"కాల్ గ్యాస్ లూస్ చేయటంతో గదంతా గ్యాస్‌తో నిండిపోయింది. రాకా సిగార్ లైటు వెలిగించటంతో గదంతా వున్న ఆక్సిజన్ అంటుకుంది, భూపాల్ జాగ్రత్త! ఆ అరుణను అణువణువు నలిపి నాశనంచేసి మరీ చంపాలి." మురుగన్ అన్నాడు కసిగా.

మళ్ళీ ఒక్కొక్క గది వెతకటం ప్రారంభించారు ఇద్దరూ.

"భూపాల్ జాగ్రత్త. యింత భవంతిలో ఒక్క ఆడ దాన్ని చంపలేక యిద్దరు చచ్చారు. ఆ దయ్యాన్ని ముక్కలుగా కోసి ట్రంక్ బాక్స్‌లో పార్సిల్ చెయ్యాలి. ఈ అంధకారంలో, ఈ మేడలో నుండి బయటకు పోనివ్వకూడదు."

మెరుపులు, ఉరుములు వికృతంగా వున్నాయి.

కుండపోతగా వర్షం కురుస్తూనే వుంది.

భూపాల్ అరుణ పరుగెత్తిన వైపు నడిచాడు. మురుగన్ అనుసరించాడు. మళ్ళీ ఒక్కొక్క గది అగ్గిపుల్ల వెలిగించి వెతకసాగారు. ఇద్దరిలో ఆవేశం బుసలు కొడుతోంది.

"రివాల్వర్ స్టడీ చెయ్" మురుగన్ అన్నాడు.

భూపాల్ బెడ్‌రూము లోనికి నడిచి అగ్గిపుల్ల గీశాడు.

బెడ్ మీద విలాసంగా పడుకొని వుంది అరుణ.

భూపాల్ తలుపు బిగించాడు. మురుగన్ గది బయటనే ఆగిపోయాడు.

మెరుపుల వెలుగులో గదిలో పాల నురుగులాంటి మంచం, మంచంమీద అరుణ చలించకుండా వుంది.

"ఏం? ఇద్దరిని చంపి నిద్దరోతున్నావా?"

"లేదు. నీ సుఖంకోసం ఎదురుచూస్తున్నా."

"మోసగించకు, నాతో సుఖించినా మరణం తప్పదు. ఇది చివర రాత్రి నీకు, ఈ చీకటిలో నీ చావు పిలుస్తుంది."

"అయినా భయం లేదు."

"అంటె?"

"చచ్చే ముందు మగవాడి సుఖంతో చావాలని వుంది" అంటూ రవిక హూక్ విప్పి లంగా పైకి జరిపింది. "రా ఈ చాన్స్ నీకు దక్కదు." అంటూ ప్రక్కనే వున్న ఖాళీస్థలం చూపింది.

భూపాల్ వికృతంగా నవ్వి, ఎగిరి మంచంమీద బోర్ల

పడ్డాడు.

అంతే అప్పటికే మంచం క్రింద నిలబెట్టిన ఇనుపకమ్మి భూపాల్ గుండెల్ని చీల్చుకొని వీపులోనుండి బయటకు వచ్చింది.

వికృతంగా అరిచాడు భూపాల్.

ఆ భవంతి ప్రతిధ్వనించింది. గబాలున అతని దగ్గరున్న రివాల్వర్ లాక్కుంది.

మురుగన్ ఆత్రుతగా తలుపు తట్టాడు. తెరుచుకోలేదు.

రివాల్వర్ పేల్చి తలుపు తెరిచి అగ్గిపుల్ల గీశాడు.

అరుణ రివాల్వర్ పేల్చింది.

"ఆఁ" అంటూ పడిపోయాడు మురుగన్.

అరుణ గబగబ మెట్లు దిగి "నాన్న....నాన్న" పిలిచింది. నారాయణ కట్లు విప్పటానికి ప్రయత్నించింది.

మురుగన్ వికృతమయిన నవ్వు ఆ భవంతిలో దశదిశల మారుమ్రోగింది. శిలా ప్రతిమలా స్థంభించిపోయింది అరుణ.

అంతే చీకటి మెరపు మెరసినపుడు తప్ప ఏమీ కనిపించని అంధకారం అది. ఆ అంధకారంలో ఆమె ఒక అబల.

గబాలున జుట్టు పట్టుకున్నాడు మురుగన్.

"నన్ను కాల్చి చంపా ననుకున్నావ్. ఎవ్వరి నుండయినా తప్పుకోవచ్చు. కాని యీ మురుగన్ ముందు నీ తెలివితేటలు ఎందుకు పనికిరావు. రా," అంటూ అరుణను జుట్టు పట్టుకొని భవంతి బయటకు లాక్కు వెళ్ళాడు.

అరుణ అరుస్తుంది, గోలపెడుతూంది.

వర్షంలో తడిసిపోతూ భవంతి బయట చెట్టు క్రిందకు తీసుకువెళ్ళాడు.

"యిదిగో పలుగు....అదిగో పార, నీ సమాధి గొయ్యి నువ్వే తవ్వుకో. నీవు తీసుకున్న గొయ్యిలో నిన్ను సజీ

వంగా పూడ్చి పెడతాను. నా మిత్రులను చంపినందుకు ప్రతీకారం తీర్చుకుంటాను," అంటూ బెల్ట్ తీశాడు.

అరుణ వణకిపోతోంది. ఒక ప్రక్క తడిసిన శరీరం మరొక ప్రక్క కురుస్తున్న వాన, చావు కళ్ళముందు నాట్యం చేస్తున్నట్లు అనిపిస్తూంది. తడిసి ముద్దయిపోయిన శరీరం అస్పష్టంగా, నగ్నంగా కనిపిస్తోంది.

"ఉఁ త్వరగా," బెల్ట్‌తో కొట్టాడు.

రెండంగుళాల వెడల్పు వాత పడింది.

"అమ్మా" అని అరచింది. "అమ్మకాదు. ఇంకాసేపట్లో చేరుకొనే భగవంతుడ్ని పిలుచుకో." అంటూ మళ్ళీకొట్టాడు.

పలుగుతో త్రవ్వసాగింది.

నీళ్ళు. బురద. నేల చితచిత లాడుతోంది.

ఎప్పుడు పలుగు పార పట్టని చేతులతో అతి ప్రయత్నం మీద త్రవ్వుతూ మట్టి ప్రక్కకు వేస్తుంది, తను ఆగితే బెల్టుతో కొడుతున్నాడు మురుగన్.

ఇంతలో మెరపులాంటి ఆలోచన వచ్చింది.

పై చెట్టుమీద ఓ తేనెపట్టు వుంది. మరుక్షణంలో మట్టి గడ్డల్ని చేత్తో తీసి చెట్లలోనికి విసిరింది. అది అర్థంగాని మురుగన్ వికృతంగా నవ్వాడు.

అంతలోనే తేనెటీగలు జుమ్మని లేచాయి.

మురుగన్‌ను చుట్టుముట్టాయి. అవకాశం చిక్కించుకున్న అరుణ దగ్గరిలో వున్న గోడ ఎక్కి పారిపోసాగింది.

తేనెటీగలు పీకసాగాయి. మురుగన్ రివాల్వర్ పేల్చాడు పట్టు తప్పింది.

రెండడుగులు ఎత్తు పెరిగిన గడ్డిబీడు. చిన్న బురద గొయ్యిలు. వడివడిగా అడుగులు వేస్తుంది. అదిరే గుండెలు, బెదిరే చూపులు, వణకే శరీరంతో ఆ దుబ్బుల మధ్యగా

పరుగు తీస్తోంది.

వెనుకగా రివాల్వర్ చేత పట్టుకున్న మురుగన్ పరుగెత్తుకు వస్తున్నాడు.

మెయిన్‌రోడ్డు మీదకు వెళ్ళాలంటే చాలా దూరంగా వుంది.

చుట్టూ అంధకారం.

గుడ్లగూబల కూతలు, తీతువ పిట్ట అరుపులు వికృతంగా వున్నాయి.

అరుణ శరీరం స్వాధీనం తప్పిపోతున్నట్లుంది. భయము, చలి గజగజ లాడించేస్తున్నాయి. చలిలో చెమటలు, పాదాలలో రక్తం చారికలు, అడుగు భాగంలో ముళ్ళ గీతలు.

ఎదురుగా ఒక గొయ్యి కనిపించింది. ఆ గొయ్యి అవతల భాగంలో పెద్ద చెట్టు, మరొక ప్రక్క కొద్దిగా గడ్డి వుంది.

మురుగన్ సమీపించే లోపు ఆతృతగా గడ్డి పీకి ఆ గొయ్యిలో విసిరింది. గొయ్యి ప్రక్కనుండి తిరిగి చెట్టుకులంగా ముడి విప్పి కట్టి మరొప్రక్క ఒదిగి కూర్చుంది.

పరుగున వచ్చి మురుగన్ గొయ్యిలో అడుగు వేశాడు, కాలు ఆగిపోయింది. మరొక కాలు వేశాడు. రెండు కాళ్ళు దిగబడి పోతున్నాయి. అప్పు డర్థమయింది, అది వూబి అని. కంగారుగా గబగబ కాళ్ళు లాగబోయాడు. లాభం లేదు.

నడుం వరకు దిగిపోయాడు.

"కాపాడండి....కాపాడండి" గట్టిగా అరుస్తున్నాడు. చేతితో నీళ్ళమీద కంగారుగా కొడుతున్నాడు. క్రమంగా దిగిపోతున్నాడు మురుగన్. మెడ వరకు దిగిపోయాడు.

"అరుణా కాపాడు...." దీనంగా అరుస్తున్నాడు. ఎందరి ప్రాణాలనో నిర్దాక్షిణ్యంగా తీసిన మురుగన్ ప్రాణభయంతో

అరుస్తున్నాడు.

తరువాత పెదవులు, ముక్కు, కళ్ళు, మురుగన్ శరీరం పూర్తిగా ఆ వూబిలోనికి దిగిపోయింది.

అరుణ హాయిగా వూపిరి పీల్చుకుంది.

*   *   *

"ఇది జరిగింది ఇనస్పెక్టర్ వీళ్ళ నలుగుర్ని నేనే చంపాను" అంది అరుణ ఎదురుగా వున్న క్రైమ్ బ్రాంచి ఇనస్పెక్టర్ విజయ్‌తో.

"మిస్టీరియస్. చాలా ఆశ్చర్యంగా వుంది. నా సర్వీస్‌లో వినలేదు."

"మీరు యే శిక్ష విధించినా సిద్ధమే."

"నో. నీవు ఆత్మరక్షణార్థం చంపావు. వాళ్ళు చాలా భయంకరమయిన హంతకులు. ప్రభుత్వం కన్ను కప్పి తిరుగుతున్న గుండాలు. వాళ్ళను చంపినందుకు ప్రభుత్వం నీకు బహూమతి యిస్తుంది. ఈ కుట్ర జరిపించింది...."

అప్పటివరకు ప్రక్కనే కూర్చున్న అరుణ పినతండ్రి కొడుకు జగన్నాథం "అదే అర్థం కావటంలేదు ఇనస్పెక్టర్! స్వతహాగా వాళ్ళే వచ్చి వుంటారా? లేక...."

"నీలాంటి పెద్దమనుషులు పంపి వుంటారా? అని మిస్టర్ జగన్నాథం నిన్నటి రోజున మీరు బ్యాంకులో డబ్బు తీసు కోవటం, అదే డబ్బు హంతకులకు యివ్వటం ఆ నోట్ల నెంబర్లు, హంతకుల దగ్గర వున్న నెంబర్లు ఒకటే కావటం వల్ల యిది నీవల్లే జరిగిందని చెప్పకనే తెలుస్తుంది. నిన్ను అరస్టు చేస్తున్నాము," అన్నాడు ఇనస్పెక్టర్ విజయ్. జగన్నాథం అరెస్టు చేయబడ్డాడు.

మరునాడు పేపర్లో, 'నాలుగు హత్యలు, నలభై నిమిషాల్లో' అన్న విచిత్రవార్త ప్రచురించబడింది. ★

పోలీసుల పరిశోధన పోటీ

-కాసారపు సంజీవయ్య

73. అందరూ శత్రువులే!

(బహుమతి రూ. 50/-లు నగదు)

"రండి! ఇదే మీ కోసం యేర్పరిచిన యిల్లు." ఆహ్వానించాడు రంగారావు. లోపలికి నడిచి చూశాను. నన్ను ఆకర్షించాలని చాలా నీటుగా ఉంచాడు ఇంటిని. నాకు సాయంగా ఉండటానికి నీలకంఠం అనే పాలేరుని ప్రత్యేకంగా నియమించాడు.

రంగారావుని ఆ వూరికి సర్వాధికారి అనొచ్చు. చండశాసనుడు, మహా దుర్మార్గుడని విన్నాను. అయితే ఆ వూరికి నేనో కేస్ విషయంలో ఆచూకీ తీయడానికి రావాల్సి వచ్చింది. ముందు ముందు పనికొస్తానని కాబోలు, నాకు బాగా మర్యాద చేస్తున్నాడు.

రంగారావుది లంకంత కొంప. సినిమా సెట్టింగులా బ్రహ్మాండంగా ఉంటుంది. ఆ వూర్లో కొన్ని ఆరాలు-కూపీలు తీసి నాకు ఏర్పరిచిన యింటిలోకి నడిచాను. డ్రెస్ విడిచి లుంగీ వేసుకుంటుండగా—

"ఇనిస్పెటర్ బాబో!" పరిగెత్తుకుంటూ వచ్చాడు నీలకంఠం.

నేను 'ఏమిటీ' అన్నట్టు చూశాను.

"ఘోరం జరిగినాది బాబో! రంగారావయ్యగార్ని ఎవరో సంపేసినారు బాబో!" గుండె పగిలేలా ఏడుస్తూ చెప్పాడు నీలకంఠం.

నిర్ఘాంతపోయాన్నేను. రెండు గంటల క్రితం నాతో వ్యవహారాలు మాట్లాడిన రంగారావు హత్యచెయ్యబడ్డాడంటే, నమ్మ బుద్ధికాలేదు.

డ్రెస్సేసుకుని హుటాహుటిని, ఊరు చివర్న గల రంగారావు భవంతిలో కెళ్ళేసరికి, పావుగంట పైనే అయింది.

రంగారావు జీతగాళ్ళు పగ్గైరాలు నన్ను చూసి, దారియిచ్చారు లోనికి. లోపలి కెళ్ళేసరికి, రక్తంమడుగులో పడి ఉంది, రంగారావు శవం.

శవం వీపులోంచి - కడుపులోకి దిగి ఉంది పెద్ద బరిశె (బల్లెం) కర్ర. ఇలాంటి బరిశెలు రంగారావు నౌకర్లందరికీ ఉన్నాయి. మొహం పరికిస్తే వెంటనే చావలేదని, కొన్ని నిమిషాలు చాలా క్షోభపడి చచ్చాడనిపించింది.

ఒక ప్రక్క నేలపై "పా" అనే అక్షరం వ్రాయబడి ఉంది రక్తంతో. కుడిచేయి చూపుడు వ్రేలుకు రక్తం అంటుకుని అది రంగారావే రాశాడని సూచిస్తోంది. అతని కళ్ళు సూటిగా శివ పార్వతుల పాలరాతి విగ్రహం వంక చూస్తున్నాయి. అతని ఎడమ చేయి తన మెడపై బిగించి పట్టుకున్నాడు.

దగ్గరే ఉన్న 'జగిత్యాల' పోలీస్ స్టేషన్‌కి కబురు పంపి, రంగారావు పర్సనల్ బీరువా తెరిచాను. అందులో రంగారావు డైరీలు ఉన్నాయి. 1976 డైరీ చూశాను, ఫిబ్రవరి 10 వ తేదీన ఇలా వ్రాసుకున్నాడు—

"నా భార్య పార్వతి యవ్వనవతి. ఆమెకు నేనెలాంటి సుఖం ఇవ్వలేకపోతున్నాను. అయితే, పార్వతి ఎవరితోనో అక్రమ సంబంధం పెట్టుకుందని....చూచాయగా తెలిపింది. పార్వతిని యేమీ అనలేను. కాని, వాడెవడో తెలిస్తే.... మళ్ళీ వెలుగు చూడకుండా చేస్తాను" అని ఉంది.

ఫిబ్రవరి 12 న "పార్వతికి ఎవరితోనో సంబంధం ఉంది. వాడెవడో కాదు, నా భవంతిలోనే ఉండేవాడై ఉండాలి. వాణ్ని దొరకబుచ్చుకుని-ఖతం చేసే బాధ్యత నా పాలేరు నీలకంఠంపై వేశాను. వాడు నాకు నమ్మకస్తుడు" అని ఉంది.

ఆ డైరీ పట్టుకుని శవం దగ్గరికొచ్చాను. శవం చుట్టూ కొంతమంది మౌనంగా-విలపిస్తూ ఉన్నారు.

"చూడండి! ఈ శవాన్ని మొదట చూసిందెవరు?" అందరి వంకా చూస్తూ అడిగాను.

"బహుశ నేనే కావొచ్చు!" అన్నాడు ఓ యువకుడు.

పక్కకు తీసికెళ్ళి వివరాలడిగాను.

"ఇన్‌స్పెక్టర్! నాపేరు పాపారావు. కొత్తగా అపాయింటయిన పశువుల డాక్టర్‌ని. రంగారావు పాడిగేదకి జబ్బు చేసిందని కబురువస్తే....వచ్చాను. నేను వచ్చేసరికి....ఈ శవం కనిపించింది!" చెప్పాడు పాపారావు.

"అచ్ఛా! మీరేమైనా చెప్పేదుందా!" అడిగాను.

"నథింగ్! కాని, హత్య చేసినవారెవరు బైటివారు మాత్రం కాదు!"

నేను ఆలోచిస్తూ, పార్వతిని పిలిచాను.

ఆమె రంగారావుకి తృతీయ కళత్రం. పాతికేళ్ళు మించి ఉండవు. మంచి అందగత్తె. ఆమె మౌనంగా విలపిస్తోంది

"చూడమ్మా! మీ ఆయన హత్య విషయంలో మీరేమైనా చెబుతారా!" సూటిగా ఆమె వంక చూస్తూ అడిగాను.

"ఆయన చావు అందరు ఊహించిందే! ఆయనలాంటి వ్యక్తులకి శత్రువులుంటంలో తప్పు లేదు."

"మీ కెవరిపైనన్నా అనుమానం ఉందా!"

"ఎవరిపైనని చెప్పను. ఇంటి నౌకర్లతో సహా అందరికీ ఆయనంటే కసే! ఒక్క నీలకంఠానికి తప్ప!!"

"హత్యా సమయంలో మీ రెక్కడున్నారు?"

"పూజా గదిలో! ఇవాళ శనివారం కదూ!!" పార్వతి జవాబు.

తర్వాత వంటమనిషి పాకాలుని పిలిచి అడిగాను.

"నేను పూజగది ముందే ఉన్నానయ్యా, పూలదండలు కడ్తూ!! అమ్మగారు చెప్పింది నిజమే!" పాకాలు చెప్పింది.

నీలకంఠంని పిలిచాను. కళ్ళు తుడుచుకుంటూ వచ్చాడు. వానికి డైరీలో విషయం చెప్పి-వివరాలడిగాను.

దానికి నీలకంఠం "నిజమే బాబు! పార్వతికి-ఎవరితోనో సంబంధం ఉంది! వాడు పాపారావు అయ్యుండాలి! బాబు! అయ్యగారు మహా కోపిష్టండి! తెలిస్తే చంపేస్తాడని ఆ పాపారావు అయ్యగారిని చంపుండాలి!" చెప్పాడు వాడు.

నేనో ఐదు నిమిషాలు తల బ్రద్దలు కొట్టుకున్నాను. హంతకు లెవరో తెలిసిపోయింది నాకు.

*   *   *

[ఇదీ కథ. దీనిలో హంతకులెవరో కనిపెట్టి, వివరంగా ఒక పోస్టుకార్డు సైజు తెల్లకాగితంపై వ్రాసి, ఈ నెల 20వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. షో౦. డె. సభ్యులు

తమ నెంబరు, చిరునామా వ్రాస్తే చాలు. ఇతరులు తమ సమాధానంతో 30 పైసలు పోస్టలు స్టాంపులు జతపరచాలి. కేసుని అత్యుత్తమంగా పరిశోధించిన ఐదుగురు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 10/-లు చొప్పున నగదు బహుమతి పంపగలము. ఫలితాలు జూన్ '76 నెల సంచికలో ప్రచురించ బడతాయి. —ఎడిటర్.]

పోటీ నెం. 71 [ఫలితాలు]

హంతకుడు—దినకర్.

హతుడు చనిపోతూ పేపరుమీద 'R' అని వ్రాశాడు. అలా వ్రాసి పేపరును చేతిలో గట్టిగా పట్టుకున్నాడు. ఆ ఇంగ్లీషు అక్షరాన్ని నేలమీద వ్రాయటానికి కూడా హతుడికి అవకాశాలున్నాయి. కాని పేపరు మీద వ్రాసి, ఆ పేపర్ని గట్టిగా పట్టుకున్నాడంటే, డైలీ పేపరుకు-ఆ లెటర్‌కు ఏదో సంబంధం ఉండాలి. డైలీ పేపరు-అదే దినపత్రిక మీద 'ఆర్' అని వ్రాశాడంటే, నిశితంగా ఆలోచిస్తే అది 'దినకర్' అవుతోంది.

దానికి తోడు హతుడి ఎడమచేతి వేలు సప్తాశ్వరథుడ్ని సూచిస్తోంది. సప్తాశ్వరథుడికి ఉన్న నామాలలో 'దినకర్' ఒకటి.

హత్య తనమీదకు రాకుండా బటన్, సిగరెట్ పీక, కీరాడ్ సేకరించి....హతుడి గదిలో పడవేశాడు, హత్యానేరం ఆ ముగ్గురిమీద మోపవచ్చునని. అవి ఎవరో కావాలని పడవేసినట్లు స్పష్టంగా తెలుస్తూంది. ఆ వస్తువులలో దినకర్‌కు సంబంధించిన వస్తువులు మాత్రమే లేకపోవడం గమనార్హం.

* * *

మాకు వచ్చిన జవాబులలో ఈ క్రింది ఐదుగురు పాఠకులు వ్రాసిన జవాబులు అత్యుత్తమంగా నిర్ణయించి, వారికి ఒక్కొక్కరికి రు. 10/లు చొప్పున నగదు బహుమతి పంపుతున్నాము.

1. శ్రీ జి. జగన్మోహన్, బి.ఎస్.సి., కేరాఫ్—ఆర్. ఏ. నర్సు, బడేవారి వీధి, జగన్నాయక్ పూర్, కాకినాడ-2.

2. శ్రీమతి ఎమ్. ఉషారాణి, ఎం.ఏ., 6/467, లక్ష్మీనగర్, అనంతపురం.

3. శ్రీమతి ఐ. అన్నపూర్ణ, కేరాఫ్—డాక్టర్ పి. ఎస్. శాస్త్రి, 358, గాంధీనగర్, నాగపూర్.

4. శ్రీమతి డి. మనోహరి, కేరాఫ్—డి. సుబ్బారావు, శంకర్ ఆటో వర్క్స్, కొత్తపేట, గుంటూరు-1.

5. శ్రీమతి వి. హైమవతి, బి.ఎస్.సి., భర్తపేరు—డాక్టర్ వి. వి. రంగారెడ్డి, ఎమ్.బి.బి.ఎస్., సతీష్ క్లినిక్, 9/243, డి. ఎమ్. గేట్ రోడ్, గుంతకల్-2. ★

మొదటివాడు: ఏమిటిరా! ఇవేళ ఏమి కొట్టేశావు?

రెండవాడు: ఒక షావుకారు జేబులో త్రిబుల్ ఫైవ్ సిగరెట్ పెట్టె.

మొ. వా: అయితే నాకొకటిలా పడేయ్!

రె. వా: ఒరే సన్యాసి, ఆ సిగరెట్ పెట్టెలో ఉన్నది ఒకే ఒక గణేశ్ బీడి. దానిని అక్కడే మురుగు కాల్వలో పడేసి వచ్చాను.

—టి. ఎమ్. సత్యనారాయణరెడ్డి, కడప.

సప్లిమెంట్ పోటీ-17 [ఫలితాలు]

ఫిబ్రవరి '76 నెల "సప్లిమెంట్ పోటీ_17" కి సరియైన జవాబు :

46	44	48	45	47

పై విధంగా సరియైన జవాబు ఇద్దరు మాత్రమే వ్రాశారు. వీరికి మే '76 నెలనుండి ఒక ఏడాది పాటు "సప్లిమెంట్" ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేతలు :

(1) శ్రీ ఎమ్. మధుమూర్తి,
సేల్సుటాక్సు ఇన్ స్పెక్టర్,
డోర్ నెం. 6/467,
లక్ష్మీనగర్,
అనంతపురం_515001.

(2) శ్రీమతి సాధన,
ఫ్లాట్ నెం. 1, రివైరా,
మెరిన్ డ్రైవ్,
బొంబాయి_20.

విషాదయాత్ర
సంపత్

టెలిఫోన్ బెల్ మోగటంతో డ్రస్ వేసుకుంటున్న నేను ఫోన్ దగ్గరకు నడిచాను. రిసీవర్ ఎత్తి "హలో! ఇన్‌స్పెక్టర్ రాజు స్పీకింగ్!" అన్నాను.

"హల్లో రాజూ, తీరికగా వున్నావా?" అవతలి నుండి కృష్ణారావు కంఠం మోగింది.

"ఇప్పుడే స్టేషన్‌కు బయలుదేరాను. ఏమిటి విశేషం?" అన్నాను.

"రేపు ఆదివారం నాడు ఒక దీవికి పిక్నిక్‌కు ప్రోగ్రాం వేశాం. మీరు కూడా వస్తారేమోనని ఫోన్ చేశాను."

"ఆల్‌రైట్! మేమూ వస్తాము" అన్నాను. నిజానికి పిక్నిక్‌కి వెళ్ళాలని ఎన్నాళ్ళనుంచో వుంది నాకు. కాని ఎప్పటి కప్పుడు ఉద్యోగరీత్యా ఏదో అవాంతరం రావటం, పిక్నిక్‌లో పాల్గొనకపోవటం జరుగుతూంది.

ఇంతలో లోపల నుంచి సుకన్య వచ్చింది. ఆదివారం పిక్నిక్ సంగతి ఆమెకు చెప్పాను. ఆమెలో కూడా ఉత్సాహం కన్పించింది.

* * *

ఆ రోజు ఒక మోటార్‌బోట్ అద్దెకు తీసుకుని మొత్తం పదకొండుమంది బయలుదేరాము. నేనూ, సుకన్య, కృష్ణారావు, అతని భార్య జానకి, వారి పిల్లలు ముగ్గురు; మరో కుటుంబం లక్ష్మీపతి, ఆయన భార్య మీనాక్షి, వారి పిల్లలు.

లక్ష్మీపతి, మీనాక్షి చాలా కలుపుగోలు మనుషులులాగా కన్పించారు. అంతకు ముందు వారితో మాకు పరిచయం లేదు. మాతో పరిచయం అయిన కొద్ది నిముషాలలోనే కల్సిపోయారు. లక్ష్మీపతి, కృష్ణారావు ఒకే ఆఫీసులో పని చేస్తుండటమే కాకుండా ఇళ్లు కూడా దగ్గిర అవటంవల్ల వారి

కుటుంబం మధ్య బాగా పరిచయం వుంది.

బోట్ స్పీడ్‌గా పోతూంది సముద్రంతో.

"సంవత్సరంగా ఉన్న కోరిక నేటికి తీరిందండి!" అన్నాను.

లక్ష్మీపతి నవ్వాడు. "నేను ఇంతకు ముందే నాలు గయిదుసార్లు వెళ్ళి వచ్చాను అక్కడికి. చాలా బాగుం టుంది" అన్నాడు.

చుట్టూ ఎటు చూపినా సముద్రం. కనుచూపు మేర వరకు నీళ్ళు తప్ప మరేమీ కన్పించడం లేదు.

దాదాపు ఉదయం పది గంటల ప్రాంతంలో ఒక దీవిని చేరింది బోట్. సామానులు దించి బోట్‌ను పంపేశాము. రెండు రోజులవరకు దాని అవసరం లేదు మాకు. తిరిగి ఎల్లుండి సాయంకాలం రమ్మని చెప్పాము.

అందరం సామానులు తీసుకుని దీవిలోనికి బయలు దేరాము.

ఆ దీవి అంతా చెట్లతోనిండి ఉన్నట్లు కనబడుతోంది. దూరంగా దక్షిణ భాగాన ఎత్తయిన గుట్ట కనబడుతోంది. దానిమీద ఒక చిన్న భవనం కన్పిస్తూంది. దీవి అంతా నిశ్శబ్దంగా వుండి భయం గొలుపుతూంది.

భవనం చేరాలంటే చెట్ల సముదాయాన్ని దాటిపోవాలి. అందరం భవనం వైపు నడక సాగించాము.

లోపలికి పోయేకొద్ది చెట్లు పలచనవుతున్నాయి. అక్క డక్కడ బురదగా వుంది. ఆ దీవే కాదు, ఆ దీవుల్లో వున్న నాలుగయిదు దీవులు కూడా చాలా అందమయినవి. ప్రభుత్వం టూరిస్టు డిపార్ట్‌మెంట్ ఆ దీవుల్లో విశ్రాంతి గృహాలు నిర్మించింది యాత్రీకుల సహాయార్థం. ఆ దీవిలో

విష కీటకాలుగాని, ప్రాణాంతకమయిన మృగాలుగాని లేకుండా జాగ్రత్త వహించింది. అయితే ఇప్పుడిప్పుడే ఆ దీవిమీద శ్రద్ధతీసుకోవటంవల్లా ఇంకా అన్ని వసతులు ఏర్పడలేదు.

మరో అరగంట తర్వాత అందరం భవనాన్ని చేరుకున్నాము. చిన్న బంగళాలా వుంది. పెద్ద హాలు. దానికి మూడువయిపులా గదులు. నాలుగో వైపు సింహద్వారం ఉత్తరంగా వుంది. కాపలాగా ఎవరూ లేరు.

సమయం కాని సమయంలో వచ్చినందువల్ల మేము తప్ప మరెవ్వరూ లేరు ఆ దీవిలో.

దాదాపు మైలు దూరంలో వేడి నీటిపాయ వుంది. ఆ పాయలో ఎల్లప్పుడూ వేడినీరు విరజిమ్ముతూ వుంటుందిట.

మరో గంటలో ఆ పాయ దగ్గరికి వెళ్ళి అందరము స్నానాలు చేసి వచ్చాము.

* * *

చీకట్లు ముసురుకుంటున్నాయి.

బంగళాలో కరెంటు లేకపోవడంవల్ల మా వెంట తెచ్చిన కొవ్వొత్తి వెలిగించాము.

ఆడవాళ్ళు వంట ప్రయత్నాలలో పడ్డారు. పిల్లలు హాలులో కూర్చొని అల్లరి చేస్తున్నారు. మగవాళ్ళం ముగ్గురం బయట చప్టా మీద కూర్చొని కబుర్లలోపడాము.

అక్కడ కూర్చొని చూస్తే సముద్ర తీరం స్పష్టంగా కన్పిస్తూంది వెన్నెల్లో. అనంతమైన ఆకాశంలో దూరంగా దిగ్దిశాంతాలు కలిసే చోట ఏదో స్టీమరులైట్లు కాబోలు అస్పష్టంగా కన్పిస్తున్నాయి. చలి ఎముకల్ని కొరికేస్తుంది.

ఉన్నట్లుండి లక్ష్మీపతి చెబుతున్నవాడల్లా మాటలు ఆపి, ఎటో చూస్తూ కూర్చున్నాడు.

టైం చూసుకున్నాను. రేడియం డయల్ ఏడు గంటలు చూపుతోంది.

"అటు చూడండి!" అని సముద్ర తీరం వంక చూపాడు లక్ష్మీపతి. నేనూ, కృష్ణారావు అతను చూపిన వైపుకు చూశాము. గాని ఏమీ ప్రత్యేకత గోచరించలేదు. ఆ సంగతే చెప్పాను.

"సరిగ్గా చూడండి దీవి అంచుకు దగ్గరగా చిన్నలైటు! అటూ ఇటూ తిరుగుతున్నట్లు కన్పిస్తోంది" అన్నాడు లక్ష్మీపతి.

ఇద్దరం దృష్టిని కాన్సన్ట్రేట్ చేసి చూశాము.

నిజమే! రెండు నిముషాలనంతరం చిన్న లైటు కన్పించింది. గాలిలో తేలుతూ అటూ ఇటూ వూగుతున్నట్లుంది.

"కొరివిదెయ్యమా!" అడిగాడు కృష్ణారావు. అతనికి కాస్త భయం ఎక్కువ.

"భయపడకండి. దెయ్యంగాదు పాడూకాదు. అది సరే! మీ దగ్గర కెమేరా, ఫ్లాష్ లైట్ది ఉందిగదూ?" అని అడిగాడు. ఉందని చెప్పాను.

"మనం చాలా అదృష్టవంతులం. చాలా రేర్గా కన్పించే ఒక వింత జీవిని చూడబోతున్నాం. అదేమిటో తెలుసా?"

తెలియదన్నట్లు తల వూపాము.

"నిజం చెప్తే మీరు నమ్మలేరు! అది ఒక మిణుగురు పురుగు!"

తెల్లబోయాము మేము. మమ్మల్ని ఫూల్స్ చేస్తున్నాడనిపించింది.

"చూశారా: నేను మొదటే చెప్పాను మీరు నమ్మలేరని. మీరే కాదు, మొదట్లో నేనూ నమ్మలేదు. కాని స్వయంగా చూసిన తర్వాత నమ్మకుండా ఎలా వుండగలను? కావాలంటే పరీక్షగా చూడండి, మిణుగురు పురుగులా ఆరిపోయి, వెలుగుతూ లైటు కన్పిస్తుంది."

ఇద్దరం మరల కళ్ళు చికిలించుకుని చూశాము. ఈ సమయంలో బైనాక్యులర్స్ లేకపోవడంవల్ల పెద్ద ఇబ్బందిగా తయారయింది.

అది దాదాపు కందిరీగ అంత వుంటుంది. కొంచెం పెద్దదే కూడాను. కాని దానినుండి మాత్రం ఎక్కువ వెలుగు వస్తూంటుంది. అందుకే ఇంతదూరంలో కూడా అది కన్పించింది.

"దానివల్ల మనకు ఏ హానీ లేదు. వీలుంటే ఫ్లాష్ లైట్ కేమెరాతో ఫోటోలు తీయడానికి ప్రయత్నిద్దాం. ఏమంటారు?" అని మావైపు చూశాడు లక్ష్మీపతి. మేము అంగీకరించాము.

మరో అరగంటలో వస్తామని సుకన్యతో చెప్పి, కెమెరా తీసుకొని బయలుదేరాము. ముగ్గురం ఆ మిణుగురు పురుగు కన్పించిన దిక్కుగా నడవసాగాము.

ముగ్గురమూ మౌనంగా నడవసాగాము. ఎండుటాకులు మా బూట్ల క్రిందపడి నలిగి, శబ్దం చేస్తున్నాయి. లక్ష్మీపతి చేతిలోని టార్చిలైట్ వెలుగుతూ దారి చూపుతోంది. మాకంటె ముందుగా నడుస్తున్నాడు లక్ష్మీపతి. చటుక్కున నాకొక అనుమానం వచ్చింది. నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ అడిగాను.

"లక్ష్మీపతిగారూ! ఫోటోలు తీద్దాం అన్నారుగదా, ఎలా

తీస్తాం? ఆ మిణుగురు పురుగు కాంతి ఇక్కడికి కూడా కన్పిస్తోంది. దగ్గరకు వెళితే ఆ కాంతికి ఫోటోలు పడతాయా?"

"ఈ మిణుగురు పురుగుని చూడలేదన్నమాటేగాని, దాని గురించిన వివరాలు అన్నీ తెలుసు. అది తన రెక్కలను ముడిచి, తెరవటానికి దాదాపు అయిదు సెకనులు పడుతుంది. అంటే ఈ అయిదు సెకన్ల కాలంలోనే మనం ఫోటో తీయాలి. మరో విషయం! దానివల్ల మనకే ప్రమాదం లేదుగానీ, అది మనల్ని పసిగట్టకుండా జాగ్రత్తపడాలి. ఏమాత్రం పసిగట్టినా ఎగిరి వెళ్ళిపోతుంది."

అంటూ హెచ్చరించాడు లక్ష్మీపతి. ముగ్గురం నడుస్తూ మరో పావు గంటలో తీరాన్ని చేరాము.

ఆ మిణుగురు పురుగు ఇంకా అక్కడే వుంది. దాదాపు కందిరీగ అంత వుంది. దాని శరీరం నుంచి కాంతి వెలువడుతూంది. అయితే ఆ కాంతి కళ్ళకు 'డాజిలింగ్'గా లేదు. అది తన రెక్కల్ని ముడుచుకోవటం, తెరవటం స్పష్టంగా కన్పిస్తోంది. సముద్ర తీరం మీద ఎగురుతూ, అప్పుడప్పుడు క్రిందకు వాలి దేన్నో తన్నుకుని మరల పైకి ఎగురుతూంది.

ముగ్గురం తీరం వద్దనున్న చెట్లచాటునుంచి గమనిస్తున్నాం దానిని.

"దాని శరీరం నుంచి వచ్చే కాంతి చూసి జంతు జాలం దగ్గరకు రాదు. శత్రువులని గ్రహించి దూరంగా పోతాయి. అందుకే అరగంట నుంచి తిప్పలు పడుతున్నా దానికి తిండి దొరకలేదు" గుసగుసలాడుతున్నట్లు చెప్పాడు లక్ష్మీపతి.

నేను వెన్నెల్లో తీరాన్ని చూస్తూ, ఫోటో ఎక్కడ

నుంచి తీయాలో ఆలోచిస్తున్నాను. తీరంలో బండరాళ్ళుండటంవల్ల ఆ ఈగకు కన్పించకుండా దాగి ఫోటో తీయటం సులభం. అయితే అక్కడికి చేరుకోవాలి.

అయిదు నిమిషాల తర్వాత నా ఆలోచనలను లక్ష్మీపతికి కృష్ణారావుకు చెప్పాను. వారిద్దరూ ఆమోదించి చెట్ల చాటునే వుండిపోయారు.

నేను ఇసుకలో బోర్లా పడుకొని ముందుకు పాక సాగాను. నా చేతుల్లో కెమేరా వుంది మిణుగురు పురుగుకు ఎయిమ్ చేసి. నెమ్మదిగా పాకుతున్నాను వూపిరి బిగబట్టి ఏమాత్రం అలికిడి అయినా అది పారిపోతుంది.

రెండు నిమిషాలలో ఐదు గజాలు ముందుకు జరిగాను. మిణుగురు పురుగు దృష్టి ఇంకా సముద్రం మీదే వుంది. మరో మూడు గజాలు దాటితే బండరాయి చాటున దాగ వచ్చు.

హఠాత్తుగా కేక! భయంకరంగా విన్పించింది నా వెనక. ఆ గొంతు లక్ష్మీపతిది.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాను. ఏమి జరిగిందో తెలుసుకోవాలి. ఆ పాటికే మిణుగురు పురుగు మమ్మల్ని పసిగట్టి వెళ్ళిపోతూంది. దూరంగా దానికాంతి కన్పిస్తూంది.

లేచి నిలబడి వెనక్కి పరుగెత్తాను. చెట్లచాటున లక్ష్మీపతి క్రిందపడిపోయి వున్నాడు. కాళ్లు చేతులు కొట్టుకుంటున్నాడు. కళ్ళు మూసుకుపోయి వున్నాయి. కృష్ణారావు గాభరాగా టార్చిలైట్ అతని మీదకు వేసి చూస్తున్నాడు.

లక్ష్మీపతి ఏదో చెప్పటానికి నోరు తెరుస్తున్నాడు. కాని నోట మాట రావడం లేదు. కృష్ణారావుని ఏం జరిగిందని అడిగాను.

లక్ష్మీపతి చెట్టు బోదెకు ఆనుకుని నిలబడి నా వైపు చూస్తూన్నాడట. ఉన్నట్టుండి కేకవేసి క్రింద పడటంతో కృష్ణారావు టార్చిలైటుని చెట్టు బోదె మీదకు వేసి చూశాడట. ఎంద్రపీతలాంటి జీవి అప్పుడే బోదె తొర్రలోకి పోవటం కన్పించిందిట.

క్రింద పడ్డ లక్ష్మీపతి స్పృహ కోల్పోయాడు. కాళ్ళు, చేతులు ఆడటం ఆగిపోయాయి. ఏం చేయాలో తోచలేదు. చటుక్కున గుర్తుకొచ్చింది. ఇంట్లో ఫస్టుఎయిడ్ బాక్సు వుండాలి. జానకికి నర్సింగ్ తెలుసు.

కృష్ణారావును అక్కడే వుండమని చెప్పి భవంతి వైపు పరుగెత్తాను చీకట్లో. కళ్ళు చీకటికి అలవాటు పడటంవల్ల అస్పష్టంగా వస్తున్న వెన్నెల్లో దారి కన్పిస్తూ వుంది.

పదినిముషా లనంతరం భవంతికి చేరుకుని ఫస్టు ఎయిడ్ బాక్సుతోసహా బయలుదేరమన్నాను జానకిని. ఏదో ఘోరం జరిగిందని అనుమానించారు వాళ్ళు. ఏం జరగలేదని, లక్ష్మీపతికి కాలుజారి బెణికిందని చెప్పి జానకిని బయలుదేరదీశాను.

మరో ఇరవై నిముషాల అనంతరం లక్ష్మీపతి పడి వున్నచోటుకి చేరుకున్నాము. అక్కడి దృశ్యం చూచి నిర్ఘాంతపోయాను. జానకికి అర్థంగాక తెల్లబోయింది.

చెట్ల మొదల్లో కృష్ణారావు స్పృహతప్పి పడివున్నాడు. అతని చేతిలో టార్చిలైటు ఇంకా వెలుగుతూంది. ప్రక్కనే వుండాల్సిన లక్ష్మీపతి లేడు.

* * *

అయిదు నిమిషాలనంతరం కృష్ణారావుకి స్పృహ తెప్పించాము.

చెప్పుకోండి చూద్దాం?

1. ఉరి తీయబడిన ఒక వ్యక్తి చేతులు ఎలా వుంటాయి?

2. ఒక వ్యక్తి స్మృతితప్పి మరణించినట్లు పోస్టు మార్టంలో ఎలా గుర్తించవచ్చు?

3. ఒక వ్యక్తి శరీరంలోని అస్తిపంజరపు ఎముకలను రాసుకుంటూ చొచ్చుకుపోయిన బుల్లెట్ వల్ల మరణించాడు. ఆ వ్యక్తి అస్తిపంజరాన్ని పరీక్షించి, ఆ ఎముకలను బుల్లెట్ రాసుకుంటూ పోయినట్లు కనుగొనవచ్చునా?

4. ఇద్దరి కంఠాలను ఒకే వుచ్చులో బిగించి వురిలాగా వ్రేలాడదీస్తే ఆ వ్యక్తుల ప్రాణాలు పోయే అవకాశాలున్నాయా?

5. ఒక నేరస్తుడు విడుదల అయ్యే రోజున జైలు నుండి పారిపోతే అధికారులు అతడ్ని పట్టుకుంటారా, లేక 'విడుదల అయ్యేవాడే' కదా అని, వదిలేస్తారా?

6. ఒక వ్యక్తిని నామరూపాలు లేకుండా చేసే ద్రవ పదార్థం ఏది?

—కె. చందర్‌రావ్.

జవాబులు:

1. పిడికిల్లు బిగించుకొని వుంటాయి.

2. ఆ వ్యక్తి గుండె ఎడమభాగంలో రక్తం ఖాళీగా వుంటుంది.

3. కనుగోలేము.

4. ప్రాణాలు పోవు.

5. పట్టుకుంటారు.

6. సల్ఫూరిక్ ఏసిడ్.

మా వంక భయంగా చూశాడు. మరో పది నిముషాలకు గాని తేరుకోలేదు అతను.

కృష్ణారావు చెప్పిన సంగతులు విని దిగ్భ్రాంతుల య్యాము. నేను అటు భవంతి వైపు వెళ్ళగానే కృష్ణారావు ఏమీ తోచక లక్ష్మీపతి వైపు టార్చిలైటు వేసి చూశాడట. లక్ష్మీపతిలో చలనం లేదు. దాపుల్లో నీరేమయినా దొరుకు తుందేమోనని లైటు తీసుకొని బయలుదేరాడట. కొంత దూరం పోగానే నీటి గుంట కన్పించింది. ఒక ఆకు దొన్నెలో నీటిని తీసుకొని వచ్చాడట. లైటు చంకలో వుంది.

అయితే లక్ష్మీపతి కదులుతున్నట్లనిపించడంవల్ల ఒక చేత్తో ఆకు దొన్నె, మరో చేత్తో లైటు పట్టుకొని ఫోకస్ చేశాడట. మరుక్షణమే ఆకుదొన్నె జారిపోయింది చేతుల్లో నుంచి.

లక్ష్మీపతి ఇప్పుడు మామూలుగా లేడు. నోట్లోంచి ఆ చివరా, ఈ చివరా రెండు కోరలు పొడుచుకొచ్చాయి బయటకు. తలమీద జుట్టు మాడిపోయినట్లయింది. చేతులు సన్నగా అయి ఎముకలకు చర్మం అతుక్కుపోయినట్లు న్నాయి. ముఖం మీద తొంభై ఏళ్ళ వృద్ధులకంటే కూడా ఎక్కువగా ముడతలు ఏర్పడి, దవడలు మీది చర్మం లోతుకుపోయి భయంకరంగా తయారయాడు. కనుబొమలు కూడా మాడిపోయినట్లుండడంవల్ల మరింత భయంకరంగా ఉన్నాడు.

తన మీద ఫోకస్ పడగానే చివుక్కున లేచి కూర్చు న్నాడు లక్ష్మీపతి. అతని కళ్ళు ఎర్రగా భయంకరంగా వున్నాయి, కృష్ణారావు చేతిలోని లైటు చూసి అమాంతం

ముఖం కప్పుకున్నాడు. అప్పుడు చూశాడతని చేతివేళ్ళను. వేళ్ళ గోళ్లు పెరిగి సూదుల్లాగా వున్నాయి.

కృష్ణారావు గుండాగిపోయినట్లనిపించింది. అరవటానికి నోటమ్మట మాట కూడా రాలేదు. అలానే జారిపోయాడు నేలమీదకు.

కృష్ణారావు చెప్పింది విని మేము ప్రాన్పడిపోయాము. కలా, నిజమో తెలియటం లేదు. ఈ ఇరవయ్యో శతాబ్దంలో కూడా ఇలాంటి వింతలు జరుగుతాయా? అసలు కృష్ణారావు చెప్పింది నిజమేనా లేక దేనినన్నా చూసి దడుసుకోవటంవల్ల మతి స్థిరం తప్పి అలా మాట్లాడుతున్నాడా?

కృష్ణారావు వంక అనుమానంగా చూశాను. తలంతా రేగిపోయి, దుమ్ము కొట్టుకొని వుంది. వళ్ళంతా చెమటలు పట్టాయి. సన్నగా వణుకుతున్నాడు. జానకి అతనికి అతుక్కుపోయి వుంది.

ముగ్గురం బంగళా వైపు బయలుదేరాము. లక్ష్మీపతిలో ఈ మార్పులు ఎలా కలిగాయి? అన్న ఆలోచనకన్న లక్ష్మీపతి భార్య మీనాక్షికి ఈ విషయం ఎలా తెలపాలి అన్నది సమస్య అయ్యింది నాకు. జానకికి ఉన్న గుండె ధైర్యం మిగిలిన ఆడవాళ్ళకి లేదు.

మేము సగం దూరంలో ఉండగానే బంగళాలోనుంచి అరుపులు విన్పించాయి. అదిరిపడ్డాము.

నేను ముందుకు దూసుకుపోయాను. చేతిలో టార్చిలేదు. అది కృష్ణారావు దగ్గర వుంది. దోవ బాగా అలవాటు అవటంవల్ల సులభంగానే పరుగెత్తగలుగుతున్నాను.

బంగళాలో అరుపులు ఆగిపోయాయి. ఏమయింది

వారికి? లక్ష్మీపతి వచ్చాడా? దిబ్బమీదనుంచి ఎవరో పరుగెత్తుకుంటూ చెట్లచాటున మాయం అవటం నా కంట పడింది.

ఒక్క పరుగులో లోపలకు వచ్చి పడ్డాను.

అందరూ స్పృహ తప్పి పడిపోయి ఉన్నారు హాలులో.

వెంటనే సుకన్యకు స్పృహ తెప్పించాను. నన్ను చూసి బావురుమంటూ నన్ను కౌగలించుకుంది. సముదాయించాను. పది నిముషాలనంతరం తేరుకొంది. కాని ఇంకా ఏడుస్తూనే ఉంది. ఇంతలో కృష్ణారావు, జానకి వచ్చేశారు. జానకిని చూసి మరలా బావురుమంది సుకన్య.

అరగంట తర్వాతగాని ఆ హాలులో మామూలు పరిస్థితులు అలుముకోలేదు. సుకన్య చెప్పింది విని నిర్ఘాంత పోయాము.

మేము వెళ్ళిన పది నిముషాల తర్వాత తలుపులు తట్టిన శబ్దం విని, హాలులో ఆడుకొంటున్న పిల్లల్లో ఒకరు తలుపు తెరచారు. సుడిగాలిలా లోనికి దూసుకు వచ్చాడు లక్ష్మీపతి.

అతని ఆకారం చూసి దడుచుకొని కేకలు ప్రారంభించారు పిల్లలు. లోననుంచి యిద్దరు రాడవాళ్ళు బయటకు వచ్చి లక్ష్మీపతిని చూస్తూనే అదిరిపోయారు. లక్ష్మీపతి మూర్ఛపోయి ఉన్న ఒక పిల్లవాడిని ఎత్తుకొని పోబోయాడు.

సుకన్య కంగారుగా చేతిలోనున్న కొవ్వొత్తి అతని మీదకు విసిరేసింది. లక్ష్మీపతి పిల్లవాణ్ని వదిలి అరుచుకుంటూ వెళ్ళిపోయాడు. కాని అప్పటికే మీనాక్షికి, సుకన్యకు స్పృహ పోయింది.

అంతా విని భారంగా నిట్టూర్చాను.

అసలతను ఎలా మారాడు? ఒకవేళ లక్ష్మీపతి మెడమీద కుట్టిన ఆ పీతకి, లక్ష్మీపతి మార్పులకీ సంబంధం ఉందా?

ఆలోచించిన కొద్ది ఈ విషయం నిజం అని దృఢ పడుతోంది. జానకి నన్ను తట్టటంతో ఆలోచనలనుంచి తేరుకున్నాను.

ఏమిటన్నట్లు ఆమె వైపు చూశాను. భయంగా చూస్తోంది జానకి, మీనాక్షి వైపు. ఏమయిందో అర్థంగాక మీనాక్షి చెయ్యి పట్టుకు చూశాను. చల్లగా, మంచు ముద్దలా ఉంది అది.

ఆ రాత్రంతా మే మెవరమూ నిద్రపోలేదు. మీనాక్షి శవాన్ని గదిలో ఉంచి బయట గొళ్లెం వేశాము. లోపల ఒక కొవ్వొత్తి వెలిగించి ఉంచాను.

పిల్లలు మరింతగా దడుచుకున్నారు. భయం వారి కళ్ళల్లో విపరీతంగా కన్పిస్తోంది. అనుకున్న దొకటి, అయ్యిందొకటి! 'జాలీ'గా గడపవలసిన వాళ్ళం, ఎలా అయిపోయింది తలుచుకుంటే భయంతోబాటు, లక్ష్మీపతి కుటుంబంమీద జాలికూడా వేస్తూంది. ఎటు తిరిగి పరిస్థితులన్నీ ఎదురు తిరిగి ఆపదల పాలయినది అతని కుటుంబమే. భయంతో మీనాక్షిదేవి చనిపోయింది గుండె ఆగి. అది భయంవల్ల గావచ్చు, లేక తన భర్తని గుర్తు పట్టయినా కావచ్చు.

* * *

మధ్య రాత్రి బయట తలుపు తట్టిన చప్పుడు విన్పించి అందరూ ఉలిక్కిపడ్డారు. బలంగా బాదుతున్నా రెవరో. ఆ వచ్చినది లక్ష్మీపతి అని తెలిసిపోయింది. భయంతో అంతా ఒకరి కొకరు దగ్గరగా చేరారు.

తలుపులు విరిగి పోతాయేమో ననిపించింది. చేతితో కొవ్వొత్తి పట్టుకొని తలుపు దగ్గరకు నడిచాను, వారిస్తున్నా వినకుండా.

కాని తలుపు దగ్గర చప్పుడు ఆగిపోయింది. ఎవరో వెళు తున్నట్లు బలంగా అడుగుల చప్పుడు విన్పించింది.

తలుపు తెరిచి చూశాను. ఎవరూ కన్పించలేదు. తలుపులు మూసి మళ్ళీ గడియ పెట్టి వచ్చాను.

పిల్లలు నిద్రపోయారు. బంగళా తలుపు లన్నీ వేసి, లోపల గడియ పెట్టాము. అందరమూ హాలులోనే ఒకరి కొకరికి దగ్గరగా పడుకున్నాము. చాలా సేపటివరకూ నిద్ర పోలేదు నేను.

లక్ష్మీపతి గురించిన ఆలోచనతో యెప్పుడు నిద్ర పట్టిందో తెలియదుగాని, ఏదో శబ్దం వినరావటంతోనే ఉలిక్కి పడి లేచాను. కృష్ణారావు, జానకికూడా మేల్కొన్నారు.

గదిలో నుండి బయటకు వచ్చాను. శవం ఉన్న గది లోంచి విన్పిస్తోంది తలుపులు పడగొట్టినట్లు. ఒక్క క్షణం కళ్ళు బైర్లు కమ్మినట్లయింది.

శవం ఉన్న గదిలో శబ్దం యెలా వస్తూంది? యెవరో ఆ గదిలో ప్రవేశించారు. లేక మీనాక్షి చనిపోలేదా?

ఆలోచించుకుంటూనే మీనాక్షి శవం ఉన్న గదివైపు నడి చాను. లోపల నుంచి శబ్దం ఆగిపోయింది. తలుపులు సందు లోంచి చూశాను. లోపల కొవ్వొత్తి వెలుగు లేదు. అయి పోయి ఉండాలి.

వెనక్కు వచ్చి టార్చ్ లైటు తీసుకొని, గది తలుపులు తెరిచి చూశాను. స్టన్ అయిపోయాను. కిటికీ తలుపులు విరగ గొట్టబడి, దానికి ఉన్న ఇనుప బద్దీలు వంచబడి ఉన్నాయి. లోపల ఉండాల్సిన మీనాక్షిదేవి శవం లేదు.

"కృష్ణా!" పెద్దగా కేకవేసి, కిటికీ తలుపుల వద్దకు నడి చాను. దూరంగా ఎవరో పరుగెత్తుతుండటం వెన్నెల్లో

స్పష్టంగా కన్పిస్తోంది. అతని భుజంమీద ఎవరో ఉన్నారు. అతను లక్ష్మీపతి.

*   *   *

"లక్ష్మీపతికి శవాలతో పనేమిటి?" నా మెదడును తొలిచి వేస్తున్న ప్రశ్న యిది. జరిగింది చూసి మరింత బెంబేలు పడిపోయారు మిగిలినవారు. ఇటువంటిదే మరో సంఘటన జరిగితే వారి గుండె లాగిపోవటం తథ్యం అన్పించింది నాకు.

కాని ఒక ఆలోచన నా మదిలోకి రావటంతోనే శరీరం జలదరించింది. లక్ష్మీపతి శవాలను పీక్కు తినడు కదా?

కంపించిపోయాను. లక్ష్మీపతి గురించి నేను వేసుకున్న అంచనాలు తారుమారు అయ్యాయి. పెద్దగా బలంలేని అతను ఇనుపచువ్వలు వంచగలిగాడు. ఒక శవాన్ని ఈజీగా మోసుకుంటూ పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. అంటే అతనిలో దెయ్యపుబలం వచ్చివుండాలి. అంటే అతన్ని బంధించటం మామూలు తాళ్ళతో అయ్యే పనిగాదు.

వెంటనే లేచి నిలబడ్డాను. మిగిలినవారు నావైపు చూశారు ఏమిటన్నట్లు? నాకొచ్చిన ఆలోచన వారికి చెప్ప లేదు. చెబితే మరింత భయపడతారు.

"వెంటనే వెళ్ళాలి. లక్ష్మీపతి ఆ శవాన్ని ఏంచేయదల్చు కున్నాడో తెలుసుకోవాలి," అన్నాను గంభీరంగా.

సుకన్య నావైపు చూసింది గాభరాగా. కృష్ణారావు, జానకి మాట్లాడలేదు కొంతసేపటివరకు.

నేను అవసరమైన సామానులు తీసుకొని వెళ్ళటానికి సిద్ధపడ్డాను. కృష్ణారావు తనూ వస్తానన్నాడు. ఆ గొంతులో అభ్యర్థనలేదు. ఫార్మాలిటీకోసం అడిగినట్లుంది. వద్దని చెప్పి జాగ్రత్తలన్నీ మరోసారి విశదపరిచి నడిచాను.

బయట వెన్నెల విరగ కాస్తోంది. దీవి అంతా స్పష్టంగా కనపడుతోంది వెన్నెల్లో. విరిగిపోయిన కిటికీవద్దకు నడిచాను. నా చేతిలోని టార్చ్‌లైటు వెలిగించి నేలమీద చూశాను. అక్కణ్ణుంచి లక్ష్మీపతి అడుగులు బలంగా నేలమీద వున్నాయి. వాటి ననుసరించి నడిచాను.

అడుగులు చెట్లలోనికి పోయాయి. చెట్లు దట్టంగా వుండడంవలన చీకటిగా వుంది. ఎండుటాకులమీద కాలు పడి శబ్దం కాకుండా జాగ్రత్తగా నడవసాగాను. లక్ష్మీపతి కాలి వేలిగోళ్ళు కూడా బాగా పెరిగివుండాలి. ఆ గుర్తులు కూడా స్పష్టంగా పడ్డాయి. చాలా బరువుగా వేయటంవలన అడుగులు చాలా స్పష్టంగా కన్పిస్తున్నాయి.

చటుక్కున ఆగిపోయాను. చెవులు రిక్కించి విన్నాను. నిశ్శబ్దంగా వుంది. దూరంగా సముద్రపు హోరు, చలిగాలి రివ్వున వీస్తున్న శబ్దం తప్ప మరేమీ లేదు. కీచురాళ్ళ రొద కూడా లేదు.

నాలుగైదు అడుగులు వేసి ఆగాను. సందేహం లేదు. ఏదో శబ్దం. ఇన్నేళ్ళుగా ఇన్‌స్పెక్టర్ అనుభవం నాకు భ్రమని కల్గించలేదు.

టార్చిలైటు ఆర్పేశాను. నా కుడిచేతిలో పదునైన కత్తి వుంది. నేను ఎదుర్కోబోయేది మానవుణ్ని గాదు. ఒక మాన్‌స్టర్‌ని.

శ్వాస బిగించి నెమ్మదిగా తల వెనక్కు తిప్పి పరీక్షించి చూశాను. ఎవరూ కన్పించలేదు. లైటు వెల్గించకుండానే మూడు అడుగులువేసి ఆగిపోయాను.

ఈసారి స్పష్టంగా తెలిసిపోయింది. నన్నెవరో అనుసరిస్తున్నారు. లక్ష్మీపతిలో తెలివితేటలు అధికం అయ్యాయి.

మృగాల చేష్టలు చేస్తున్నాడు. అదును చూసి నామీదకు లంఘిస్తాడు.

లక్ష్మీపతి చేష్టలవల్ల నాకు తెల్సిన సంగతి ఒకటి ఉంది. అదేమిటంటే అతనికి ప్రస్తుతం వెలుగు అంటే భయం. మంట, ఎండ మొదలైన వాటికి దూరంగా ఉంటాడు. బహుశా కృష్ణారావు చేతిలో టార్చ్‌లైటు వెలుగుతుండటం వల్లనే అతన్ని చంపకుండా పారిపోయాడని ఊహించ గలిగాను.

నెమ్మదిగా వెనక్కు తిరిగాను. అలా తిరిగే రెండు అడుగులు వెనక్కి వేసి ఆగిపోయాను.

నా ముందున్న ఆకారం స్పష్టంగా కన్పించింది. కొద్ది దూరంలో ఒక చెట్టు బోదె చాటున ఉన్నాడు. దొంగదెబ్బ తీయటానికి ప్రయత్నిస్తున్నాడు.

నా చేతి వేళ్ళు కత్తిపిడి మీద బిగుసుకున్నాయి.

లక్ష్మీపతి ఆకారం ఆ చీకట్లో కూడా భయం కలిగిస్తూంది. వాసన చూస్తున్నాడు, నా ఉనికి కనిపెట్టడానికి.

నేను ఒక చెట్టు చాటుకి తప్పుకొని అతన్ని గమనిస్తు న్నాను. అతను నాకోసం చూస్తున్నాడు. ఇద్దరం ఒకరి నొకరు దొంగదెబ్బ తీయడానికి ప్రయత్నిస్తున్నాం. ఊపిరి పీల్చటం కూడా మానేశాను.

లక్ష్మీపతి చెట్టు చాటునుండి ముందుకు వచ్చాడు. అక్కడ చెట్లుగాని, పొదలుగాని లేక ఖాళీగా ఉంది కొద్ది ప్రదేశం.

గుండె నిండా ఊపిరి పీల్చి కత్తి యెత్తాను. అతని వెనగ్గా నడిచాను శబ్దం కాకుండా. కత్తి అతని జెబ్బలో పొడవాలని నా ఉద్దేశం. చేతిని ముందుకు విసిరాను.

కాని....అప్పటికే ఆలస్యం అయింది.

లక్ష్మీపతి తన వెనక శబ్దాన్ని పసికట్టి, చివ్వున వెనక్కు తిరిగాడు. కత్తి గురి తప్పి అతని కుడి రొమ్ములో గుచ్చుకుంది. పెద్దగా అరిచాడు. నా మీదకు లంఘించాడు.

నా చేతిలోని టార్చిలైటు దూరంగా ఎగిరిపోయింది. కత్తి అతని రొమ్ములోనే ఉంది. క్రింద పడ్డాను. లక్ష్మీపతి నామీదకు దూకాడు. అతని మొరటు చేతులు నా కంఠం మీదకు పాకాయి.

అతని వేళ్ళు గొంతులోకి దిగబడుతున్నాయి. రెండు, మూడు నిమిషాలలో నాపని ఆఖరు అని గ్రహించాను. నా శక్తినంతా ఉపయోగించి అతన్ని తోసివేయటానికి ప్రయత్నిస్తున్నాను. కాని వీసం అంత కూడా కదలటం లేదు.

అతని కళ్ళనించి నిప్పులు రాలుతున్నాయి. గాయం నుంచి విపరీతంగా రక్తం కారుతోంది.

నా నాలిక వెళ్ళుకొస్తోంది. ఊపిరి ఆడటం లేదు. చివరి ప్రయత్నంగా, అతి బలంగా కత్తిని లాగి మరోపోటు పొడిచాను అతని చేతులమీద. పట్టు కొద్దిగా సడలింది. మరో పోటు, అతని డొక్కల్లో. వదిలేశాడు నన్ను.

మరో పోటు అతని గుండెల్లో పొడిచాను.

పూర్తిగా నన్ను వదిలేశాడు. అతన్ని పక్కకు తోసి లేచి నిలబడ్డాను,

ఆ చీకట్లోనే టార్చిలైటు పడ్డ వైపుకి నడిచి దేవులాడి చేతిలోకి తీసుకున్నాను. దాని అద్దం పగిలిపోయింది.

లైటు ఫోకస్ చేశాను లక్ష్మీపతి మీదకు. గిలగిల కొట్టుకుంటున్నాడు, నీటి నుంచి ఏటి ఒడ్డున పడ్డ చేపలాగా.

అయిదు నిమిషాల తరవాత అతనిలో చలనం ఆగి పోయింది. పెద్దగా నిట్టూర్చాను.

* * *

మరుసటి రోజు సాయంత్రం బోట్‌లో బయలుదేరాము. బోట్‌డ్రైవర్ మా భయంకర అనుభవంవిని ఆశ్చర్యపడ్డాడు.

"ఆ శవాలనేం చేశారు?" అడిగాడతను.

"ఆ భవనంలోనే ఉంచాము. ఇది ప్రభుత్వానికి తెలియ పరచాలి. అదీగాక ఆ విష పురుగును గురించి కూడా పరి శోధన జరపాలి."

"అయినా ఇంతవరకు ఎంతోమంది ఈ దీవిమీద కులా సాగా గడిపారు. కాని ఎవరికీ మీకు కల్గినటువంటి అను భవం కలగలేదు," చెప్పాడు డ్రైవర్.

"ఈ దీవి కొంతమందికి విలాస దీవి. కాని మాకు మాత్రం ఇది భయంకర దీవి. మా విలాస యాత్ర ఈ విధంగా విషాదంగా పరిణమించింది" నిట్టూర్చాడు కృష్ణారావు. ★

తండ్రి, కొడుకుని ప్రాక్టీసు చూస్తూ వుండమని చెప్పి వారంరోజులు బంధువుల యింటికి వెళ్ళి వచ్చాడు.

కొడుకు: నాన్నగారు! మీరు 15 ఏళ్ళనుండి వైద్యం చేస్తున్న సేట్‌గారి కడుపునొప్పిని నేను రెండు రోజుల్లో తగ్గించి పంపించేసాను.

తండ్రి: ఎంత పని చేశావురా! ఈ 15 ఏళ్ళలో మీ అక్క పెళ్ళిచేసి, నిన్ను డాక్టరు చదివించాను. మరి ఇప్పుడు మీ చెల్లిపెళ్లి ఎలారా చేసేది!?

—మిస్. కె. ప్రసన్న, బొంబాయి.

ఈ నెల జోక్స్

—ఎమ్.డి.బాబ్జి

"నన్ను ప్రతి విషయంలోనూ చులకనచేసి మాట్లాడతావేమే! నేను నీ కళ్ళకు వెధవలాగ కనబడుతున్నానా? నేనెవరనుకున్నావ్? నీ భర్తను....మీసాలున్న మొగవాణ్ణి" అని అరిచాడు భర్త, భార్యమీద.

"అబ్బ!....ఏం వీరుడిలా మాట్లాడతారండి మీరు, అందుకే గాబోలు ఇప్పటిదాకా పంపిన ఇరవై తొమ్మిది కథలు తిరిగి వచ్చాయి. మీ ప్రతాపం ఊరివాళ్ళమీద చూపండి, నా మీదగాదు" ఇంకా గట్టిగా అరిచింది భార్య.

* * *

కొత్తగా వచ్చిన ఖైదీతో అన్నాడు పాత ఖైది. "నేను ఈ వూళ్ళో ఒక ఇంట్లో బంగారు లాకెట్ దొంగిలించి

పోలీసులకు పట్టుబడి జైలుపాలయ్యాను. నువ్వు ఏం నేరం చేశావ్?"

"నువ్వు ఆ లాకెట్ గాంధీపురంలో వున్న ఇంట్లో దొంగిలించావా?" కాస్త కుతూహలంగా అడిగాడు కొత్త ఖైదీ.

"అవును! నీకెలా తెల్సు?"

"నువ్వు ఆ లాకెట్ మా ఇంట్లోనే దొంగిలించావ్! పోలీసులకు మా ఇంట్లో దొంగలించినట్లు చెప్పి వుంటావ్ ఫలితంగా నన్ను కూడా జైల్లో తోసారు" అన్నాడు కొత్త ఖైదీ.

"నిన్ను జైల్లో పెట్టటం ఎందుకు?" ఆశ్చర్యపోతూ అడిగాడు పాత ఖైదీ.

"ఆ లాకెట్ నా స్వంతం కాదు. అది నెల క్రితం నేను ఇంకో ఇంట్లో దొంగిలించాను" తాపీగా అన్నాడు కొత్త ఖైదీ.

* * *

ఒక పేటలో ప్రక్క ప్రక్కగా ఉన్న ఇళ్ళల్లో ఇద్దరు డాక్టర్లు క్రొత్తగా ప్రాక్టీసు మొదలుపెట్టారు.

ఒక డాక్టరు తన ఇంటి ముందు ఒక బోర్డు పెట్టించాడు. దాని మీద ఇలా రాయించాడు "ఈ పేటలో ప్రసిద్ధి గాంచిన డాక్టరు."

అప్పుడు రెండో డాక్టరు, "ఈ వూరికే ప్రసిద్ధి గాంచిన డాక్టర్" అంటూ, బోర్డు రాయించి తన ఇంటి ముందు పెట్టాడు.

ఇలా కాదని మొదటి డాక్టరు పాత బోర్డు తీయించి, "ఈ వూరి జమీందారుగారి ఫామిలీ డాక్టర్" అంటూ, ఇంకో బోర్డు రాయించి పెట్టాడు.

రెండవ డాక్టర్ కూడా తన ఇంటి ముందు పాత బోర్డు తీయించి, క్రొత్తగా ఇంకో బోర్డు పెట్టాడు.

దాని మీద ఇలా రాసి ఉంది. "దేవుడి ఫ్యామిలీ డాక్టరు" అని.

*　　　*　　　*

"ఈ సంవత్సరం నీ చదువు కోసం నేను చాలా డబ్బు ఖర్చుపెడుతున్నాను, బాగా చదువుకో" అన్నాడు తండ్రి.

"ఎందుకు నాన్నా అంత డబ్బు ఖర్చు పెట్టడం? నేను తక్కువనే చదువుతాను. నువ్వు తక్కువ ఖర్చుపెట్టు" సలహా ఇచ్చాడు కొడుకు,

*　　　*　　　*

"ఏం వోయ్ రంగయ్యా! చెప్పాచెయ్యకుండా పని లోనికి రావడం మానేశావేం?" తన ఇంట్లో నౌకరుగా వుండే రంగయ్యను అడిగారు సుబ్బయ్యగారు.

"ఈ వూళ్ళోని పిచ్చాసుపత్రిలో నౌకరు వుద్యోగానికి జాయిన్ అయ్యానయ్యా!" అన్నాడు రంగయ్య.

"అక్కడ పిచ్చివాళ్ళతో ఎలా వేగగలవురా?" సుబ్బయ్యగారు ఆశ్చర్యంగా ప్రశ్నించారు.

"ఫరవాలేదులెండి. ఇక్కడి అనుభవం వుంది కదా!"

*　　　*　　　*

చాలాకాలం తరువాత తనకు కల్సిన స్నేహితురాలు

సునీతతో అంది విమల, "సారీ సునీ! నీ పెళ్ళికి రాలేక పోయాను ఏమీ అనుకోకు....అవును! నీ భర్త ఎలా వుంటాడు? అందంగా వుంటాడా??"

"ఏమీ అందంగా వుండడే—ఒక్క మాటలో చెప్పాలంటే అచ్చం రాక్షసుడిలా వుంటాడు" విచారంగా అంది సునీత.

"అలా అయితే ఫర్వాలేదు. నీకు సరయిన జోడీ అన్నమాట!" నవ్వుతూ, అంది విమల,

* * *

"నాన్నా! ఎందుకైనా మంచిది ఈ రోజు అమ్మ ముందు కాస్త 'శాంతం'గా ప్రవర్తించు. లేకపోతే పెద్ద యుద్ధం జరగవచ్చు అమ్మకూ నీకూ" అప్పుడే ఇంటికి వచ్చిన తండ్రితో అన్నాడు కొడుకు.

"ఏం జరిగింది అసలు?" తండ్రి ప్రశ్నించాడు.

"అమ్మ పంపిన కథ ఈసారి కూడా తిరిగి వచ్చింది" జవాబిచ్చాడు కొడుకు.

* * *

"నా భార్య ముందు ఏదైనా విషయం గురించి ఎత్తుతే చాలు ఆ విషయాన్ని పట్టుకుని గంటసేపు వాగుతుంది" చెప్పాడు మూర్తి, రామారావుతో.

"ఇంకా నయం. నా భార్య ముందు ఏ విషయం గురించి కూడా ఎత్తక్కరలేదు. ఉత్తిగానే వాగుతుంది" రామారావు అన్నాడు.

* * *

ఇద్దరు త్రాగుబోతులు పీకలదాకా తాగి సైకిలు మీద వెళుతున్నారు. సైకిలు తొక్కుతున్నవాడు వెనక్కి తిరిగి "ఏం గురూ! అంతా బాగుందా?" అన్నాడు వెనకవాడితో.

"అంతా సరిగానే వుండాది. నువ్వు సైకిల్ సరిగా యెక్కు" అన్నాడు వెనకవాడు.

కాస్త దూరం పోయాక మళ్లా అడిగాడు మొదటివాడు. రెండవవాడు అదే జవాబు చెప్పాడు.

మళ్ళీ కాస్తదూరంపోయాక సైకిలు త్రొక్కేవాడు ఏదో అడగపోయి వెనక్కి తిరిగాడు. ఆశ్చర్యం. వెనక వాడు లేడు. త్రాగుబోతు కంగారుగా సైకిలు వెనక్కి త్రిప్పి, పోనిచ్చాడు. దూరంలో రెండవవాడు నేల మీద పడి వున్నాడు. తలకు దెబ్బ తగిలి రక్తం కారుతూంది.

"ఏమయింది గురూ?" అన్నాడు మొదటివాడు.

నేల మీద పడి వున్న రెండవవాడు తల కొంచెం పైకి ఎత్తి "అంతా సరిగ్గానే వుండాది. నువ్వు సైకిల్ సరిగ్గా త్రొక్కు" అన్నాడు రెండవవాడు.

* * *

క్రిష్ణమూర్తికి పిచ్చి పట్టింది. అతన్ని పిచ్చాసుపత్రిలో జాయిన్ చేశారు.

"డాక్టర్ నాకే విధమయిన పిచ్చి లేదు. వెంటనే నన్ను ఇంటికి పంపేయండి" డాక్టర్‌తో అన్నాడు క్రిష్ణమూర్తి.

"తప్పకుండా ఇంటికి వెళుదురుగాని, కొన్ని రోజులు ఇక్కడ విశ్రాంతి తీసుకోండి" అన్నాడు డాక్టర్.



"ఈ పిచ్చివాళ్ళమధ్య నాకేం తోయటం లేదు. నాకేమయిన చదువుకుంటానికి పుస్తకం ఇవ్వండి" అన్నాడు క్రిష్ణమూర్తి. డాక్టర్ తల వూపి, అక్కడే వున్న టెలిఫోన్ డైరెక్టరీ ఇచ్చాడు.

పావుగంట తరువాత అటుగా వచ్చిన డాక్టర్, క్రిష్ణమూర్తిని అడిగాడు "ఎలా ఉంది?"

"డ్రామా ఇంకా చదవలేదు. యాక్టర్ల పేర్లే చదువుతున్నాను" టెలిఫోన్ డైరెక్టరీ చదువుతున్న క్రిష్ణమూర్తి జవాబిచ్చాడు.

★

కె. రవీంద్రప్రసాద్

సూర్యముఖి చచ్చి పోయిందన్న వార్త, పిడుగులా ఆ పట్టణాణ్ణి ఊపేసింది. నిజం! సూర్యముఖి చచ్చిపోవటమేమిటీ? ఇదే అందర్నీ ఆశ్చర్యంతో తల మునకలయ్యేలా వేధిస్తున్న ప్రశ్న!

సూర్యాముఖిని రాత్రి ఎవరో చంపేశారు?

ఎవరు చంపేశా రన్నది....ప్రశ్న? అసలు ఎందుకు చంపారన్నది మరో ప్రశ్న!

సూర్యముఖి అందమైన — ముప్పై సంవత్సరాల విడో!

లంకంత ఇల్లు, బోలెడంత ఆస్తిగల బంగారు పిచ్చుక!

సూర్యముఖి నొక్కగా నొక్క కూతురు భుజంగరావు గారికి. ఆయనా, ఆయన భార్య మీనాక్షీదేవీ విమాన ప్రమాదంలో మృతులైనారు. సూర్యముఖికి అప్పటికే పెళ్ళయి ఉంది. తల్లి తండ్రుల మరణం ఆమె నేమీ అంతగా బాధ పెట్టలేదు, భర్త ఆదరణతో.

కానీ ఆమె ఇరవై ఐదో సంవత్సరాన ....'హంటింగ్'కు పోయి - సూర్యముఖి భర్త రాజరాజన్ పులివాత పట్టంతో సూర్యముఖి వంటరిదై పోయింది. కానీ - ఆమె తెలివి వలన, ఆమె వ్యవహార దక్షతవలన - ఆస్తి చెడగొట్టకుండా - జాగ్రత్తగా పలువురిలో నడుచుకొంటూ 'సూర్యముఖి' సూర్యుడు లాంటిది, నిప్పులాంటిది అనే పేరు తెచ్చుకొంది.

ఆ పట్టణంలో సూర్యముఖి - పెద్ద ధనవంతుల్లో ఒకతె. ఆమె ఎన్నో శరణాలయాలకు,ఎన్నో ఆశ్రమాలకూ, ఎన్నో సంఘ కార్యక్రమాలకూ, మహిళామండలులకు ఎంతో గొప్ప విరాళాలు ఇచ్చింది. ఆమె పేరు పట్టణ ప్రముఖుల్లో మూడోదో, నాల్గోదో. పెద్దవారు ఎవరొచ్చినా సూర్యముఖి తప్పక తమ ఇంట్లో బస ఏర్పాటు చేస్తుంది.....

ఆమెలో మరో గొప్ప సుగుణం: బీదలకు అన్నదానం- ప్రతి శనివారం "సూర్యముఖి" నిలయంలో అన్నదానం చేస్తుంది.

ఇన్ని విధాలుగా, ఇన్ని రకాలుగా ప్రజల, పెద్దల మన్నన లను దోచుకుంది శ్రీమతి సూర్యముఖి.

సూర్యముఖి మరణం పట్టణమంతా వ్యాపించింది. అందరూ - ఎందరో ఆమె భవనం చుట్టూచేరారు. గుంపులు గుంపులుగా మాట్లాడుకొంటున్నారు. పోలీసులు ఆ గుంపు లను సర్దుతున్నారు. ఆపుతున్నారు.

ఎందుకు చచ్చిపోయిందో అర్థం కావటం లేదు—

ఆత్మహత్య? లేక ఎవరయినా హత్య చేశారా?

అంత దయాత్మురాలు, కరుణాత్మురాలు అయిన సూర్య ముఖిని హత్య చేయటానికి ఎవరికి చేతులు వస్తాయి?

పోలీస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ - శవాన్ని పరికించటంలో నిమగ్నమై పోయాడు. తదితరులంతా వారి వారి పనుల్లో నిమగ్నమైపోయారు.

సూర్యముఖి చాలా అందంగా ఉంటుంది. ఆమె ఎర్రగా ఉంటుంది. భర్త పోయిన తర్వాత సంవత్సరం దాకా ఆమె చాలా వ్యాకులతో ఉండి చిక్కిపోయింది. ఆ తర్వాత బంధు వుల, స్నేహితుల, ఆప్తుల ఆదరణతో అనేక కార్యక్రమాలు చేపట్టి భర్త పోయిన సంగతి మరచిపోయి - క్రమంగా సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ కార్యక్రమాల్లో మునిగి పోయింది. ఆ తర్వాత ఆమెలో క్రమేణా కాంతీ, అందం ఇంకా ఇనుమడించసాగాయి. శరీరం ఇంకా రంగు తిరి గింది. లావు వచ్చింది. ముఖంలో ఆకర్షణ ఎక్కువైంది.

ఇప్పుడు ఆమె పడివున్న తీరు అచ్చటి వారందర్నీ

దిగ్భ్రాంతులను చేసింది. ఆమె నైట్ గౌనులో ఉన్నది. లోపల ఎటువంటి అచ్ఛాదనా లేదు. బ్రాగాని, లోపల లంగా గానీ లేదు. ఆ నైట్ గౌన్ తొడలదాకా లేచిపోయి ఉంది. ఆమె వక్షోజాలమీదా ఆ గౌను తొలగిపోయి వున్నది. ఆమె యూఫోమ్ బెడ్‌మీద అడ్డంగా పడి ఉన్నది. చేతులు అస్త వ్యస్తంగా ఉన్నాయి. ఎటువంటి గాయాలూ లేవు....ఎటు వంటి కత్తిపోట్లూ, పిస్తోలుపోట్లూ లేవు....

ఇన్‌స్పెక్టర్ కృష్ణ చుట్టూ కలయచూశాడు....ఆమె గది అది—అధునాతనంగా ఉన్నది. అది ఎయిర్ కండిషన్ రూం. ఎటాచ్‌డ్ బాత్‌రూం. లోపల వో రాక్‌లో అనేక వేదాంత గ్రంథాలూ - భగవంతుని సంబంధించిన పుస్త కాలూ ఉన్నాయి. మరో బీరువా ఉంది. దానికి తాళం వేసి ఉంది....మరో రాక్ ఉంది....దానిలో ఆమె చీరలు - బ్లాస రీలు - లంగాలూ ఉన్నాయి ఇస్త్రీచేసి. చుట్టూ కలయ జూశాడు....ఏమీ కన్పడలేదు....ఇవి తప్ప.

పోలీసు డాక్టరు - శవాన్ని మార్టమ్‌కు తీసుకు రమ్మని చెప్పి పోయి జీపు ఎక్కి కూర్చున్నాడు....బయట జనం కోలాహలంగా ఉన్నారు....శవం తీసుకు పోబడ్డది....

కృష్ణ ఆలోచిస్తున్నాడు....

ప్రక్కన వున్న పురుషోత్తంను అడిగాడు....

ఇంట్లో ఎవరెవరు వుంటారని....

పురుషోత్తం వృద్ధుడు - తోటమాలి. పురుషోత్తం చెప్ప సాగాడు.

"మొత్తం ఈ ఇంట్లో వుండేది ఆరుగురం సార్! నేను ...తోటపని చేస్తుంటాను....ఆబాబు....శేఖర్‌గారు... ఆయన ఎకౌంట్లు చూస్తుంటారు - నాయర్....వంటపని

చేస్తుంటాడు. లచ్చమ్మ ఇంటిపనీ, అమ్మగారి బట్టలు ఉతకటం ఇస్త్రీ చేయటం చేస్తుంటుంది. రంగనాధం బాబుగారు బయట పన్లు చూస్తుంటారు....రంగడు....వాడు అందరికీ సహాయంగా ఉంటానికి పెట్టుకొన్నారు బాబూ...." అని అందర్నీ చూపించాడు.

కృష్ణ అందర్నీ పరికించాడు. శేఖర్‌కు ముప్పై సంవత్సరాలుంటాయి. స్ఫురద్రూపి - అతని కోటేరు ముక్కు అతన్ని నిశిత జ్ఞానం గలవాడిగా చూపుతున్నది. ఆ బంగళాకు - ఆమె ఆస్తికి తగ్గ అన్ని వ్యవహారాలు అతను చూసుకొంటాడు.. అతన్ని చూడగానే కృష్ణకు మంచి భావం కలిగింది. కానీ భావాలతో పనిలేదు పోలీసు ఆఫీసర్లకు. అందుకే....ప్రశ్నించసాగాడు.

"మీరు ఎంత కాలంగా ఇక్కడ పనిచేస్తున్నారు...."

"పది సంవత్సరాలుగా...."

"మీరు ఎకౌంట్స్, వ్యవహారాలు చూస్తుంటారనుకొంటాను...."

"అవును...."

"సూర్యముఖిగారి మరణంపై మీ అభిప్రాయం...."

"నాకూ అదే వింతగా ఉంది. ఆమె ఎందుకు, ఎలా మరణించిందో...."

"ఇంకో అరగంటలో ఆమె మరణం ఎలా జరిగిందో తెలుస్తుంది....నేను అందర్నీ కొన్ని ప్రశ్నలు అడగాలనుకొంటున్నాను...." అని కృష్ణ "నాయర్" అన్నాడు....

"చిత్తం...." నాయర్ ముందుకొచ్చాడు.

"రాత్రి అమ్మగారు ఆహారం తీసుకొన్నారా?"

"తీసుకొన్నారు బాబూ - రోజూ మాదిరిగానే పాలూ అన్నం తీసుకొని పైకి పోయారు...."

"తర్వాత నీవు ఆమెను చూడలేదుగా-"

"లేదుబాబూ-" అన్నాడు నాయర్.

"మరెప్పుడు చూశావ్?"

"లచ్చమ్మ ప్రొద్దున్నె అమ్మగార్ని లేపటానికి పైకి వెళ్ళింది బాబూ! అది వోలమ్మో అని పెద్దగా అరిచేసరికి అందరం పైకి పరిగిట్టాం బాబూ!" అన్నాడు.

"లచ్చమ్మా! నువ్వు చూసింది చెప్పు!"

"ప్రొద్దున్నె అమ్మగార్ని లేపటానికి పైకి వెళ్ళాను బాబూ! సాధారణంగా అమ్మగారు గది తలుపు వేసుకోరు- తలుపు తోశాను....తోసేసరికి అమ్మగారు ఇలా ఉండి పోయింది...." అని బావురుమంది....

"రంగనాధంగారూ! మీరూ!" అన్నాడు కృష్ణ.

రంగనాధంగారు భారంగా "ఏం చెప్పమంటారండీ! యీ ఘోరం నా కిప్పుడే తెల్సింది. ధర్మాత్మురాలు - న్యాయంగల తల్లి! ఆ తల్లిని గురించి చెడుగా ఏం మాట్లాడుకొన్నా మహా పాపం చుట్టుకొంటుంది. అందర్నీ కన్న బిడ్డల్లా చూస్తుంది. ఆ తల్లి చచ్చి పడి ఉందంటే నాకెంత దుఃఖంగా ఉందో చెప్పలేక పోతున్నాను బాబుగారూ!" అంటూ నోట్లో గుడ్డ పెట్టుకొని విలపించసాగాడు.

రంగడికి పదిహేనేళ్ళుంటాయి. వాడూ అక్కడ నుంచొని అచ్చట వాతావరణ మంతా వింతగా చూస్తున్నాడు. వాడి అమాయకపు చూపులూ - వాడి దైన్యవదనమూ చూసి ఇన్ స్పెక్టర్ కృష్ణ ఏం మాట్లాడకుండా బయటకు వెళ్ళిపోయాడు.

2

బయట జనం కోలాహలంగా ఉన్నారు. కృష్ణ బయటకు వచ్చేసరికి అందరూ అతని చుట్టూ మూగారు.

"సూర్యముఖి అమ్మగార్ని ఎవరు చంపారు? చెప్పండి సార్?"

"ఆ తల్లిని చంపిన వాడికి పుట్టగతులుంటాయా?"

"మీరా హంతకుడి ఆచూకీ తీయాలి...."

ఇలా ఎవరికి తోచింది వారు - మాట్లాడసాగారు. కృష్ణ అందర్నీ పరికించి-"చూడండీ! ఇది హత్యో, ఆత్మహత్యో చెప్పలేకుండా వున్నాను. హతురాలి శవం మీద కత్తిపోట్లు కానీ, పిస్తోలు పోట్లు గానీ ఏమీ లేవు. అయితే ఇది హత్యా-ఆత్మ హత్యా అనేది పోస్టుమార్టమ్‌లో తెలుస్తుంది. ఏది ఏమైనప్పటికీ సూర్యముఖిగారు మరణానికి బాధ్యు లెవరో తప్పక గుర్తిస్తాను-మీరందరూ మీ ఇళ్ళకు పొండి"....అని చెప్పి....'సార్జంట్'తో "లోపల ఆ ఆరుగుర్నీ కదలకుండా చూడు—" అని అక్కడ బందోబస్తు చేసి వెళ్ళిపోయాడు.

కృష్ణ ఆలోచిస్తున్నాడు?

సూర్యముఖి ఎందుకు చచ్చిపోయినట్లు?

ఆమెకు చావాల్సిన అవసర మేముందీ?

అన్నీ వున్నాయి - ఆస్తి ఉంది - ధనం ఉంది - అలంకారం ఉంది? కానీ లేనిదేముందీ?

భర్త?

అయితే ఆమె అందాన్ని దోచుకోవటానికీ - ఆ ఆస్తి అంతటినీ చేజిక్కించుకోవటానికి ఎవరికి ఎక్కువ అవకాశ ముందీ?

ఆమెకు ఇతరత్రా బంధువులూ, చుట్టాలూ లేరు. ఆమె బంధువులూ, చుట్టాలు శ్రేయోభిలాషులు అంతా సంఘమే. అందుకే సంఘానికే తన యావదాస్తినీ శరణాలయాలుగా, విరాళాలుగా, అన్నదానాలుగా సమర్పిస్తున్నది.

ఇంతటి మహోన్నత వ్యక్తి ఎందుకు చచ్చిపోయిందీ లేదా ఎందుకు చంపబడ్డదీ?

కృష్ణ విపరీతంగా ఆలోచించ సాగాడు.

కృష్ణ ఇన్‌స్పెక్టరే కాకుండా సైకాలజీ బాగా అర్థం చేసు కొంటాడు. సునిశితమైన అబ్జర్వేషన్ గలిగినవాడు—

వొక్కసారి మనస్సులో అందర్నీ - ఆ ఇంట్లో వున్న అందర్నీ ఎనలైజ్ చేయసాగాడు.

పురుషోత్తం - తోటమాలి - వృద్ధుడు. అతను ఆ ఇంట్లో చాలా కాలంగా ఉంటున్నాడు. అంటె సూర్యముఖి తల్లి దండ్రులు వున్నప్పటి నుండి ఉంటున్నాడు. అతనికి సూర్య ముఖి అంటె పుత్రవాత్సల్యం తప్ప మరొకటి లేదు-అతనికి సూర్యముఖిని హత్య చేయాల్సిన పనిలేదు. హత్యచేసినా— ఆస్తిని చేజిక్కించుకొనే తాహతూ, దమ్ముగూడా అతనికి లేవు.

ఇక-శేఖర్, ముప్పై సంవత్సరాలున్నాయి. ఆస్తి వ్యవ హారాలు చూస్తున్నాడు. అతను ఆస్తి వ్యవహారాలు చూట్టంలో పేచీలుగానీ, మరేమీగానీ ఇంతవరకూ విన్నట్లు లేదు—అతను ఈ హత్యను చేయాల్సిన అవసరమేమిటా? ఏదయినా లెక్కల్లో పెద్ద మొత్తాలు గల్లంతు చేసి - అవి అడిగే సరికి సూర్యముఖిని గల్లంతు చేశాడా? ఏమో!

నాయర్ - వంట పని వాడి పని. వాడు స్వతహాగా మంచివాడే. నాయర్ల కెప్పుడూ ఇట్లాంటివి అంటే భయమని విన్నాడు తను. నాయర్ ఏదయినా పాయిజన్ ఇచ్చిగానీ - లేదా మరేవిధంగానైనా గానీ సూర్యముఖిని అంతం చేయ లేదుగదా! చేస్తే వీడికి కలిగే లాభమేమిటా?—

లచ్చమ్మ - ఇంటిపనీ, సూర్యముఖి పనీ ఈమె చేస్తుం

టుంది. లచ్చమ్మ బీదతనం నుంచి వచ్చిన యువతి.అయితే సూర్యముఖికి తోడుగా - నీడగా ఉంటుంది. దానికి సూర్య ముఖి అంటే ఇష్టం తప్ప మరొకటి లేనట్లు కన్పడుతోంది- సాధారణంగా మొగుడులేని వంటరి స్త్రీని చూస్తే మరోస్త్రీకి జాలి ప్రేమా తప్ప ద్వేషం ఉండదేమో! అనుకొన్నాడు కృష్ణ.

రంగనాధంగారు! ఆయన మేనేజర్ లాంటివాడు. అన్ని వ్యవహారాలూ - అన్నీ అతనే చూసుకొంటుంటాడు. అత నికి ఇంటా బయటా గూడా మంచి పేరే ఉన్నది. ఆయనకీ పెద్ద సంతాన మున్నది - పెళ్ళాం బిడ్డలు గలవాడు - ఎంతో కాలంగా అక్కడే పని చేస్తున్నవాడు....అతనెందుకు ఈ హత్యకు....

ఇక రంగడు - వాడు చిన్న వెధవ - వాడికి ఏమీ తెలి యదు. వాడ్ని గురించి ఆలోచించటంకూడా దండుగే.... అయినా చూద్దాం పోస్టుమార్టం రిపోర్టు ఏమని వస్తుందో!

అని ఆలోచిస్తుండగా స్టేషన్ వచ్చింది. జీపులోంచి దిగి స్టేషన్‌లోకి వెళ్ళి - ఫోను చేశాడు. డాక్టర్ చెప్పింది విని వొక్కసారి-'ఈజ్ ఇట్!' అంటూ-ఎగిరి కూర్చున్నాడు.

3

వెంటనే కానిస్టేబుల్‌ని పంపి లచ్చమ్మను స్టేషనుకు లాక్కు రమ్మన్నాడు. కానిస్టేబుల్ జీపుమీద వెళ్ళి లచ్చ మ్మను లాక్కొచ్చాడు జీపులో. ఆ గదిలో వేసి తాళం వేయండి అన్నాడు.

లచ్చమ్మ లబో దిబో మని ఏడుస్తూంది. తనకేం నేరం తెలియదంటుంది. నేనేం పాపం చేయలేదంటూంది.... ఊరికే ఏడుస్తూంది.

వో అరగంటాగి - లచ్చమ్మను తన గదిలోకి పిల్పించాడు కృష్ణ. లాఠీ పట్టుకొని "చెప్పు! నీకు తెలిసిందంతా చెప్పు...." అని పిర్రలమీద వొక్క దెబ్బ కొట్టాడు.

లచ్చమ్మ బేర్‌మని ఏడ్చేస్తూ - క్రిందపడి కృష్ణ పాదాలు పట్టుకొని 'నాకేం తెలియదు బాబూ! అమ్మగార్ని నేను చంపలేదు బాబూ!' అని ఏడ్చేయసాగింది.

"నువ్వు అమ్మగార్ని చంపారని ఎవరన్నారు - అమ్మగారి గురించి నీకు తెలిసిందంతా చెప్పు...."

"అమ్మగారు చాలా మంచిది...."

"ఇంకా—"

"దాన ధర్మాలు చేస్తది - చాలా మంచి మనస్సు—"

"బ్రాందీ - విస్కీ త్రాగుతుందా?"

"త్రాగదు-"

"సిగిరెట్లు త్రాగుతుందా?"

"త్రాగదు-"

"సెక్స్ అలవాటు...."

"అంటె ఏమిటి బాబూ—" అమాయకంగా అడిగింది లచ్చమ్మ.

మోటుగా చెప్పాడు కృష్ణ.

వొక్కసారి తల వంచుకొంది లచ్చమ్మ.

"చెప్పు....లేకపోతే బొక్కలోకి తోస్తా—" అంటూ భయపెట్టాడు కృష్ణ.

"లేదు- బాబూ-"

"నిజం చెప్పు-" అంటూ మరొకటి వేసాడు కర్రతో.

"మొగాళ్ళతో లేదు బాబూ!" అంటూ భోరున ఏడవసాగింది....

"చెప్పు పర్వాలేదు- నిన్ను వదిలేస్తాను...." అన్నాడు కృష్ణ.

"ఆయమ్మ నన్ను రాత్రుళ్ళపూట పిలుస్తారండీ...."

"ఊ...."

"మరండీ.... అప్పుడేమో నండీ.... ఆయమ్మా నేనూ పడుకుంటా మండీ...."

"ఊ-" అంటూ మరో దెబ్బ వేశాడు....

దాంతో నిజం కక్కింది." "ఆయమ్మ భర్త పోగా— చాలా దిగులు పడ్డారండీ. ఆయమ్మ చదువుకున్నది కదండి- విదేశాలనుండి....మొగాళ్ళకుండే లాంటిది తెప్పించారండి. అది నా మొలకు కట్టారండీ - తనూ - నేనూ - మొగుడూ పెళ్ళాల్లా ఆడుకుంటామండీ - అదే ఆ యమ్మకు తృప్తండీ- ఇంకే పురుషుడు జోలీ పోలేదండీ - సత్తె ప్రెమాణీక మండీ!" అని చెప్పేసింది.

క్లూ దొరికింది కృష్ణకు.

"అక్కడినుండి తెప్పించినది ఎక్కడుంది-?"

"మా యమ్మగారి గదిలో గుడ్డలక్రింద ఉంటుందండీ."

వెంటనే లచ్చమ్మను తీసుకొని సూర్యముఖి ఇంటివైపు దారి తీశాడు కృష్ణ జీపులో.

4

"ఎక్కడా చూపించు...."

లచ్చమ్మ ఆ వస్తువుకై బీరువాలు అవీ ఇవీ వెదికింది. దొరకలేదు. బేలగా ముఖంపెట్టి దొరకలేదండీ....ఆ యమ్మ ఎక్కడ పెట్టిందో.... అంది....

లచ్చమ్మ సిన్సియర్‌గానే చెప్తుందని భావించాడు కృష్ణ. లచ్చమ్మతో తిరిగి స్టేషన్‌కు వెళ్ళి ఫోటోగ్రాఫర్‌కు

ఫోన్ చేశాడు. ఫోటోగ్రాఫర్ వెంటనే స్టేషన్‌కొచ్చి ఫోటోలు అందజేశాడు.... అంతే కృష్ణకు మొఖం వొక్కసారి వెలిగిపోయింది. హంతకుడ్ని ఈజీగా కనిపెట్టవచ్చు.

వెంటనే లచ్చమ్మని అడిగాడు.... "మీ అమ్మగారితో రాత్రి వున్నావా?"

అది సిగ్గుపడుతూ "ఊ-" అంది.

"తిరిగి ఎప్పుడు వెళ్ళిపోయావ్?"

"తొమ్మిది దాటేక మా ఇంటికి వెళ్ళిపోయాను దొరా....లేక పోతే మా ఆయన నా మక్కెలు విరగ్గొట్టేస్తాడు...." అంది.

ఇన్‌స్పెక్టర్ బుర్ర చురుగ్గా పనిచేయసాగింది.

డాక్టరు రిపోర్టును బట్టీ, ఫోటోగ్రాపులను బట్టీ తేలిందేమంటే—

ఆమె కృత్రిమ పురుషావయవమునకు ఎవరో పాయిజన్ రాశారు. దానివలన ఆమె మరణం సంభవించింది అని....

అయితే ఎవరు ఆ పురుషావయవమునకు పాయిజన్ రాశారు? ఇది అంతు తెలియని ప్రశ్నే అయినా అంతుగల ప్రశ్న!

అయితే మరో విషయం! ఆ పురుషావయవం గల్లంతు అయ్యింది. అది అక్కడ లేదు అంటే విషంపూసిన దాన్ని గల్లంతు చేసి ఉండాలి.

హంతకుడు చాలా తెలివిగా ఈ అవకాశం ఉపయోగించుకొన్నాడు. అయితే హతురాలికీ, హంతకుడికీ ఇంతకు ముందు ఈ విషయమై రాద్ధాంతం జరిగి ఉండాలి. ఆమె వొప్పుకోకపోయి వుండవచ్చు. దాంతో తన కసిని ఈ విధంగా తీర్చుకొని ఉండవచ్చు!

ఫోటోలు అతిజాగ్రత్తగా పరిశీలించాడు....

ఆ ఎయిర్ కండిషన్ రూంలో ఆ తివాచీమీద అందరి పాద ముద్రలూ స్పష్టంగా పడ్డాయి——

ప్రొద్దున్నే సూర్యముఖి మరణం లచ్చమ్మద్వారా తెలియగానే అంతా పరిగెత్తుకొచ్చారు.... అప్పుడు అందరి పాద ముద్రలూ అక్కడున్నాయి.

కృష్ణ బుర్ర చురుగ్గా పనిచేయ సాగింది....

అంతే!

అతని బుర్రలో బల్బు వెలిగింది.

'హంతకుడు దొరికాడు' అని పెద్దగా అరిచి పరిగెట్టి జీపెక్కాడు.

5

"సారీ! రంగనాధంగారూ!" అంటూ రంగనాధంగార్కి బేడీలు తగిలించాడు కృష్ణ.

రంగనాధం మొఖం పాలిపోయింది.

"హంతకుడు రంగనాధమా?" అని అందరూ వొక్కసారిగా అడిగారు.

కృష్ణ "అవును .... మీరు ఎలా హంతకులో చెప్పండి రంగనాధంగారూ!" అని రంగనాధాన్ని పొడిచాడు లాఠీ కర్రతో.

రంగనాధం తల వంచుకొని "నా ఆశే.... నాలో ఈ దుర్బుద్ధి పుట్టించింది. వోరోజు యాదృచ్ఛికంగా రాత్రిపూట మేడ మీదకు వెళ్ళాను. లచ్చమ్మ, సూర్యముఖిగారూ సంభోగానందం పొందటం గమనించాను. వారికున్న కృతిమ పురుషావయవం గూడా గుర్తించాను. అదయిన వారంకు సూర్యముఖిగార్ని కలుసుకొని మా అబ్బాయిని ఇక్కడ పనికి పెట్టుకోమని కోరాను. మావాడు యస్.యస్.సి. తప్పి

జులాయిగా తిరుగుతున్నాడు. ముప్పై ఏళ్ళు వాడికి. వాడికి ఎలాగయినా సూర్యముఖిగార్ని కలిపి ఈ ఆస్తిని మెల్లిగా గుంజాలని నా ప్రయత్నం. అయితే సూర్యముఖి నిప్పులాంటిది. ఇప్పుడు మనకేం స్టాపు అక్కర్లేదే అంది. 'కాదు మీ పర్సనల్‌కు' అన్నాను.

దాంతో ఆమె మండిపడి "నా విషయాలు నేను చూసుకొంటాను పిచ్చి పిచ్చి వేషాలు వేయక పడి ఉండండి లేదా ఉద్యోగంలో నుండి తీసివేయాల్సి ఉంటుంది" అని చెప్పి వెళ్ళిపోయారు.

ఇది జరిగిన తర్వాత నేను మామూలుగానే ఉంటూ వచ్చాను. కానీ సూర్యముఖిచేత అవమానం సహించలేక పోయాను....అందుకే....నిన్నటి రాత్రి ఆ పురుషావయవానికి పాయిజన్ వ్రాశాను...." అంటూ రంగనాధంగారు తల వంచుకొన్నాడు.

కృష్ణ నిట్టూర్పు విడిచి 'పదండి....' అని బయలుదేరదీశాడు....

"అయితే ఇంతకీ మీరు రంగనాధంగారే హంతకులని ఎలా కనిపెట్టారో తెల్సుకోవచ్చా ఇన్‌స్పెక్టర్...." శేఖర్ కుతూహలంగా అడిగాడు.

"ఫోటోల రికార్డులు పరిశీలించాను. సూర్యముఖిగారి రూం ఎయిర్ కండిషన్ అవటం వలన తివాసీలు గదిలో ఉండడం వలన అందరి పాద ముద్రలూ పడ్డాయి. అయితే వీరిలో ఎవరు హంతకులని గుర్తించటం? ఎవరి పాద ముద్రలు ఎక్కువో చూశాను.... ఎక్కువ బూటు పాదాలు కన్పడుతున్నాయి.

అందరూ రోజూ సూర్యముఖిగారి రూంకు పోరు. లచ్చమ్మ వొక్కతే పోతుంది. అయితే ఈ రోజు అందరి పాదాల ముద్రలూ ఉన్నాయి. ఆమె మరణించినదని తెలుసు కొన్న తర్వాత వారందరూ అక్కడకు వచ్చారు కాబట్టి వారి ముద్రలున్నాయి.

కానీ రాత్రి ఆ కృత్రిమ అవయవం తీసుకుపోవటానికీ, దానికి పాయిజన్ రాయటానికీ ఆ గదిలోకి ఎక్కువగా తిరి గిన ఆ బూట్ల అడుగులు ఎక్కువ కన్పించాయి అతనే హంతకుడని నేను నిర్ధారణకొచ్చాను. మీలో ఎవరూ బూట్లు వాడరు, రంగనాథంగారు తప్ప. అదీకాక, ఆయన యీ రోజు ఉదయం మేము వచ్చేదాక సూర్యముఖిగారి గదిలోకి వెళ్ళనే లేదు. అయినా ఆయన బూటు ముద్రలు ఆ గదిలో చాలా దొరికాయి. అవే ఆయనను హంతకుడిగా నిరూపిం చాయి" అని రంగనాథంగార్ని జీపులోకి ఎక్కించాడు ఇన్ స్పెక్టర్ కృష్ణ. ★

క్రొత్తగా పెళ్ళయిన జంట ఒక రెస్టారెంటుకు వెళ్లారు

భర్త: ఓ డార్లింగ్, మన మిద్దరమూ ఒకటే, మన నెవ్వరూ విడిదియ్యలేరు. నీ మనసు, నా మనసు కలిసి పోయాయి. మన మిద్దరము ఒకటికిందే లెక్క...

భార్య: నాకు తెలుసండి. కాని, మనిద్దరికి రెండు మీల్సు ఆర్డరివ్వండి. నాకు చాలా ఆకలి వేస్తూంది.

—మామిడి సత్యనారాయణమూర్తి, బరంపురం.

(బహుమతి రు. 50/- లు నగదు)

1

అనుపమ దగ్గరో అందమైన ఆల్సేషియన్ కుక్కపిల్ల ఉంది. చుట్టపు చూపుగా వచ్చిన విమల కన్ను దానిపై పడింది. వూరు వెళ్ళిన తర్వాత "నీ కుక్కపిల్ల నాకు నచ్చింది అమ్ముతావా? ధర ఎంత?" అని లెటర్ వ్రాసింది.

"ధర వంద రూపాయలు" అని తిరుగు జవాబు వ్రాసింది అనుపమ.

"నీ వడిగిన వంద రూపాయలు పంపిస్తున్నాను. డబ్బిచ్చిన మనిషికి కుక్కపిల్ల నివ్వు" అని లెటర్ వ్రాసి, ఒక మనిషికి డబ్బిచ్చి పంపింది విమల.

అయితే అనుపమ కుక్కపిల్లను అమ్మటానికి నిరాకరించింది.

దానిపై విమల కోర్టు కెక్కింది.

మీరేమని తీర్పు ఇస్తారు?

2

ప్రముఖ చిత్ర నిర్మాత ఒకరు తన చిత్రంలో నటించేందుకు బాల తార (వయస్సు 9 సం॥లు) ప్రమీలతో కంట్రాక్టు కుదుర్చుకున్నాడు. అవే షరతులతో ప్రమీల తండ్రితో కూడా ఒప్పందం కుదుర్చుకున్నాడు నిర్మాత.

అయితే నిర్మాత కారణాంతరాలవల్ల ఒప్పందం నెరవేర్చలేకపోయాడు. ప్రమీల ఆమె తండ్రి నష్టపరిహారానికై నిర్మాతపై దావా వేశారు.

ఒప్పందం ప్రకారం ప్రవర్తించక తమకు నష్టం కలిగించినందువల్ల పరిహారం ఇప్పించమని, వారు వాదించారు. మీరే జడ్జిగా ఉంటే మీ తీర్పెలా ఉంటుంది?

3

అనిత 16 సంవత్సరాల వయస్సులో ప్రతిమ వద్ద ప్రామిసరీ నోటు వ్రాసి, వెయ్యి రూపాయలు అప్పు తీసుకుంది. తన 19వ ఏట మైనారిటీ తీరగానే పాత ప్రామిసరీ నోటు తీసుకొని, మరో క్రొత్త ప్రామిసరీ నోటు వ్రాసి ఇచ్చింది.

కాని తర్వాతేం బుద్ధి పుట్టిందో ఆ డబ్బు ఇవ్వటానికి తిరస్కరించింది. దానితో తప్పనిసరై ప్రతిమ కోర్టుకెక్కింది రెండో నోటు ఆధారంతో.

తను మైనరుగా వున్న సమయంలో తీసుకున్న అప్పుకు బాధ్యత వహించవలసిన అవసరం లేదని, అనిత వాదించింది.

కాని మైనారిటీ తీరిన తర్వాత రెండో నోటు వ్రాయబడింది కనుక, ఆ నోటు ప్రకారం డబ్బు అనిత తనకు

చెల్లించాలి, అని ప్రతిమ వాదం.

మరి మీ తీర్పు ఏమిటి?

* * *

[పై మూడు కేసులకు మీ తీర్పు ఏమిటో వివరంగా ఒక పోస్టుకార్డు సైజు తెల్లకాగితంపై వ్రాసి, యీ నెల 20 వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. హోం. డె. సభ్యులు తమ చిరునామాతోపాటు సభ్యత్వము నెంబరు వ్రాస్తే చాలు. ఇతరులు తమ జవాబుతో 30 పైసలు పోస్టలు స్టాంపులు జత పరచాలి. సరియైన తీర్పు చెప్పిన పాఠకుల పేర్లు జూన్ '76 నెల సంచికలో ప్రకటిస్తూ, అత్యుత్తమ తీర్పు నిచ్చిన ఇద్దరు పాఠక న్యాయనిర్ణేతలకు ఒక్కొక్కరికి రు. 25/—లు చొప్పున నగదు బహుమతి పంపగలము. —ఎడిటర్.]

ఫిబ్రవరి '76 నెల మీ తీర్పు?

(1) రాముకు నష్టపరిహారం రాదు!

ఆట మధ్యలో బంతి వచ్చి తగలడమనే రిస్కు క్రికెట్ మాచ్‌లో ఎప్పుడూ ఉంది. అటువంటి ఆటకువెళ్ళిన ప్రేక్షకులు ఆ రిస్కుకు సిద్ధపడినట్లుగానే భావించబడుతుంది. రాముకు నష్టపరిహారం రాదు.

(2) పరశురామ్ నష్టపరిహారం చెల్లించాలి!

త్రాగి వున్న పరిస్థితిలో కారు డ్రైవ్ చేయకూడదు. అలా చేయటం పరశురామ్ నిర్లక్ష్యం. తన నిర్లక్ష్యంవల్ల మరో వ్యక్తికి నష్టం కలిగితే ఆ నష్టాన్ని నిర్లక్ష్యం చేసిన వ్యక్తి భరించాలి.

(3) చటర్జీ నష్టపరిహారం చెల్లించి తీరాలి!

ప్రమాదకరమైన జంతువులను ఉంచుకొన్న వ్యక్తి, ఆ జంతువు ఇతరులకు ఏవిధమైన హాని చేయకుండా కావల్సిన అన్ని జాగ్రత్తలూ తీసుకోవలసి ఉంది. కనుక చటర్జీ నష్టపరిహారం తప్పక చెల్లించాలి.

*　　　*　　　*

పై విధంగా అత్యుత్తమ తీర్పు నిచ్చిన యీ క్రింది ఇరువురు పాఠక న్యాయ నిర్ణేతలకు ఒక్కొక్కరికి రు. 25/—లు చొప్పున నగదు బహుమతి త్వరలో అంద జేయబడుతుంది.

(1) శ్రీ కె. ఎస్. ప్రసాద్, సి. ఐ. ఆఫ్ పోలీస్, కొవ్వూరు, నెల్లూరు జిల్లా.

(2) శ్రీ యం. శంకరరెడ్డి, ప్రొప్రయిటర్ రమాదేవి ఏజెన్సీస్&సైకిల్ షాప్, మెయిన్ రోడ్, బెల్లంపల్లి, ఆదిలా బాదు జిల్లా.

సరియైన తీర్పు చెప్పిన ఇతర పాఠకులు :

1. కె. లక్ష్మీరాజం, జగిత్యాల. 2. కురుమద్దాలి విజయ లక్ష్మి, విజయవాడ. 3. కళాలక్ష్మి, హైద్రాబాదు. 4. కోనె నాగవెంకట ఆంజనేయులు, విశాఖపట్నం. 5. బి.యర్రయ్య సునాబేడా. 6. వై. చంద్రశేఖర్, నిజామాబాద్. 7. రాం రాజు ప్రభాకరరావు, గుండెపురి. 8. ఏ. విక్రమసేనరావు, హుజురాబాదు. 9. కె. చందర్‌రావ్, హైదరాబాద్. 10. ఎల్. రామగోపాల్, నెల్లూరు.

11. కాళంగి ఇందుమతి, గుంటూరు. 12. కటారి శ్రీ రాములు, నూజివీడు. 13. అల్లూరి సుశీలాదేవి, డొంక రాయి. 14. ఎస్.వి.ఎస్. రామలింగేశ్వరరావు, హైదరా బాదు. 15. పి. గోపాలరావు, నెల్లూరు. 16. యం.ఏ.

గోపాల్, కూచనపల్లి. 17. రావు కె. జక్కపల్లి, గుంటూరు. 18. ఎన్. సత్యానంద్, బెల్లంపల్లి. 19. సాధనమూర్తి. బొంబాయి. 20. జంపాల కిషోర్, మారాంపూడి.

21. పోకా తిరుపాలు, పూనా. 22. పి. మాలతి, ఆదిలాబాద్. 23. జి. వి. రమణ, గుంటూరు. 24. కె. మోహనరావు, పింఁడ్రాయి. 25. ఎన్. వాసుదేవాచార్, బెంగళూరు. 26. పి. ఆండాళ్ళు, ముషీరాబాద్. 27. జి. పి. రాజు, నెల్లూరు. 28. సముద్రాల ఓంకార్, వరంగల్. 29. టి. ఎస్. రావు, బండముండ. 30. వి. గోపాలశర్మ, వరంగల్.

31. డి. శ్యామలాదేవి, విశాఖపట్టణం. 32. ఐ. హేమప్రభ, బేగంపేట. 33. గడ్డం గౌరయ్య, మంచిర్యాల. 34. గోపీ-చంద్, విజయవాడ. 35. జె. వీరభద్రం, అశ్వారావుపేట. 36. పి. రోహిణి, తుని. 37. కాసారపు సంజీవయ్య, జగిత్యాల. 38. యం. హనుమంతరావు, అనంతపురం. 39. పిట్ల రాధాకిషన్, బొంబాయి. 40. ఆర్. ధర్మరాజ్ సింగ్, నెల్లూరు.

41. మండవ వెంకటరత్నం, తాడేపల్లిగూడెం. 42. ముద్దా రమేష్, కాకినాడ. 43. నీలం సరోజిని, తెనాలి. 44. సి. ఎస్. ఆర్. మూర్తి, కాకినాడ, 45. చిట్టిబాబు, గుంటూరు. 46. జె. ఎస్. ఎన్. రావు, వాల్తేరు. 47. డి. శివాజీరావు. 48. టి. రాములు, గోపులాపెల్లి. 49. శాంతికిరణ్మయి, హన్మకొండ. 50. టి. పద్మశేఖరరావు, సూర్యాపేట.

51. ఎమ్. చంద్రమౌళేశ్వరరావు, గుంటూరు. 52. జి. ఆరాధన, వలిగొండ—తదితరులు. ★

జి.వి. రమణమూర్తి

దేవుడి సొమ్ము

రాళ్ళంటే నాకెంతో ఇష్టం. రాళ్ళంటే గులకరాళ్ళు కాదు. విలువైన రాళ్ళంటే నాకు ప్రాణం.

రత్నాలంటే నా ఒళ్ళు పులకరిస్తుంది. నీలాలను తలచుకుంటే నీలాకాశం గుర్తుకొస్తుంది. ముత్యాల పేరు చెప్తే మురిసిపోతాను. కెంపులన్నప్పుడు కన్నెపిల్ల చెంపలు గుర్తుకొచ్చి ఏదో తీయదనం అనుభవిస్తాను. పగడాల కోసమయితే ఏపని చేయటానికైనా సాహసిస్తాను. ఇక వజ్రాల మాటకొస్తే అవి నా ఆరో ప్రాణం.

నాకేగాని సరియైన చదువు వుంటే వజ్రాల కవిత్వం వ్రాసేవాణ్ని. కాని నా చదువు ఎనిమిదో క్లాసుతో ఆగి పోయింది. ఏదో పేపరు చదవటానికీ, ఉత్తరాలు వ్రాయ టానికే తప్ప మరెందుకూ పనికిరాని చదువది.

పోనీ, మా నాన్న ఓ లక్షాధికారి అయినా బావుణ్ణు. ఓ వజ్రాలషాపు పెట్టుకునే వాడ్ని. మా నాన్న లక్షాధికారి కాదు, అసలు నేను మా నాన్ననే ఎరుగను. "పుడుతూనే తల్లిని, బుద్ధొస్తూనే తండ్రిని చంపాడు" అని నా చుట్టు పక్కల వాళ్ళంతా నన్ను తిడుతూ వుంటారు. ఎలాగో గాలికి పెరిగి ఇప్పటి కింతవాడ్ని-అంటే ఇరవై మూడేళ్ళ వాడ్నయ్యాను.

నా ఆనందం తీర్చుకోవటానికి నాకొక మార్గం కన్పిం చింది. అదే వజ్రాల షాపులో పని. నా పన్నెండో ఏటనే లాల్‌చంద్ &లాల్‌చంద్ షాపులో పని కుర్రాడుగా చేరాను. లాల్‌చంద్ &లాల్‌చంద్ షాపు మా పట్టణంలో పేరొందిన పెద్ద షాపుల్లో ఒకటి.

ఆ షాపులో మొదటి మూడేళ్లు నేను ఓ పని కుర్రాడిగా మెలిగాను. తరువాత మూడేళ్ళలో బంగారు నగలకు నగిషీ

చెక్కటం, వజ్రాలు వగైరాలకు మెరుగు పెట్టటం అక్కడే నేర్చుకున్నాను.

విలువలేని గాజు ముక్కలను నకిలీ వజ్రాలుగా తీర్చి దిద్దటం నాకక్కడే అలవడింది. ఆ నకిలీ వజ్రాలను రోల్డ్ గోల్డ్ నగలో అలంకరించి, విలువైన నగల రూపంతో నకిలీ నగలను తయారు చేయించి, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో వుండేటట్లు చేయటం మా సేఠ్ జీకి అల వాటు. ఇటువంటి నగలకు మా షాపు పెట్టింది పేరు. అందుకే మా షాపు ఎప్పుడూ కలకలలాడుతూ వుంటుంది. విలువైన నగలలా కన్పించే నగలను, మేం ఎంతో తక్కువ ధరకు అందిస్తున్నామని మురిసిపోయి, వాటిని కొనుక్కునే ప్రజలెంతోమంది మా పట్నంలో.

కాని వారిచ్చిన ధరలో నాల్గోవంతుతోనే ఆ నగ తయా రయిందని తెలిస్తే ఈ ప్రజ ఆశ్చర్యపోవచ్చు. కాని, నే నాశ్చర్యపోయాను. ఎందుకంటే, ఇటువంటి నగలను రూపొందించటంలో తొంభై శాతం పని నాదే. అందుకే సేఠ్ జీకి నేనంటే కొంచెం అభిమానం మెండు.

నగరంలోని ధనిక వర్గాల కోసం దూర దూరాలనుంచి అనేక రకాల విలువైన నగలు తెప్పిస్తూంటాడు మా సేఠ్ జీ. వీటికి నకిలీలు తయారు చేయటం నా పని. అసలు సిసలైన నగలను ధనిక వర్గం ధరిస్తే, మధ్యతరగతి ప్రజలు నకిలీ నగలను ధరించి తృప్తి చెందుతుంటారు.

మూడు నెలల క్రితం సింగపూర్ నుంచి ఓ వజ్రాల వర్తకుడు పదిహేడు వజ్రాలు తెచ్చాడు. సేఠ్ జీ వాటికి లక్ష రూపాయ లిచ్చాడు. వాటిని పరీక్షించమని సేఠ్ జీ నా కిచ్చారు.

అందులో పదహారు వజ్రాలు ఒకే సైజువి. మిగిలినది మిగతావాటికన్నా మూడింతలుంటుంది. దాని ఒక్కదాని వెలే పాతిక వేలుంటుంది. మిగిలినవి ఒకోటి పదేసి వేలు వుంటుంది.

నా అలవాటు ప్రకారం వాటికి కూడా నేను నకిలీలు తయారు చేశాను. ఆ నకిలీల గురించి నేనింకా సేఠ్‌జీకి చెప్పలేదు. చెపుదామనుకొనేంతలోనే ఆ వజ్రాలకు ఓ బేరం వచ్చింది.

మా వూళ్ళోని వర్తకులంతా కలిసి ఈమధ్యనే గోపాల కృష్ణుని ఆలయం నిర్మించబూనారు. ఈ ఆలయ నిర్మాణం కోసం దాదాపు ఐదు లక్షలు కేటాయించారని ఓ పుకారు. గోపాలకృష్ణుని కిరీటం కోసం మా షాపుకు వచ్చారీ వర్తకులు.

కిరీటం బంగారంతో తయారు చేసి, మా వద్దనున్న పదిహేడు వజ్రాలు దానిలో అమర్చి, రమణీయంగా తయారు చేయటానికి రెండున్నర లక్షలవుతుందనీ, దేవుడి కార్యక్రమం కాబట్టి, తాను లాభం వేసుకోనని, కిరీటాన్ని రెండు లక్షల నలభై వేలకు తయారు చేయిస్తానని మా సేఠ్‌జీ అన్నారు.

వచ్చిన వర్తక ప్రముఖులు, వజ్రాలను చూసి వాటి మెరువు, నాణ్యత పరీక్షించి మొత్తం తయారీకి రెండు లక్షల పాతిక వేలు ఇస్తామని అన్నారు.

మా సేఠ్‌జీ ఎంతో యిబ్బందిగా ముఖం పెట్టి, "ఇలా అయితే మాకు చాలా నష్టం వస్తుంది సార్" అని ఓ పది మార్లు చెప్పి, చివరకు ఆ ధరకే ఒప్పుకున్నారు.

నాకు చాలా అన్యాయమనిపించింది. ఈ బేరంలో సేఠ్‌జీకి కనీసం డభై ఐదు వేల పైనే వుంటుంది లాభం.

ఈ కిరీటం తయారుచేసే భారం నేననుకున్నట్లు నా పైనే పడింది. అప్పుడే నాలో ప్రవేశించిందా దురుద్దేశం.

దీక్షగా 15 రోజులు కష్టపడి ఆ కిరీటాన్ని అత్యంత సుందరంగా, వర్తకు లిచ్చిన కొలతలకు సరిపోయేటట్లుగా తయారు చేశాను. వజ్రాలను ఎంతో నైపుణ్యంగా అమర్చాను. అలా అమర్చేటప్పుడే వాటిని సులువుగా పైకితీసి, నకిలీవి అమర్చే వీలుండేటట్లుగా జాగ్రత్తలు తీసుకున్నాను. ఆ నకిలీ వజ్రాలు నా దగ్గరే వుంచుకున్నాను. ఆ విషయం సేఠ్‌జీకి చెప్పలేదు.

ఓ రెండ్రోజుల తర్వాత వర్తకులొచ్చి ఆ కిరీటాన్ని తీసుకు వెళ్ళారు. కిరీటాన్ని విగ్రహానికి అమర్చటానికి నన్ను రావల్సిందని చెప్పారు.

ఆ కిరీటం పని నైపుణ్యాన్ని వారెంతో మెచ్చుకున్నపుడు నా ఛాతీ రెండంగుళాలు పొంగిన మాట నిజమే కాని వారంతా వెళ్ళిపోయాక సేఠ్‌జీ నా చేతిలో పెట్టిన ఐదు వంద కాగితాలను చూసి నా మనసు దహించుకుపోయింది. ఈసారి నా పనికి కనీసం ఓ రెండు వేలన్నా సేఠ్‌జీ ఇస్తాడని ఆశించాను.

"ఆలయం పని పూర్తి కావస్తోంది. విగ్రహానికి కిరీటం అమర్చాలి" అంటూ నన్ను పిలుచుకు వెళ్లారు. అప్పుడే ఆలయాన్ని పూర్తిగా పర్యవేక్షించాను.

విశాలమైన ఆవరణలో ఆలయాన్ని నిర్మించారు. విశాలమైన ఆవరణలో మధ్యగా పెద్ద మంటపం. మంటపం వెనుక ఓ కోనేరు. కోనేటి గట్టునున్న కొబ్బరి చెట్లు కోనేటి నీటిలో తమ నీడల్ని పలకరించుకుంటున్నాయి. మంటపానికి అటూ ఇటూ దేవాలయ కార్యాలయాలు,

మంటపం ముందు మాత్రం ఇసుక ప్రదేశం. తొందరలోనే అక్కడ ఓ చిన్న ఉద్యానవనం పెంపొందిస్తారని చెప్పారు.

మంటపంలోనికి ప్రవేశించాను. మంటపానికి ప్రవేశం ఒక వైపు నుంచే. మంటపంలోనికి ప్రవేశిస్తూనే, ఎదురుగా మంటపానికి ఒక చివరగా గర్భగుడి. మంటపానికి అటూ యిటూ వున్న గోడలపై తైలవర్ణాలలో గోపాల కృష్ణుని చరిత్రను రమ్యంగా చిత్రించారు. గర్భగుడి తప్పించి, మిగిలిన మండపమంతా విశాలంగా వుంది.

భజనలు, ప్రార్థనలకేకాక, అవసరమైతే కళ్యాణాలకు కూడా వాడుకోవటానికి వీలుగా కట్టబడిందీ మండపం.

గర్భగుడిలో ప్రవేశించాను. మూడడుగుల ఎత్తున, ముద్దు లొలికే గోపాల కృష్ణుని పాలరాతి విగ్రహాన్ని నాలుగడుగుల ఎత్తునున్న వేదికపై అమర్చారు.

నేను వెళ్ళేటప్పటికి ఆలయ నిర్మాణ కర్తలంతా అక్కడే వున్నారు. వారిలో ఒకరి చేతిలో నేను తయారు చేసిన కిరీటం మెరిసిపోతోంది.

ఓ కుర్చీ వేసుకొని వేదికపై నెక్కి, ఆ బంగారు కిరీటాన్ని గోపాల కృష్ణునికి జాగ్రత్తగా అమర్చాను. కిరీటంలో రెండు వొంపులలో తేడా వచ్చింది కొద్దిగా. అక్కడికక్కడే, నా జేబులో ఎప్పుడూవుండే పరికరాల సాయంతో కావల్సిన తేడాలు చేసాను. ఇపుడు కిరీటం సరిగా సరిపోయింది.

నా పరికరాలను తిరిగి పదిలపర్చుకొని చేతులలో పట్టుకొని కుర్చీపై కాలు వేసాను. కావాలనే నా చేతిలోని పరికరాలను క్రింద జారవిడిచాను. వాటిని ఏరుకొనే నెపంతో కిందికి దిగి, మోకాళ్ళపై వంగొని ఒకోటి తీస్తూ,

వేదికను పరీక్షించాను.

వేదిక బలమైన టేకు కర్రతో చేయబడింది. వేదిక కింద అంతా ఖాళీయే. సులువుగా వేదిక కిందకు ప్రవేశించ వచ్చు. వేదిక నంతటినీ దానిని నాలుగు వైపులా పూర్తిగా కప్పుతూ ఓ అందమైన గుడ్డను పరిచారు దానిపై. ఆరడుగుల పొడవున్న నేను, వేదిక క్రిందకు సులువుగా ప్రవేశించి, దాని కింద ఓ గంటసేపు సర్దుకుపోవచ్చు.

ఈ పర్యవేక్షణంతా నేను కేవలం రెండు నిమిషాలలో పూర్తి చేసాను. వర్తకప్రముఖులంతా విగ్రహాన్ని, కిరీటాన్ని చూడటంలో మునిగిపోయి వున్నారు.

ఈ ఆలయంలో ప్రత్యేకత ఒకటుంది. గర్భగుడిలో పురోహితుడుండేది చాలా తక్కువ సమయం. ఉదయం ఎనిమిది గంటలకు తెరువబడుతాయి ఆలయం తలుపులు. అప్పుడు పురోహితుడు పదిహేను నిమిషాలలో అర్చనలు పూర్తిచేసుకుని, వెళ్ళిపోయిన పిదప, భక్తులకు ప్రవేశం లభిస్తుంది. భక్తులు యధేచ్ఛగా విగ్రహాన్ని తాకవచ్చు. అర్పించుకునేవి ఏమయినా వుంటే, తమంతట తామే అర్పించుకోవాలి. తిరిగి ఆలయం మధ్యాహ్నం 12 గం॥ వేళ మూయబడుతుంది. మళ్ళీ మధ్యాహ్నం 3 గం॥కు తెరువబడుతుంది. సాయంత్రం 6 గం॥ అవుతూనే గర్భగుడి తలుపులు మూయబడతాయి.

మధ్యాహ్నం తలుపులు తెరిచిన తరువాత పురోహితుడొచ్చి, పది నిమిషాలలో అర్చనలు ముగించుకుని వెళ్ళిపోయిన తరువాత మళ్ళీ భక్తులకు ప్రవేశం లభిస్తుంది.

ప్రతి ఆదివారమూ విగ్రహానికి బంగారు కిరీటాన్ని అలంకరిస్తారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు భక్తులెవర్నీ గర్భగుడిలో వుండనీయరు. కాని గర్భగుడి తలు

పులు మాత్రం తెరిచే వుంటాయి. మంటపంలో రాత్రి 9 గం॥ వరకూ ఆరోజు ప్రార్థనలు జరుగుతాయి.

ఆరోజు భక్తులు రాత్రి తొమ్మిది గంటలవరకూ దర్శనం చేసుకోవచ్చు. కాని సాయంత్రం 6 గం॥ తరువాత గర్భ గుడిలోనికి ప్రవేశం నిషిద్ధం. ఆరోజు మాత్రం ఆలయ మంటపం చుట్టూ పహారా వుంటుంది.

అక్కడ నా పని ముగిసింది. ఇంటికి తిరుగుముఖం పట్టాను.

నేను చేయాల్సిన దొంగతనానికి వర్షాకాలం అనువుగా వుంటుందని లెక్క వేసుకున్నాను.

ఆగష్టుమాసం. అప్పుడప్పుడు వర్షాలు పడుతున్నాయి. ఆరోజు ఆదివారం. ముందు రెండు రోజులు ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. ఆ ఆదివారమే నా దొంగతనానికి నిర్ణయించుకొన్న రోజు.

విచిత్ర మేమిటోగాని, ఆ రోజు వుదయంనుంచి ఎండ విపరీతంగా వుంది. రెండు రోజుల వర్షంతో తడిసిన రోడ్లన్నీ, ఈరోజు ఎండకు ఆరిపోయి పరిశుభ్రంగా కన పడుతున్నాయి. కాని ఈ ఎండమీద నమ్మకం లేని ప్రజలు గొడుగులు చేతనుంచుకునే తిరుగుతున్నారు. అదే నాక్కా వలసిందీను.

11.40 గం॥ప్రాంతాల ఆలయప్రాంగణం చేరుకున్నాను. చేతులో గొడుగు, భుజానికి కెమేరా - ఘుమ్మార్తులా ఓ యాత్రికుడిలా వున్నాను. ఆలయంచుట్టూ పోలీసులు తిరుగు తున్నారు.

ఆలయ ప్రాంగణంలోనికి ప్రవేశించాను. రెండు రోజు ల్నించీ వర్షం విపరీతంగా పడి, ఈరోజు ఎండ రావటంతో భక్తులు, యాత్రికులు విపరీతంగా వచ్చారు.

గర్భగుడిలో ప్రవేశించాను. అక్కడ భక్తుల సంఖ్య విపరీతంగా వుంది. చాలామంది చేతులలో గొడుగులు, భుజాలకు కెమేరాలు కనపడుతున్నాయి. అది ఇక్కడి మరో ప్రత్యేకత. చెప్పులను తప్పించి, మిగిలిన వస్తువులను తమతోపాటు భక్తులు గర్భగుడిలోనికి తీసుకు వెళ్ళవచ్చును. గోపాలకృష్ణుని విగ్రహానికి ఫోటోలు తీసుకోవచ్చుకూడా.

గర్భగుడిలో సాష్టాంగ నమస్కారాలు చేసేవారు చేస్తున్నారు. కొందరు నిలబడి అదేపనిగా ఏవో ధ్యానించుకుంటున్నారు. మరికొందరు విగ్రహం చుట్టూ, అదే, వేదిక చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అందరి మధ్యా నేను కలసిపోయాను. ఎవరి గొడవలో వారున్నారు. సాష్టాంగ నమస్కారం చేసినట్లు చేస్తూ అతి జాగ్రత్తగా వేదిక కిందకు చురుకుగా చేరుకున్నాను. ఎవరూ నన్ను పట్టించుకో లేదు.

12 గం॥ అయింది. పోలీసు ఒకడొచ్చి, భక్తుల్ని పైకి పంపిస్తున్నాడు. అలవాటుగా విగ్రహం చుట్టూ పర్యటన చేసి, బయటకు వెళ్ళి తలుపులు వేసుకుని, తాళం వేసిన చప్పుడు నాకు స్పష్టంగా వినిపించింది.

పదిహేను నిమిషాలు గడిచాయి.

ఆ వేదిక కింద నాకు విపరీతంగా చమటలు పడుతున్నాయి. ఏవిధమైన అలికిడీ లేదు. మరో పావుగంట నిరీక్షించాను. ఓపికగా, నెమ్మదిగా వేదికకింద నుండి బయటకు వచ్చాను. జేబులోనున్న బ్యాటరీ లైటు, పరికరాలు పైకి తీసాను.

చిమ్మ చీకటిగా వుంది. సమయం 12.30 గం॥అయినట్లు రేడియం డయల్ మెరుస్తూ చెప్పింది. నావద్దనున్న బ్యాటరీ

లైటు చాలా శక్తివంతమైనది. దానిని వెలిగించి, నా గొడుగు కున్న వెడల్పయిన హేండిల్‌ను రెండు భాగాలుగా చేసాను. దానిలోనుండి తీసిన సన్నని పూచలతో, ఆరడుగుల బల మైన మూడు కాళ్ళ నిచ్చెన తయారవుతుంది.

ఈ నిచ్చెన భాగాలు, వీటిని దాయటానికి అనువుగా వెడల్పయిన హేండిల్‌తో నున్న గొడుగు నేను తయారు చేసుకున్నవే. ఇవి తయారు చేయటానికి నేను పదిహేను రాత్రులు ఎంతో కష్టపడ్డాను.

ఐదు నిమిషాలలో ఆరడుగుల నిచ్చెన తయారయింది. దీనికి మూడు కాళ్ళుండటం వలన, దీనికి దాపుగా ఏమీ అక్కరలేదు. నిచ్చెనకు పైచివరను ముక్కోణాకారంలో ఓ చిన్న చట్రం తయారవుతుంది. నిచ్చెన ఎక్కి, ఆ చట్రంలో సుఖంగా కూచోవచ్చు. నేల చదునుగా వుంటే, ఈ నిచ్చెన చివరనున్న చట్రంలో ఎంతసేపయినా, ఎంత బరువున్న వ్యక్తయినా కూర్చోవచ్చు.

నిచ్చెనను తయారు చేసుకుని, మెడలో కెమెరా నుంచుకున్నాను. నిచ్చెనను జాగ్రత్తగా నేలపై నిలబెట్టాను. ఒకటి, రెండు సార్లు అటూ యిటూ కదిపి చూసాను. నేల చదునుగా వుండటంచేత, నిచ్చెన చాలా స్థిరంగా వుంది. నోటితో బ్యాటరీ లైటు పట్టుకొని, రెండు నిమిషాలలో చివరున్న చట్రంలో కూచున్నాను.

చేయి చాస్తే బంగారు కిరీటం నా చేతికందుతుంది. కాని కొంచెం ముందుకు వంగితే గాని కిరీటాన్ని విగ్రహంనుంచి వేరు చేయలేను. కిందకు వంగి చూసాను. నిచ్చెనకూ, వేదికకూ మధ్య అడుగు భాగం ఖాళీగా వుంది. మళ్ళీ కిందకు దిగి, నిచ్చెనను వేదికకు సమీపంగా అమర్చుకుని, నిచ్చెన

పైకి చేరుకున్నాను.

ఎంతో సులువుగా కిరీటాన్ని విగ్రహం నుంచి వేరు చేసాను. నా చేతులతో దానిని తడిమి, తడిమి చూసుకున్నాను. నా చేతులలో తయారయిందిది. పదిహేను రోజుల నా కష్టానికి ఫలితమిది. కాని దేవుడు సొమ్ము అది. దొంగిలించాలంటే కాస్త భయంగానే వుంది.

మనసు చిక్కబట్టుకొని, నోటితో బ్యాటరీ లైటును చేతిలో నున్న కిరీటంపైకి ఫోకస్ చేసాను. ఎడమచేతిలో కిరీటముంది, కుడి చేతిలోనికి ఓ పరికరం తీసుకుని నెమ్మదిగా కిరీటానికి మధ్యగా అమర్చిన పెద్ద వజ్రాన్ని బయటకు తీసాను. ఐదు నిమిషాలు పట్టింది. మిగిలిన పదహారు వజ్రాలను ఇరవై నిమిషాలలో బయటకు తీసివేయగలిగాను.

ఇప్పుడే కొంచెం కష్టం. కిరీటాన్ని ఎడమకాలి ముడుకుకు తగిలించాను. మెడలో వేలాడుతున్న కెమెరాను ఓపెన్ చేసాను. అందులో నున్న నకిలీ వజ్రాలను బయటకు తీసి అసలు వజ్రాల నందులో వుంచి, తిరిగి కెమేరా మూసేసాను.

మళ్ళీ కిరీటాన్ని ఎడమచేతిలోనికి తీసుకుని, కుడిచేతితో ఒకో వజ్రాన్ని అందులో జాగ్రత్తగా అమర్చాను. కిరీటాన్ని మళ్ళీ విగ్రహానికి జాగ్రత్తగా అమర్చాను.

వాచీ చూసుకున్నాను. రెండు గంటలు కావస్తోంది. నిచ్చెన దిగి, దానిని మళ్ళీ పూచల రూపంలోకి తీసుకు వచ్చాను. వీటిని మళ్ళీ గొడుగు హేండిల్‌లో వుంచి, రెండు భాగాలను ఒకటిగా చేసాను.

వర్షం మళ్ళీ మొదలయిందనుకుంటాను, బయట నుంచి భోరున శబ్దం వినపడుతోంది.

ఓ పదిహేను నిమిషాలపాటు అంతా పరికించాను.

ఎక్కడా ఏ విధమైన గుర్తులూ నేను వదలలేదు. చేతికి గ్లౌవ్స్ వుండటం వలన వేలి ముద్రలు పడతాయనే భయం లేదు. మరో పది నిమిషాలు విగ్రహాన్ని చూస్తూ నిలుచు న్నాను. 2 గం॥ 40 నిమిషాలయింది సమయం. బ్యాటరీ లైట్‌ను ఆపి, దానిని, పరికరాలను జేబులో వుంచుకున్నాను. కెమేరాను, గొడుగును వేదిక కిందకు తోసి, నేనూ దాని కిందకు చేరుకున్నాను.

నిమిషాలు అతిభారంగా గడుస్తున్నాయి. బయట గర్భ గుడి తెరుస్తున్న చప్పుడు. ముందు పూజారి వచ్చి తనలో తనే ఏవేవో గొణుక్కున్నాడు. అతనెంత తొందరగా బయ టకు వెళతాడా అని చూస్తున్నాను.

బయట వర్షం వుధృతం తగ్గినట్లుంది పెద్దగా చప్పుడు రావటం లేదు. పూజారి తన అర్చనలు పూర్తి చేసుకుని బయ టకు వెళ్ళాడు. మరో ఐదు నిమిషాలు గడిచాయి.

వేదికను కప్పుతున్న గుడ్డను కొంచెంగా ఎత్తి చూచాను. భక్తులొకరొకరూ వస్తున్నారు. మరో పది నిమిషాలలో భక్తుల సంఖ్య ఎక్కువయింది. గుంపులు గుంపులుగా వస్తు న్నారు. గర్భగుడిలోనికి వచ్చి, దర్శనం చేసుకుని, నమస్కా రాలు చేస్తూ, సాష్టాంగాలు పడుతూ, ప్రదక్షిణలు చేసు కుంటూ వున్నారు.

బయట వెలుతురు ఎక్కువగా లేదు వర్షం మూలాన. కరంటుకూడా పోవటంచేత గర్భగుడిలో చీకటిగా వుంది. నెమ్మదిగా వేదిక కిందనుంచి బయటకు వచ్చి, నేనుకూడా వారితో కలిసిపోయాను.

భక్తులంతా ఆ విగ్రహ రమణీయతను, కిరీటం చెక్కటం

లోని నైపుణ్యాన్ని దీపం కాంతిపడి, రంగులీనుతున్న ఆ నకిలీ వజ్రాలను మెచ్చుకుంటున్నారు.

విలువలేని గాజు పెంకులను చూసి, విలువైన వజ్రాలను కాని వాటిని కొనియాడుతున్న వీళ్ళెంత వెర్రివాళ్ళు అని నవ్వుకున్నాను.

గర్భగుడిలో నుండి బయటకు మంటపంలోనికి వచ్చాను. చిన్న చిన్న చినుకులు తప్ప పెద్ద వర్షమేమీ లేదు. మండపం బయటకు వచ్చాను.

మంటపం చుట్టుతా రైన్‌కోట్స్ వేసుకుని పహారా ఇస్తున్న జవానులను చూసి నవ్వుకున్నాను. వీళ్ళు షిఫ్టు మారినట్లున్నారు. పొద్దున్న వున్నవాళ్ళు కాదు వీళ్ళు. నవ్వుకుంటూ గొడుగు తెరిచాను.

రెండడుగులు ముందుకు వేసానో లేదో ఓ పోలీసు నా వైపు రావటం చూసి ఆశ్చర్యపోయాను. ఏవో సంజ్ఞల ద్వారా మరో ఇద్దరు పోలీసులతో సహా నావైపు వచ్చాడు. నా గుండె ఓ క్షణం లయతప్పింది. చల్లటి వాతావరణంలో చమటలు పోసాయి.

నన్నుచూసి ముందుకు వచ్చిన పోలీసు తమతోపాటు నన్ను పోలీసు స్టేషనుకు రావల్సిందన్నాడు. నేనేదో అన బోయేటంతలో, మిగిలిన ఇద్దరు నాపై చేతులు వేసారు. దృఢంగా వుంది వారి పట్టు. వారి ననుసరించక తప్పలేదు నాకు.

స్టేషన్ చేరుకున్నాం. కానిస్టేబుల్ నన్ను చూపించి, ఇనస్పెక్టర్ చెవిలో ఏవో గుసగుసలాడాడు. ఇనస్పెక్టర్ నన్ను పరికించి చూసాడు. నా కెమేరాలో దాచిన ఎంతో

విలువైన వజ్రాలను బయటకు తీయటానికి ఐదు నిమిషాలు కూడా పట్టలేదు ఇనస్పెక్టర్‌కు.

ఆ పోలీసులతో పాటు ముందుకు నడిచాను. నన్నో జైలు గదిలోనికి పంపి తలుపులు వేస్తున్న పోలీసు. నన్ను ముందు అనుమానించిన పోలీసే.

"నేను దొంగతనం చేసాను ఒప్పుకుంటాను. కాని చాలా తెలివిగా, పకడ్బందీగా ప్లాను వేసుకుని జాగ్రత్తగా చేసానీ దొంగతనం. ఎక్కడ తప్పు చేసానో నాకర్థం కావటం లేదు. అంత సులువుగా, వేగంగా నన్నెలా పట్టుకోగల్గారో నాకు తెలియలేదు," అని అతనిని అడిగాను.

ఆ జవాను గర్వంగా ఒకసారి నావైపు చూసి "ఆలయం మధ్యాహ్నం 3 గం॥కు తెరువబడింది. 2 గం॥ 15 ని॥ నుంచి వర్షం పడుతోంది. 3 గం॥ 45 ని॥ ప్రాంతాల ఆలయంలో నుండి బయటకు వచ్చి, పొడిగా వున్న గొడుగు నువ్వు తెరిస్తే, బుర్రనేది వున్న వాడెవడికయినా అనుమానం కలుగుతుంది. అంతవరకూ వుధృతంగా వర్షం పడింది. నువ్వు ఆలయంలో నుండి బయటకు వచ్చావు కాని నువ్వు విప్పిన గొడుగు పొడిగా వుంది. అంటే, నువ్వు వర్షం పడకముందు నుంచీ ఆలయంలో వున్నావనే అనుమానం నాకు కలిగింది.

అసలు నీ రాత బాగులేదు. నువ్వు బయటకు వచ్చే నప్పుడు చిన్న చిన్న చినుకులే పడుతున్నాయి. గొడుగు తెరవ వలసిన పనిలేదప్పుడు. కాని గొడుగు తెరిచి నా కళ్ళలో పడ్డావు. ఐయామ్ సారీ ఫర్ యూ, బట్ ఐమస్ట్ థాంక్ యూ. నీ ధర్మమా అని నాకు హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ రావచ్చు." అని నవ్వుతూ వెళ్ళిపోయాడు. ★

నాగ-మానవ సంగ్రామం
... శ్రీరాజ్

"అమ్మయ్య. చచ్చిపోయింది ఇక ఫర్వాలేదు. తీసుకువెళ్ళి కట్ట అవతల పారేయండి" అన్నాడు సుబ్బారావు.

చేతిలోని కర్రను అవతల పారేస్తూ నిర్జీవంగా పడి వున్న మూడు అడుగుల పామును చూస్తూ.

ఎవరూ ముందుకు రాలేదు, చచ్చిపోయిన పాముని బయట పారేసేందుకు. వాళ్ళందరినీ ఒక్కసారి చూసి—

"చచ్చిన పాముకి కూడా భయపడేవాళ్ళు, మీరేం మనుష్యులు" అని దాని తోక పట్టుకొని కొద్దిగా ముందుకు వెళ్ళి ఆ చచ్చిన పాముని రెండుసార్లు గిరగిరా తిప్పి విసిరాడు. అది వెళ్ళి కొద్ది దూరంలో వున్న కట్టమీద చెట్ల గుబురులో పడింది.

సుబ్బారావు ఇంటి వైపు కదిలాడు.

"ఏమండీ! ఆ చచ్చిన పాముని ఏం చేశారు?" అడిగింది సుబ్బారావు భార్య సుజాత, అప్పుడే లోపలకు వస్తున్న భర్తను చూసి.

"ఏం చేస్తాను, తీసుకెళ్ళి బయట పారేసాను."

"అది కాదండీ, దాన్ని దహనం చేస్తే దాని ఆత్మకు శాంతి లభిస్తుంది. మనకి కూడ దానిని చంపామే అన్న పాపభీతి వుండదు" అన్నది సుజాత.

సుజాతకి పాపభీతి ఎక్కువ. మూఢనమ్మకాలను నమ్ముతుంది.

"పాపం, పుణ్యం - అది మనల్ని కరిస్తే ఆ పాప పుణ్యాలు వచ్చి అడ్డుపడతాయా?" అన్నాడు సుబ్బారావు.

భర్త ప్రశ్నకు జవాబు చెప్పలేక వంట గదిలోకి నడుస్తూ—

"త్వరగా కాళ్ళు కడుక్కొని రండి. వడ్డిస్తాను" అన్నది.

సుబ్బారావు లేచి లుంగీ కట్టుకొని దొడ్డి గుమ్మం వైపు కదిలాడు.

*　　　*　　　*

నాగలోకం—

నాగలోక సభామంటపం—

నాగరాజు సింహాసనారూఢుడై వున్నాడు.

కొన్నివేల నాగులు సభామంటపంలో బారులు తీరి కూర్చొన్నాయి. సభామంటపం అంతా నిశ్శబ్దంగా వుంది.

నాగరాజు ప్రక్కనే మరొక సింహాసనంలో కూర్చున్న మంత్రి లేచినిలబడి, సభను అంతా పరీక్షగా చూసి—

"నాగలోక వాసులారా! ఈరోజు ఈ అత్యవసర సమావేశం ఎందుకు పెట్టించామా అన్నది ఇప్పుడు మీకు తెలియ పరుస్తాను.

భూలోకానికి విహారార్థమై మనం వెళ్ళడం జరుగుతు తున్నది, ఎన్నో సంవత్సరాలుగా. కాని ఇక్కడ నుంచి వెళ్ళిన నాగులలో కొంతమందే తిరిగి వస్తున్నారు మళ్ళా మన లోకానికి.

కొంతమంది అక్కడ ప్రకృతి సౌందర్యాలకు మైమరచి రెండు దినాలకంటే ఎక్కువ కాలం వుండి తమ శక్తులను పోగొట్టుకుని అక్కడ నిర్మానుష్యమైన చోట స్థిరనివాస మేర్పరచుకొన్నారు.

కాని—

కొంతమంది, భూలోకవాసులైన మానవులచే చంప బడుతున్నారు. ఇలా చంపబడుతున్న నాగులు లెక్కను మించి వున్నాయి. ఇలా ఎందరు నాగులు నిష్కారణంగా, నిర్దయగా చంపబడుతున్నారో మనకు తేలని సమస్య.

ఈ సమస్యను పరిష్కరించాలి. అదీగాక భూలోకంలో స్థిరనివాస మేర్పరచుకొని వున్న మనలోకవాసులందరికీ కూడా రక్షణ కల్పించాలి.

భూలోకంలో వున్న మన నాగులందరూ, మానవ సంచారానికి దూరంగా, సాధారణంగా ఏ మానవుని కంట పడకుండా తగు జాగ్రత్తలో వుంటున్నారు. ఈ సంగతి మీ అందరికి కూడా తెలుసు."

ఒక్క క్షణం చెప్పటం ఆపి, వూపిరి ఒక్కసారి గట్టిగా పీల్చుకొని మరల చెప్పసాగాడు.

"కాని భూలోకంలో జనాభా పెరిగిపోయి, మారు మూల ప్రదేశాలకు వెళ్ళి గృహాలు నిర్మించుకొని, నివాస మేర్పరచుకొంటున్నారు. వారు కొత్తగా నివాస మేర్పరచు కొన్న చోట, మన నాగులకి ఆ ప్రదేశం పాతదయింది. మనవారు వున్నచోటుకి మానవులు కూడ రావడంతో మన వాళ్ళకి బయట స్వేచ్ఛగా సంచరించటానికి వీలుపడటం లేదు.

జరిగిన రెండు మాసాలలో మనవాళ్ళు ఎక్కువ సంఖ్య లోనే చనిపోయారు—కాదు చంపబడ్డారు!

ఇక ముందు ఇటువంటి దారుణ కృత్యాలు జరగకుండా వుండటానికి మన రాజుగారు ఒక నిర్ణయానికి వచ్చారు" అని ప్రక్కకు తిరిగి భటుడికి ఏదో చెప్పాడు మంత్రి.

* * *

కళ్ళు తెరిచి చూచాడు సుబ్బారావు. అతనికి అంతా అయోమయంగా వున్నది. అతనికి మెదడు మొద్దుబారి పిచ్చెక్కినట్లయ్యింది.

అతని చుట్టూ కొన్ని వేల నాగులు బారులు తీరి

వున్నాయి. వాటికి కొద్దిగా ప్రక్కగా చిన్న వేదికలాంటిది వున్నది. ఆ వేదిక మీద రెండు సింహాసనాలు అమర్చపడి, రెండు సింహాసనాల్లో ఇద్దరు వ్యక్తులు కూర్చొని వున్నారు.

మొదటి సింహాసనంలో కూర్చొన్న వ్యక్తి వంక చూసాడు సుబ్బారావు. ఆ వ్యక్తి ధగ ధగా మెరిసిపోతు న్నట్లు కనిపించాడు. విలువైన వస్త్రాలు ధరించాడు. తల మీద కాంతులు వెదజల్లుతున్న కిరీటం ఉన్నది.

రెండవ సింహాసనంలో కూర్చొన్నతని వంకకు దృష్టి మరల్చాడు. రెండవ అతను సాదాగా కనిపించాడు.

"మానవుడా! ఆశ్చర్యపోతున్నావా? నువ్వు ఇప్పుడు ఎక్కడ వున్నదీ నీకు తెలియటంలేదుకదూ! చెబుతాను—

ఇది నాగలోకం. నేను ఈ లోకానికి రాజుని. ఈ నా ప్రక్కన కూర్చొన్నది నా మంత్రి.

ఈ బారులుతీరి ఉన్నవారంతా నా ప్రజలు. నువు ఇక్కడకు ఎలా వచ్చావని ఆలోచిస్తున్నావా? అదికూడ చెబుతా విను. నిన్నరాత్రి నువు నా ప్రజలలో ఒకడైన మా నాగుని నిర్దాక్షిణ్యంగా చంపావు. నువు ఒక్కడివే కాదు. భూలోకంలో ప్రతి మానవుడు, కనపడ్డ ప్రతి నాగును నిష్కారణంగా నిర్దాక్షిణ్యంగా చంపుతాడు" సుబ్బారావు నాగరాజు చెపుతున్నది వినటం మాని ఆలోచనల్లో పడ్డాడు.

సుబ్బారావుకి ఇదంతా ఏదో మాయలాగా ఉన్నది. లేక అది కలో, నిజమో అర్థం కావటంలేదు. తనేమిటి? నాగలోకం రావడం ఏమిటి?

నాగరాజు మాట్లాడుతున్నది సరిగా అర్థం కావటంలేదు సుబ్బారావుకి. అది నాగభాషేమో అనుకొన్నాడు. కాని అక్కడక్కడ కొన్ని తెలుగు పదాలు కూడ ఉన్నాయి. అంటే

అది సంస్కృత భాష అని నిర్ధారణ చేసుకొన్నాడు. సుబ్బారావుకి సంస్కృత భాషతో కొద్దిగా పరిచయం ఉన్నది.

"—ఆదినుంచి మీ భూలోక వాసులకు ఇది ఒక అలవాటుగా తయారయింది. కనపడ్డ ప్రతి నాగుని చంపటం. నిన్న రాత్రి నువు కారణం లేకుండానే మా నాగుని చంపావు. నిన్న ఉదయం మా నాగు భూలోకానికి విహారార్థమై ఒంటిగా బయలుదేరి వచ్చింది. నిన్న సాయంత్రానికి దారి తప్పి మీరుండే ప్రదేశానికి వచ్చింది. నువు మా నాగుని చంపటానికి ప్రయత్నించినప్పుడు కూడ అది ఎదురు తిరగకుండా వెళ్ళిపోతున్నది. కాని నువు దాని వెంటబడి దాని తల బ్రద్దలు కొట్టావు.

మా నాగు ఆ క్షణంలో ఎదురు తిరిగి ఉంటే నువు ఈ రోజున ఇక్కడ ఉండేవాడివి కావు. సరాసరి యమపురికి పోయేవాడివి.

ఇలా మీరు చేస్తున్న ఘోర కృత్యాలు నానాటికి మితి మీరి పోతున్నాయి. ఇప్పటికి కొన్ని వేల నాగులు మీ మానవుల వాతబడి మరణించినాయి.

అవి మిమ్మల్ని ఏమి చేయకపోయినా మీరు ముందుగానే భయపడి వాటిని చంపేస్తున్నారు.

"నిజానికి మా నాగులు మీరనుకొన్నంత భయంకరులు, దుష్టులు కావు. అనవసరంగా ఒకరి జోలికి పోరు.

మా నాగులకు ఎప్పుడు ఈ నాగలోకంలో ఉండాలంటే విసుగు పుట్టి అప్పుడప్పుడు భూలోకానికి విహారార్థమై వస్తుంటాయి. కొన్ని సందర్భాలలో అవి దారి తప్పి, మీ రున్న చోటికి వచ్చి, మీచే వధింపబడుతున్నాయి. సామాన్యంగా అవి మానవులకు దూరంగానే తిరుగాడుతుంటాయి.

సహజంగా మా నాగులకి మా లోకంలో ఉన్నంతవరకు సర్వ శక్తులు ఉంటాయి. అవి భూలోకాని వచ్చినప్పుడు, భూలోకంలో రెండు దినాల కంటే ఎక్కువ ఉన్నట్లయితే అవి తమ సర్వశక్తులనూ కోల్పోయి, మళ్ళీ మా లోకానికి రాలేవు.

"అందుకని శక్తులు నశించిన మా నాగులు భూలోకం లోనే స్థిరనివాస మేర్పరుచుకొని అక్కడే జీవనం సాగించ సాగాయి. భూలోకానికి వచ్చే మా నాగులకి, అక్కడే నివాస ముంటున్న మా నాగులకి రక్షణ కల్పించటం కోసం నిన్ను ఇక్కడకు తీసుకు వచ్చాము." తన దీర్ఘ ఉపన్యాసాన్ని ఆపాడు నాగరాజు.

చెక్కిన బొమ్మలా నిల్చుండి అంతా విన్నాడు సుబ్బా రావు. కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా గడిచినాయి. సుబ్బారావుకి మాట్లాడాలని ఉంది. కాని ఏ విధంగా మాట్లాడాలో తెలియక తికమక పడుతున్నాడు.

"నన్ను ఇక్కడికి తీసుకువస్తే, మీ నాగులకి రక్షణ ఎలా కలుగుతుంది?" అడిగాడు సుబ్బారావు మాటలన్నీ కూడగట్టుకొని.

నాగరాజు, మంత్రివంక చూసాడు.

మంత్రి తన సింహాసనంలోంచి లేచి నిలబడి చెప్ప సాగాడు.

"నువు నాగలోకానికి, భూలోకానికి రాయబారిగా ఉండి ఇప్పుడు మేము చెప్పబోయేది, మేము చెప్పిన విధముగా మీ ప్రభుత్వానికి చెప్పాలి." అని రాజువంక, సభవంక ఒకసారి చూసి, తిరిగి సుబ్బారావు వైపు తిరిగాడు మంత్రి.

మంత్రి ఏం చెబుతాడా అని కనురెప్ప కూడ మూయ కుండా ఆయన వంక చూడసాగాడు సుబ్బారావు.

మంత్రి ఒక్కసారి గొంతు సవరించుకొని చెప్పసాగాడు:

"మా నాగలోక వాసులు, మీ భూలోకానికి వచ్చినప్పుడు గాని, లేక అక్కడే నివాస ముంటున్న మా నాగులుగాని, మీ మానవుల దృష్టిలో పడినప్పుడు మీరు వాటికి ఎటువంటి హాని చేయకూడదు. అలాగే మా నాగులుకూడ మిమ్మల్ని ఏం చేయవు. భూలోకానికి, నాగలోకానికి మైత్రి కుదర్చాలి.

"ముఖ్యంగా నువు చేయ్యాలిన పనేమిటంటే, భూలోకంలో కొంత స్థలాన్ని మా నాగలోకవాసుల గురించి కేటాయించేటట్లు చేయాలి. అలా కేటాయించిన స్థలంలోకి మీ మానవులు రాకూడదు. అలాగే మా నాగులుకూడ ఆ ప్రదేశం వదిలి మీరున్న చోటికి రారు. ఇదంతా నువు మీ ప్రభుత్వానికి చెప్పిగాని, లేక నీవుగాని చేయాలి. పది రోజుల లోపు మాకు అంగీకార సమాధానం రావాలి.

"పది రోజులలో మాకు ఎటువంటి సమాచారం అందించక పోతే, ఇంతవరకు మీరు మా నాగులమీద జరిపిన హింసాకాండకు బదులుగా పగ తీర్చుకుంటాము. మీ భూలోకాన్ని సర్వ నాశనం చేస్తాం. మా నాగలోకవాసుల ప్రతాపాన్ని మీకు రుచి చూపిస్తాము. ఎటువంటి గొడవ జరగకుండా ఉండేందుకు నీ ద్వారా శాంతియుతంగా పని జరిగేందుకు నిన్ను మా లోకం తరఫున రాయబారిగా పంపిస్తున్నాము.

"మా హెచ్చరికను నిర్లక్ష్యపరచకుండా మీ ప్రభుత్వం నుండి మాకు సమాధానం వచ్చేటట్లు చేయాలి. పదవరోజు అర్థరాత్రి మా నాగు ఒకడు నీ నివాసానికి వస్తాడు. అతనికి నువ్వు ఈ విషయంపై మీ ప్రభుత్వం ఏం తీర్మానించుకున్నదో చెప్పాలి. పదవ రోజు రాత్రికి మీనుండి అంగీకార

వార్త రాకపోతే పదకొండవరోజు రాత్రికి మా సేనలు, మీ మానవుల్ని కదలనీయకుండా చేస్తాయి. ఎదురు తిరిగితే తమ కాలకూటాన్ని మీమీద వెదజల్లి మిమ్మల్ని నామ రూపాలు లేకుండా చేస్తాయి. అర్థమయింది కదూ, ఇప్పుడు చెప్పిందంతా. ఇంకో పది క్షణాల్లో నీకు స్పృహ తప్పు తుంది. ఆ తరువాత నీకు స్పృహ వచ్చేటప్పటికి మళ్ళీ భూ లోకంలోనే ఉంటావు.

"ఇప్పుడు మేము చెప్పిందంతా మరచిపోకుండా మీ ప్రభుత్వానికి ఎరుకపరచి జరగవలసిన కార్యక్రమం దిగ్వి జయం చేస్తావని తలుస్తాము," అని తన ఉపన్యాసాన్ని ఆపి సింహాసనంలో కూర్చున్నాడు మంత్రి.

సుబ్బారావు, తనకు ఏదో అవుతున్నట్లు ఫీలవసాగాడు. అంటే 'తనకు స్పృహ తప్పుతున్నది కాబోలు' అను కున్నాడు.

* * *

కళ్ళు తెరచి చూశాడు సుబ్బారావు.

చుట్టూ గాఢాంధకారంగా ఉన్నది. కన్ను పొడచుకొన్నా ఏమీ కనపడటం లేదు. క్రింద చేత్తో తడిమి చూసాడు, చేతికి పచ్చగడ్డిలాటిది తగిలింది. లేచి నుంచొని జేబులో చెయ్యి పెట్టుకొన్నాడు. సిగిరెట్టు ప్యాకెట్టు, అగ్గిపెట్టె రెండూ ఉన్నాయి. అవి రెండూ ఉండటం చూసి పరవాలేదను కొన్నాడు. పెట్టెలోంచి సిగిరెట్టు తీసి వెలిగించుకొన్నాడు. అగ్గిపుల్ల కాంతిలో పరిసరాలను పరీక్షింపసాగాడు. సన్నని కాలి బాట కనపడింది. ఆ బాట వెంటనే నడుస్తూ ఆలోచించ సాగాడు.

'నేను నాగలోకం వెళ్ళాను, అక్కడ నాగరాజు నాకు

ఈ విధంగా చెప్పాడంటే ఎవరన్నా నమ్ముతారా? అనుమానాలు ప్రదక్షిణం చేయసాగాయి. అసలు ఎవరికి చెప్పాలి, ఏవిధంగా చెప్పాలి, అన్నది తోచటం లేదు. అసలు ఏం చేయాలో పాలుపోవడం లేదు.'

సుబ్బారావు సిమెంటు ఫ్యాక్టరీలో కార్మికుడు. నెలకు అయిదు వందలు సంపాదిస్తాడు.

ఫ్యాక్టరీ యాజమాన్యం వారు కార్మికుల సౌకర్యార్థమై, ఫ్యాక్టరీకి అరమైలు దూరంలో ఉన్న ఖాళీ స్థలంలో కార్మికులకు క్వార్టర్సు కట్టి ఇచ్చారు.

ఫ్యాక్టరీవారు క్వార్టర్స్ కట్టక మునుపు అక్కడ అంతా అడవిలాగా వుండేది. ఆ ప్రదేశమంతా రక రకాల విష జంతువులు సంచరిస్తూ వుండేవి.

కార్మికులు క్వార్టర్సులోకి వచ్చిన కొత్తల్లో చాలా విష జంతువుల్ని చంపారు. ఆ తరువాత తరుచుగా వస్తుండేవి. కార్మికులందరిలోకి, సుబ్బారావు పాములను చాకచాక్యంగా ఒక్క దెబ్బకే చంపేవాడు. అందుకనే క్వార్టర్స్‌లో ఎక్కడన్నా పాము కనబడితే ముందుగా వచ్చి సుబ్బారావుకి చెబుతారు చాలామంది.

టైము చూసుకొన్నాడు సుబ్బారావు. అగ్గిపుల్ల వెలుగులో గం॥ 2-30 ని.లు అయింది. కొద్ది దూరంలో లైట్లు కనిపించాయి సుబ్బారావుకి. త్వరగా నడవసాగాడు. ఐదు నిమిషాల్లో వూరి లోపలకు వచ్చాడు సుబ్బారావు.

మర్నాటి ఉదయం తనకు తెలిసిన ప్రతివాడితో చెప్పాడు. పోలీసు స్టేషన్‌కి వెళ్ళి పోలీసులతో చెప్పాడు. చివరకు కలెక్టర్ ఆఫీసుకు వెళ్ళి కలెక్టర్‌తో కూడా చెప్పాడు.

కాని ఎవరూ కూడా సుబ్బారావు మాట నమ్మలేదు. అతన్ని ఒక పిచ్చివాడి క్రింద జమ కట్టారు.

సుబ్బారావుకు అతి ముఖ్యమయిన మిత్రులతో చెప్పినా కూడ, వారు "ఆఁ! నువ్వు పాముల్ని ఎక్కువ చంపుతావు కదా! అందుకని అటువంటి కల వచ్చి వుంటుంది" అన్నారు.

అప్పటికి తొమ్మిది రోజులు గడచిపోయాయి. ఏం చేయాలో తోచటం లేదు సుబ్బారావుకి. ఫ్యాక్టరీకి కూడ సెలవు పెట్టి ఇంట్లోనే కూర్చున్నాడు.

నాగరాజు చెప్పిందంతా పేపర్లో వేయించాడు.

పత్రికా విలేఖరులు వచ్చి వారికి కావలసిన వివరాలు తీసుకు వెళ్లారేగాని, ఎటువంటి చర్య తీసుకోలేదు.

అఖరికి తన భార్య కూడ తనని నమ్మటం లేదు.

సుబ్బారావుకి నిజంగా పిచ్చి పట్టిందని వదంతి వ్యాపించింది.

* * *

టైము చూసుకున్నాడు సుబ్బారావు. గం॥ 11-40 లు అయింది. ఇంకొద్ది సేపట్లో నాగలోకం నుంచి ఎవరో ఒకరు వస్తారు. ఏం చేయాలి? వాళ్ళకి సమాధానం ఏం చెప్పాలి? ఎవరికి ఏం చెప్పినా తనని ఒక పిచ్చివాడి కింద జమ కడుతున్నారు. కనీసం తన భార్య కూడా తన మాట నమ్మటం లేదు.

సుబ్బారావు మనసంతా గజిబిజిగా వున్నది. బుర్ర వేడెక్కిపోతున్నది. పిచ్చి పిచ్చి ఆలోచనలన్నీ బయలుదేరుతున్నాయి. చివరికి ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నాడు.

ఆత్మహత్య చేసుకొనటంవలన లాభం లేదు. ఎట్లాగు రేపు రాత్రికి అంతా చనిపోతారు. తను తొందరపడటం దేనికి? రేపు రాత్రికి ఏ సంగతి తేల్చుకొని ఆ పాముల చేతిలోనే చచ్చిపోతే సరి.

అంతలో కిటికీలోంచి 'బుస్' మని శబ్దం వచ్చింది. ఉలిక్కిపడి అటు చూసాడు సుబ్బారావు.

నల్లగా నిగనిగలాడుతూ తల పైకెత్తి పడగ విప్పి అటూ ఇటూ చూపుతున్నది ఒక పాము. దాన్ని చూడగానే సుబ్బారావుకి కాళ్ళు వణకసాగాయి. ఒక్కసారిగా చలి జ్వరం వచ్చినట్లయింది. నోట మాట రావటం లేదు. పెదాలు తడి ఆరిపోతున్నాయి. నిలువు కళ్ళతో దానినే చూడసాగాడు.

ఇంతకు ముందు అటువంటి పాములను ఎంతో అవలీలగా చంపేవాడు. ఇప్పుడు ఈ పాముని చూసేటప్పటికి కనీసం ధైర్యంగా కూడా నిలబడలేకపోతున్నాడు.

'బుస్, బుస్' మని మరోసారి బుసలు కొట్టింది పాము. నాలికతో పెదాలు తడుపుకొన్నాడు సుబ్బారావు. అప్పటి దాకా మూసుకుపోయిన పెదాలు కొద్దిగా కదిలాయి.

"ఇక్కడ ఎవరూ నా మాట నమ్మటం లేదు. అసలు నాగలోకమే లేదంటున్నారు. నాదంతా కట్టుకథ అంటున్నారు. చివరికి నన్నొక పిచ్చివాడి క్రింద జమ కడుతున్నారు అందరూ.

"నాకు చేతనయినంతవరకూ ప్రయత్నించాను. ఇంతకు మించి నేను ఏమీ చేయలేను. ఆ తరువాత మీ ఇష్టం. వెళ్ళి మీ రాజుకి చెప్పు" ఆపైన ఇక ఏమి చెప్పాలో తెలియక తల వంచుకు నిలబడ్డాడు.

'బుస్ బుస్' అంతకు ముందుకంటే రెట్టింపు అయిన శబ్దం వచ్చింది.

దాని వంక చూసాడు సుబ్బారావు. అది వెళ్ళిపోతున్నది. 'అంటే దానికి కోపం వచ్చిందన్న మాట' అనుకొన్నాడు మనస్సులో సుబ్బారావు.

*　　　*　　　*

రాత్రి 12 గం॥ సమయం.

ఏ రోడ్డు మీద చూసినా, ఏ వీధిలో చూసినా, ఎక్కడ చూసినా కొన్ని వందల వేల పాములు బారులుతీరి వున్నాయి.

చీమ దూరటానికి కూడా సందులేనట్లు నిలబడ్డాయి.

పాములన్నీ తమ విశాలమైన పడగలు విప్పి భయం కరంగా బుసలు కొడుతున్నాయి.

ప్రజలంతా భయభ్రాంతులై బిక్కచిక్కిపోయి వున్నారు. అందరూ తలుపులు మూసుకొన్నారు. కిటికీలు, చివరికి నీళ్ళుపోయే కన్నాలను కూడా మూసేశారు.

కొంతమంది కర్రలు, పలుగులు, ఇతర ఆయుధాలు చేతబట్టుకొని కూర్చున్నారు, ఏవైపు నుంచి ఏ పాము వస్తుందా అని. బయట నుంచి బుసల శబ్దం విపరీతంగా వస్తున్నది.

అంతలో........

*　　　*　　　*

పోలీస్ స్టేషన్‌లో అసహనంగా తిరుగుతున్నాడు ఇన్‌స్పెక్టర్ చలపతి. మాటి మాటికి గడియారం వంక చూసుకొంటున్నాడు. క్షణ క్షణానికి ఫోను వైపు చూస్తు న్నాడు. కాలం జరుగుతున్నకొద్దీ అతనిలో ఆదుర్దా ఎక్కు వయి పోతూన్నది.

స్టేషను బయట పాములు గుంపుగా ఎదురు చూస్తున్నాయి, ఎవరన్నా బయటకు వస్తారేమోనని.

పది, పదిహేను పాములయితే వాటిని ఫైరింగ్ చేసి గాని, వేరే విధముగా గాని చంపగలిచేవాడు ఇన్‌స్పెక్టర్ చలపతి. కాని—అవి వందలకొద్ది వున్నాయి. అటువంటప్పుడు ఫైరింగ్ జరిగితే లాభం వుండదనుకొని పై ఆఫీసర్లకు ఫోన్ చేశాడు.

ఫోను మ్రోగింది. ఒక్క అంగలో వెళ్ళి రిసీవర్ చేతిలోకి తీసుకొని—

"హల్లో!" అన్నాడు ఆతృతగా.

"............"

"వెరీగుడ్ థాంక్యూ. ఎంతసేటిలో ఇక్కడకు చేరుతారు?"

"............"

"ఓ.కె. థాంక్యు" అని రిసీవర్ పెట్టేశాడు ఇన్‌స్పెక్టర్ చలపతి.

అంతలో ప్రక్క గదిలోంచి సబిన్‌స్పెక్టర్ మోహన్ వచ్చాడు.

"మిస్టర్ మోహన్ ఇంకో అరగంటలో ఆర్మీ వస్తుంది రెడీగా వుండు" చెప్పాడు చలపతి మోహన్‌తో.

అంతలో మళ్ళా ఫోను మ్రోగింది "హల్లో!" అన్నాడు రిసీవర్ చెవి దగ్గర పెట్టుకొని.

"వ్వాట్?" అదిరిపడ్డాడు చలపతి అవతల నుంచి వచ్చిన సమాధానం విని.

"అలాగా, జన నష్టం ఏమన్నా జరిగిందా?" అడిగాడు మళ్లా చలపతి ఆదుర్దాగా.

"............"

కొద్ది క్షణాలు ఫోనులో మాట్లాడిన తరువాత రిసీవరు పెట్టేసి మోహన్ వైపు తిరిగాడు.

"మన ఆంధ్రదేశంలోనే కాదు. ఇండియా అంతా ఈ పాముల దండు విజృంభించిందట" చెప్పాడు చలపతి.

"ఇంతకీ మనం బయటకు వెళ్ళడం ఎలా?" అడిగాడు మోహన్.

"దాన్నిగురించి బాధలేదు. వచ్చే మిలిటరీ అంతా ప్లైట్స్‌లో వస్తున్నది. ఐదు హెలికాప్టర్‌లు మనకోసం కేటాయించ బడ్డాయి. అవి మన డాబామీద ఆగుతాయి. ఈలోపల మనం డాబా మీద నుంచొని వాటికి సిగ్నల్స్ ఇవ్వాలి."

"కాని, నాకు ఉన్నదల్లా ఒకటే బాధ. ఇప్పుడు వచ్చే ఆర్మీ ఇన్ని వేల పాములను నాశనం చేయగలదా? అని ఆలోచిస్తున్నాను. ఈ భయంకర సంగ్రామంలో ఎంత జన నష్టం వస్తుంతో అర్థంకావటం లేదు."

"వారం రోజులు ముందు ఎవరో సుబ్బారావు అనే అతను వచ్చి మనకు ముందుగానే ఈ విషయం వివరించాడు. కాని మనం అతని మాటలు నమ్మలేదు. పోగా అతన్ని పిచ్చివాడి క్రింద జమ కట్టామ్. ఆ రోజున అతని మాట మనం నమ్మి ఉంటే ఇప్పుడు పరిస్థితి ఇంత దూరం రాక పోను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ చలపతి బాధగా.

అంతలో— గగనంలో ఒక్కసారిగా శబ్దం రాసాగింది. ఒక్కసారిగా ఇద్దరి పోలీసు ఉద్యోగుల మొఖాలలో సంతోష ఛాయలు కనిపించాయి. ఇద్దరూ లేచి నిలబడ్డారు.

అప్పటిదాకా ప్రక్కగదిలో కూర్చొని బయ టదృశ్యాని తిలకిస్తున్న కానిస్టేబుల్స్ లోపలకు పరుగెత్తుకొనివచ్చారు.

"సర్! పాములన్నీ లోపలకు రావటానికి ప్రయత్నిస్తున్నాయి." అన్నారు అందరు ఒక్కసారిగా గాబరాపడుతూ

"హరియప్, కమాన్. అందరూ డాబా మీదకు నడవండి," అన్నాడు చలపతి రివాల్వర్ చేతిలోకి తీసుకుంటూ.

అందరూ డాబా మీదకు చేరారు. అప్పటికే డాబా మీద హెలికాప్టర్‌లు రౌండ్లు కొడుతున్నాయి. ఇన్‌స్పెక్టర్ చలపతి టార్చిలైటు వెలిగించి హెలికాప్టర్ల వైపు చూపసాగాడు. టార్చిని, వెలిగించుతూ, ఆర్పుతూ చూపిస్తున్నాడు. వెంటనే హెలికాప్టర్లన్నీ వరుసగా డాబామీదకు దిగినాయి.

అప్పటికే 'బుసల' శబ్దం దగ్గిరగా వినబడసాగింది. మెట్లవైపు చూసాడు మోహన్. గుంపులు గుంపులుగా వస్తున్నాయి పాములన్నీ.

నాలుగు హెలికాప్టర్‌లు పైకి లేవసాగాయి. ఆఖరి హెలికాప్టర్‌లో చలపతి, మోహన్ కూర్చొన్నారు. హెలికాప్టర్ పైకి లేవబోతున్న సమయంలో ఒక నల్ల త్రాచు తోకమీద నిలబడి మోహన్ కాలిపై బలంగా కొట్టింది పడగతో.

వెంటనే చలపతి పిస్తోలు తీసి నల్లత్రాచుకి గురిచూసి కాల్చాడు. అప్పటిదాకా తోకమీద నిలబడి బుసలుకొడుతున్న నల్లత్రాచు ఒక్కసారిగా నేలకొరిగింది.

మోహన్‌కి నరాలు తెగిపోయినట్లయింది పాము కాటు వేసిన చోట. కాలికి లెదరు బూటు ఉంది కాబట్టి శరీరంలోకి విషం ప్రాకలేదు. కాని కాలు మటుకు పనిచేయకుండా పోయినట్లుగా ఉంది.

* * *

....ఆకాశంలో హోరున శబ్దం వినరాసాగింది. అప్పటికే పాముల బుసల శబ్దంతో భయభ్రాంతులైన ప్రజలు, ఆకాశంలో వినవస్తున్న శబ్దాన్ని విని ఇంకా భయపడసాగారు. ఆ శబ్దం ఏమిటో తెలియాలంటే తలుపులు తీసి చూడాలి.

తలుపులు తీస్తే పాములన్ని లోపలకు వచ్చి అందరినీ నామ రూపాలు లేకుండా చేస్తాయి. ఎటూ దిక్కుతోచక ప్రాణాలు అరచేత పట్టుకు కూర్చున్నారు.

అంతలో ....

గగన తలం నుంచి మాటలు వినబడసాగాయి.

"భారత ప్రజలారా! ఆకాశం నుంచి వస్తున్న శబ్దాన్ని గురించి ఆందోళన పడకండి.

"మీరేమి భయపడవద్దు ఈ శబ్దాలు, యుద్ధ విమానాలవి. మీకు రక్షణ కల్పించటానికి, ఆ పాముల్ని చంపటానికి వచ్చాయి. కాబట్టి మీరెవ్వరు భయపడక తలుపులు వేసుకొని లోపల కూర్చోండి జాగ్రత్తగా. ఒక గంటా, రెండు గంట లలోపు మీకు స్వేచ్ఛవస్తుంది. హాయిగా గుండెలమీద చేయి వేసుకొని నిద్రపోవచ్చు." గగనంలోంచి వచ్చే మాటలు ఆగిపోయినాయి. ప్రజల్లో కొంత ధైర్యం కలిగింది.

అంతలో పెద్ద పెద్ద శబ్దాలు రాసాగాయి. బాంబుల శబ్దం, తుపాకుల శబ్దం, వాటికి తోడు పాముల బుసలశబ్దం, అన్ని శబ్దాలు కలసి మహాప్రళయం వచ్చినట్లుగా ఉన్నది.

మహా భీకరంగా మానవులకు, నాగులకు పోరు జరుగు తున్నది,

* * *

రెండు గంటల తర్వాత ఆకాశ యుద్ధం ముగిసింది; యుద్ధ విమానాలు వెనుదిరిగినాయి. అప్పటికి నాగుల సంఖ్య సగం వరకు తగ్గింది.

అర గంట తర్వాత ....

కొన్ని వందల మిలిటరీ ట్రక్కులలో కొన్ని వేలమంది సైనికులు రాసాగారు. పాములతో ముఖాముఖీగా పోరాడ టానికి.

వారందరూ పూర్తి లెదరు డ్రస్సులలో ఉన్నారు. కళ్ళ దగ్గర మటుకు గ్లాసెస్ పెట్టుకొన్నారు. చెవులదగ్గిర, ముక్కు దగ్గిర కొద్దిగా ఖాళీలు ఉంచుకొన్నారు. మిగతా భాగం, అంటే తల నుంచి పాదాలదాకా లెదరు డ్రస్సులో ఉన్నారు.

ట్రక్కులు నడుస్తుంటే వాటి క్రింద పడి కొన్ని వందల నాగులు పచ్చడిలాగా తయారవుతున్నాయి. రోడ్డంతా రక్తమయం.

ట్రక్కుల లోంచి ఫైరింగ్ జరుపుతున్నారు సైనికులు. మధ్య మధ్యలో బాంబులు విసురుతున్నారు పాములగుంపుల మధ్యకి.

తమ వర్గంవారు తరగిపోవటం చూసి నాగులకు విపరీత మయిన కోపం రాసాగింది.

వివిధ జాతులకు చెందిన నాగులు తమతమ విషవాయువు లను బయటకు వదలసాగాయి. ఆ విష వాయువులను పీల్చి సైనికులు ప్రాణాలు వదలసాగారు.

కొంతమంది సైనికులు వెనకంజ వేయసాగారు. అయినా కొంత మంది సైనికులు ధైర్యంగా ప్రాణాలు తెగించి ఫైరింగ్ చేయసాగారు. ఒక్క బుల్లెట్టుకి ఒక్కొక్క పాము. ఒక్కొక్క బాంబుకి వందల పాములు నేలరాల సాగాయి.

పాములన్నీ కలసి ఒక్కసారి వదలిన విషవాయువు లకు వందలమంది సైనికులు చనిపోవుచున్నారు.

అయినా పోరు హోరాహోరీగా జరుగుతున్నది.

దేశంలో ప్రతి పట్టణం, ప్రతి పల్లె కురుక్షేత్రంగా మారి పోయింది. సైనికుల బుల్లెట్లు గాలిలో దూసుకువచ్చి పాము లను తాకుతుంటే—గాలిలో ఎగిరివచ్చి పాములు, తమ తోకలతో సైనికులను బాదుతున్నాయి.

క్షణక్షణానికి తమ సంఖ్య తరిగిపోవడంతో పాములు ఇష్టం వచ్చినట్లుగా విషవాయువులను, విషజ్వాలలను వదల సాగాయి.

ఆ విషగాలులు సైనికులనేగాక, ఇండ్లలో ఉన్న ప్రజలందరినీ కూడ దహించివేస్తున్నాయి.

నాగుల విజృంభణ చూసి ఎవరికీ ఏం చేయాలో పాలుపోవడంలేదు. అప్పటికే దేశంలో సగంమంది ప్రజలు నిర్జీవులై పోయారు.

ఆ దృశ్యం చూస్తుంటే కలియుగం సమాప్తం అయినట్లుగా వుంది.

*　　　*　　　*

సుబ్బారావుకి పిచ్చిపట్టినట్లయింది. కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతున్నాడు తన గదిలో.

బయట పరిస్థితి ఎట్లాగున్నదో చూడాలనిపించింది. తుపాకుల మోతలు, బుసల శబ్దాలు విపరీతంగా వినరాసాగాయి. ఆ భీకర సంగ్రామాన్ని కళ్ళతో చూడాలనిపించింది.

మెల్లిగా కిటికీవైపు కదిలాడు. కిటికీ గడియ తీసి, తలుపు ఒక రెక్క తెరచి బయటకు చూసాడు. అంతే....

ఒక్కసారి బలంగా, విసురుగా దూసుకువచ్చింది ఒక పాము సుబ్బారావు గదిలోకి. ఆ వచ్చిన పాము నాగరాజు.

"మూర్ఖుడా! మా మాట పెడ చెవినిపెట్టి ఎంత ఘోరం చేసావు. నిన్ను....నిన్ను ఈ క్షణాన్నే వధిస్తాను" మీదికి రాసాగాడు నాగరాజు.

"వద్దు....వద్దు. నన్నేం చేయవద్దు. మీరు చెప్పినట్లుగా చేసాను. కాని ఎవరూ నా మాట నమ్మటం లేదు. నన్నొక పిచ్చివాడి క్రింద జమ కట్టారు. వాళ్ళు నమ్మకపోతే నేనేం

చేయగలను? దయచేసి నన్ను విడిచిపెట్టు" అన్నాడు సుబ్బారావు. అతని కళ్ళు ధారాపాతంగా వర్షించసాగాయి.

"నువ్వు చేసిన ఈ ఘోరానికి నిన్ను....నిన్ను విడిచి పెట్టటమా? అనుభవించు" అని తన విశాలమైన పడగను విప్పి బలంగా సుబ్బారావు మీదకి విసిరాడు.

"అమ్మా" అని దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు సుబ్బారావు.

ప్రక్క గదిలోంచి అతని భార్య సుజాత, అతని పిల్లలు పరుగెత్తుకొని వచ్చారు.

సుజాత గదిలోకి రాగానే గదంతా కలయ చూసింది, అక్కడ ఏమీ కనబడలేదు.

సుబ్బారావు మటుకు మంచం మీద పడుకొని కుడి కాలుని రెండు చేతులతో పట్టుకొని పెద్దగా అరవసాగాడు. సుజాత గబ గబా భర్త దగ్గరకు నడచి "ఏమండీ, ఏమిటండీ అరుపులు నిద్రలో, ఏమయింది? ఏమిటి కాలు పట్టుకు అరుస్తున్నారు?" అంది కంగారుగా.

"అమ్మో! పాము! నాగరాజు నన్ను కరిచాడు. విపరీతమయిన బాధగా వుంది. నేనింక చచ్చిపోతాను. మీరందరూ పోయి దాక్కోండి. లేకపోతే మిమ్మల్ని కూడా చంపేస్తాడు పోయి దాక్కోండి. పారిపోండి" బిగ్గరగా అరవసాగాడు.

"ఏమిటండీ, నాగరాజేమిటి మిమ్మల్ని కరవడ మేమిటి? ఒక్కసారి కళ్ళు తెరవండి. నిద్రలో ఏదో కలవరిస్తున్నారు" అంది సుజాత.

ఈ లోపల ఇరుగు పొరుగువారు కూడా వచ్చారు సుబ్బారావు వేసిన కేక విని.

సుబ్బారావు మెల్లగా కళ్ళు తెరచాడు. తన చుట్టూ వున్న జనాన్ని చూసి ఆశ్చర్యపోయాడు- కళ్లు నులుముకొని చూసాడు. అంతా మామూలుగానే ఉంది. తన కాలు వంక చూసుకొన్నాడు. అది కూడ సరిగానే ఉంది. నెప్పి ఏమీ లేదు.

"నిజంగా పాములు ఏమీ రాలేదా?" అడిగాడు.

"పాములేమిటయ్యా బాబూ! లే, లే! నిద్రలో ఏదో పీడకల వచ్చివుంటుంది." అన్నాడొకాయన.

'అబ్బ ఎంత భయంకరమైన కల వచ్చింది. రాత్రి చంపిన పాముని గురించి' అనుకొన్నాడు మనస్సులో. అంటే నిజంగా నేను నాగలోకం పోలేదన్నమాట. ఇదంతా కల.

ఇంకో ఆయన మంచినీళ్ళు తీసుకువచ్చి తాగించాడు. కాసేపటికి తేరుకొన్నాడు.

తనకొచ్చిన కల గురించి అందరికీ చెప్పాడు సుబ్బారావు.

"అందుకనే రాత్రే చెప్పాను మీతోటి. ఆ చచ్చిన పాముని దహనం చెయ్యమని, మీరు నా మాట వినలేదు. లేవండి. ఇకనైన లేచి ముఖం కడుక్కొని వెళ్ళి రాత్రి ఆ పాముని ఎక్కడ పడవేశారో వెతికి దహనం చేసిరండి. అప్పుడయినా కొద్దిగా శాంతి లభిస్తుంది." అన్నది సుజాత భర్తవంక చూస్తూ.

భార్య చెప్పింది అమలుపరుద్దామని లేచి బాత్‌రూము వైపు నడిచాడు సుబ్బారావు.

నిద్రలో తను కంగారుపడి మిగతావాళ్ళను కూడ కంగారుపెట్టిన భర్తను వెనకనుంచి చూస్తూ నవ్వుతూ నిల్చుండిపోయింది సుజాత. ★

క్రైమ్‌లో తమాషాలు

చేయని హత్య?

ఇంగ్లీషు నవల చదువుతున్నాను నేను. అంతలో ఫోన్ రాక్షసిలా మ్రోగింది. విసుక్కుంటూ ఫోన్ అందుకున్నాను.

"హలో, హలో"

"మీరేనాండి మంజులగారు" అవతలి కంఠం.

"అవును, నేనే మీ రెవరు?" అన్నాను.

"మిస్ మంజులా మీరు రామనాధాన్ని హత్యచేశారన్న సంగతి నాకు తెలుసు."

"వాట్, మిస్టర్! రామనాధం ఎవరు? నేను హత్య చెయ్యడమేమిటీ? ఎవరు నువ్వు?"

"నే నెవరైందీ నీ కెందుకు? నువ్వు హత్యచేసింది నేను చూశాను. రేపటికల్లా నీ గుట్టు పోలీసుల చెవుల్లో వూద గలను. కాని నీ గుట్టు బయటపడకుండా ఉండాలంటే అర్జంటుగా పదివేలు తీసికొని ఈ రాత్రి 12 గంటలకు ఈ వూరికి తూర్పున వున్న మైదానం దగ్గరకు రా! అక్కడ నీకు ఒక గుట్ట కనిపిస్తుంది. అదే నీకు గుర్తు. ఏవిధమైన ఆయుధాలు తెచ్చుకోవద్దు. పిచ్చిపిచ్చి వేషాలు వేస్తే నీ ప్రాణం పోతుంది. జాగ్రత్త!" అంటూ ఫోన్ పెట్టేశాడు అవతలి వ్యక్తి.

నేను ఆశ్చర్యపోతూ కుర్చీలో కూలబడ్డాను? ఎవరితను! రామనాధం ఎవరు? నేను హత్యచెయ్యడ మేమిటి? నన్నెం

దుకు ఫోన్‌లో బెదిరించాడు? ఇతని గొంతుకూడ ఎక్కడా విన్నట్లు లేదే? తీరని సమస్యలతో నా బుర్ర వేడెక్కిపోయింది. సాయంత్రం అన్నయ్య వచ్చాక అంతా చెప్పి, వీడి అంతు తేల్చుకోవాలి అని నిర్ణయించుకున్నాను.

సాయంత్రం అన్నయ్యా, నేను మెల్లగా బయటికి నడచి, కాలినడకన బయల్దేరాము, కారులో వెళ్తే గుర్తుపడతాడని.

పది నిముషాల్లో ఆ ప్రదేశం చేరుకున్నాము. అతను చెప్పినట్టే అక్కడ ఒక గుట్ట వుంది.

ఆ గుట్ట పక్కనే వున్న పొదల్లో ఇద్దరం నక్కి, అతని కోసం యెదురుచూడసాగాము.

12 గం. అయింది. నేను ప్రాణా లుగ్గబట్టుకొని చూస్తున్నాను. ఏక్షణంలోనైనా అతడు రావచ్చని.

కాని ఆశ్చర్యం. 12 అయి అర్ధగంట అయినా ఎవరూ రాలేదు. 1 గం. కూడా అయింది. మేము మెల్లగా బయటికి వచ్చి ఆ చుట్టుపక్కల వున్నాడేమోనని అంతా వెదికాము. మే మిద్దరం తప్ప యెవరూ లేరు, ఆశ్చర్యపడి యింటికి వచ్చేశాము.

ఆ మర్నాడు ఏడేళ్ళ కుర్రా డొకడు వచ్చాడు. అతడు నా స్నేహితురాలు రాణి తమ్ముడు.

అతడు నా దగ్గరకొచ్చి "ఈ చీటీ అక్క మీకు ఇమ్మన్నదండి" అంటూ ఒక చీటీ ఇచ్చి వెళ్ళిపోయాడు. నేను చీటీ విప్పి చదవసాగాను.

"డియర్ మంజూ,

నిన్న నీకు ఒక వ్యక్తి ఫోన్‌చేసాడు. నువు రామనాథాన్ని హత్యచేశావని, నీ గుట్టు బయటపడకుండా ఉండాలంటే పదివేలు ఇమ్మని, నిన్ను బెదిరించాడు. ఆ విషయం

నాకు తెలుసు. అసలు నువ్వు హత్య చేసివుంటేగా అతనికి పట్టుబడడానికి. నీ బుర్ర ఆలోచనలతో గిరగిరా తిరిగి ఉంటుంది. ఈ విషయం నాకెలా తెలుసని ఆశ్చర్యపోతు న్నావ్ కదూ! నిన్న ఫోన్ చేసిన వ్యక్తి మా అన్నయ్య. సెలవులని మొన్న వచ్చాడు. మరొక విషయం నిన్న ఏప్రిల్ ఒకటి, నీకు జ్ఞాపకం లేదేమో. నిన్ను ఆట పట్టిద్దా మని నేనే ఫోన్ చేయించాను. మరేం భయపడకు.

ఇట్లు, నీ రాణి."

నేను ఆశ్చర్యంతో అలాగే ఉండిపోయాను.

—ఎస్. షమీమారఫి, కడప.

తిక్క మనిషి!

సుబ్రావు పచ్చి రౌడీ అనే ముందు వాడో మహా తల తిక్క మనిషి అని ముందుగా తెల్సుకోవాలి. ఆ మూర్ఖుడికి జాన్‌దోస్త్ 'సారా బుడ్డి' సర్వకాల సర్వావస్థల యందు వాడి చేతిలో నాటు సారా నీటుగా నవ్వుతుంటుంది.

వాడి అభిమానం సంపాదించాలని 'కా కా'పడుతుం టారు చిల్లర రౌడీలు. వారిలో కాస్త ముఖ్యుడు ఎంక టేశం.

ఓసారి సుబ్రావు ఓ 'బక్కోడ్ని' కరుసు బెట్టేయాలని ప్లానేశాడు. కాని బ్రతికే యోగమున్న బక్కోడు నూకలు చెల్లక తప్పించుకుపోయాడు.

'బక్కోడు' తప్పించు కెళ్ళాడన్న కసితో రుస రుస లాడ్తోన్న సుబ్రావుని మరింత కాకా పట్టేసి-అభిమానం సంపాదించాలని ఎంకటేశం ఇలా మొదలెట్టాడు.

"గురూ గురూ! ఆ బక్కోడ్ని నా కొదిలెయ్! అది

గొడవ నీ కెందుకు? నిజవ్ సెప్పాలంటే ఆడి పాణాలు నా ఎడవ సేతిలున్నాయంటే నమ్ము."

తిక్క సుబ్రావు ఎంకటేశం వంక మిర్రి మిర్రి చూసి ఆనక ఇలా అడిగాడు, "ఆర్నీ ఎంకా! నువ్వు సెప్పేది నిజవేనా?"

"సత్తెపెమాణం! నీవోదొట్టు గురో" సుబ్రావు తన దారికి వస్తున్నందుకు తెగ సంబరపడ్తూ అన్నాడు.

కాని, ఎంకటేశం ఊహ పల్టీ కొట్టింది.

సుబ్రావు చేతిలోని కత్తి ఎంకటేశం ఎడమ చేయిని టకీమని తెగ్గోయడం అది కాస్త నేలవాలడం క్షణంలో జరిగాయి.

"ఏంది గురో! నా చెయ్...." మొత్తుకున్నాడు ఎంకటేశం.

"నాయాల! ఆ బక్కోడి పేణాలు నీ ఎడవ సెయ్‌ల వున్నాయంటివిగదరా! నీ చెయ్యి తెగ్గొడితే ఆడి పేణాలు పోత్తై గదా!" అంటూ తాపీగా సీసా నోట్లెట్టుకున్నాడు తల తిక్క సుబ్రావు.

—కాసారపు సంజీవయ్య, జగిత్యాల.

ఆగుతావా? చస్తావా?

"ఆగు, మిస్టర్!" అంది కటువుగా తన దగ్గర్లోనే, ఎవరో అని తల త్రిప్పి చూశాడు గని. ఎవ్వరూ లేరు. ఏందబ్బా అనుకుంటూ మళ్ళీ సైకిలెక్కాడు.

"మర్యాదగా ఆగుతావా, చస్తావా?" అందా కంఠం ఖంగున.

ఏమిటో అంటూ సైకిల్ దిగి చుట్టూ చూశాడు. ఎవరు

లేరు. అరే! ఇదేంటి? ఎవరూ లేరు. మరి ఈ మాటలు ఎక్కణ్నుంచి వస్తున్నాయ్! అనుకుంటూ ఆశ్చర్యపోయాడు గని. మళ్ళీ సైకిలెక్కి కొంచం దూరం పోయాడో, లేదో తన వెంట ఎవరో వస్తున్నట్టు బూట్ల చప్పుడు వస్తున్నది. తల త్రిప్పి చూశాడు. ఎవ్వరూ లేరు. సైకిల్‌ను అలాగే స్లోగా తొక్కుతున్నాడు. బూట్ల చప్పుడు ఇంక దగ్గరగా టక్ టక్‌మంటూ వినపడ్తున్నాయ్.

ఏమిటో తాను భ్రమ పడుతున్నాడా? లేదు! నిజంగానే వినబడుతున్నాయ్ బూట్ల చప్పుడు. అంత నిశ్శబ్ద వాతావరణంలో టక్, టక్‌మన్న బూట్ల చప్పుళ్లు నిశ్శబ్దాన్ని భేదిస్తూ వినపడుతున్నాయ్. ఇప్పుడు ఒకరు కాదు, ఇద్దరు పరిగెత్తుతున్నట్లు టక, టకలు వినపడ్తున్నాయ్. ఇలా ఓ నిమిషం బూట్ల చప్పుళ్లు వినపడ్తూనే వున్నాయి. గని సైకిల్ తొక్కుతూనే వున్నాడు.

"హాండ్సప్, మై డియర్! అడుగు ముందుకు కదిపావో ఈ బుల్లెట్ నీ తల్లోంచి దూరిపోతుంది" అన్నదా కంఠం మళ్ళీ.

స్టీల్ పాత్ర ఏదన్నా క్రింద పడితే యెలా చప్పుడు వస్తుందో అలా వుందా కంఠం ఖంగున. ఇప్పుడు బూట్ల చప్పుడు ఆగిపోయింది. మెడకు ఏదో చల్లగా తగిలింది. అది పిస్టల్ బారెల్ అని టక్కున గుర్తు పట్టాడు గని.

ఇక చేతులెత్తక తప్పదని, సైకిల్ హాండల్‌ను వదిలేసి చేతులెత్తాడు.

అంతే! చేతులు వదలగానే, సైకిల్ చక్కగ వెళ్ళి "మైలురాయిని" ముద్దు పెట్టుకుంది. సైకిల్‌పైనున్న గని తోపాటు, సైకిల్ వెళ్ళి రోడ్డు ప్రక్కన పడింది.

"మీరు ఇంతవరకు ఆకాశవాణి హైదరాబాదు కేంద్రము

నుండి "హాండ్సప్ మైడియర్" అనే డిటెక్టివ్ నాటికను విన్నారు. ఇంతటితో శలవు" అన్న మాటలు విని తల ప్రక్కకి తిప్పి చూశాడు.

తన భుజానికి ఉన్న రేడియో, సైకిల్ పడగానే ఎగిరి అంత దూరాన పడ్డది. తను సైకిల్ తొక్కుతున్నప్పుడు మెడకు చల్లగా తగిలింది పిస్టల్ బారెల్ కాదని, రేడియో ఏరియల్ కొన అని వూహించి, నోరు తెరిచాడు గని.

—ఆర్. జీవన్, పెంటాకలాన్.

ముందు చూపు!!

ఒక వ్యక్తి విమానంలోకి ఎక్కబోతూ ఆగి, పైలెట్ వద్దకెళ్ళి "అయ్యా, పైలెట్‌గారూ! విమానంలో పెట్రోలు ఫుల్‌గా ఉందా!" అడిగాడు.

పైలెట్ : ఉంది సార్.

వ్యక్తి : నీళ్ళు స్టాక్ ఉన్నాయా?

పైలెట్ : (నవ్వుతూ) ఉన్నాయి సార్.

వ్యక్తి : విమానంలోని యంత్రాలు, మిషనరీ అన్నీ కండిషన్‌లో ఉన్నాయా?

పైలెట్ : ఆహా! ఉన్నాయి.

వ్యక్తి : విమానంలో ఏ లోపమూ లేదు కదా?

పైలెట్ : అబ్బబ్బ! విమానం మంచి కండిషన్‌లో ఉంది. అయినా ఇవన్నీ మీకెందుకు?

ఆ వ్యక్తి పెద్దగా నిట్టూర్చి, "ఈ సిటీకి వచ్చేందుకు ఒక బస్సెక్కాను, రామ! రామ! బస్సు ఎక్కినప్పటినుంచి ట్రబులే. మొత్తం సిటీకి వచ్చేంతవరకు వెనకనుంచి తోసుకుంటూ తెచ్చాం. దానిలాగే ఈ విమానాన్ని పైకి పోయిం

తర్వాత చెడిపోయింది ప్రోయండి అంటే నావల్ల మాత్రం కాదు" అన్నాడు నిట్టూరుస్తూ.

—హవంతీ రఘువిమల్ ప్రసాద్, బోర్గాం.

భగ్న ప్రేమికులు?

అమెరికాలో ఒక యువకుడూ, ఒక యువతీ చాల గాఢంగా ప్రేమించుకున్నారు. సాధ్యమైనంత త్వరలో పెళ్ళి చేసుకునేందుకూ్కడా నిశ్చయించుకున్నారు. కానీ అది యుద్ధకాలం. ప్రభుత్వ శాసన ప్రకారం యువకుడు తప్పని సరిగా యుద్ధంలో చేరవలసివచ్చింది. తత్ఫలితంగా ఆ యువతీ యువకుల మధ్య కొన్నాళ్ళపాటు కారుచీకట్లు కమ్ముకునే విషాద పరిస్థితి ఎదురైంది.

ఆ మర్నాడు యువకుడు సైన్యంలో చేరిపోయాడు. ఎక్కడో దూరదేశాలకు వెళ్ళిపోయాడు. కానీ యువకుడు తన ప్రియురాలి ఫొటోను మాత్రం తనతో కూడ తీసుకుపోయాడు. ఒంటరిగా వున్నప్పుడు ఆ ప్రియురాలి ఫొటోను కళ్ళారా చూసుకుంటూ వుండేవాడు.

ఇక్కడ ఇలా వుండగా అక్కడ న్యూయార్కులో ప్రియురాలైన ఆ పిల్ల కూడా అహోరాత్రాలు విరహతాపం పడుతూ, నిత్యం తన ప్రియుడినే తల్చుకుంటూ కాలం గడుపుతూవుంది.

ఇలా రెండేళ్ళ కాలం గడిచింది. మన యువకుడు యధాప్రకారం రోజూ ప్రియురాలి ఫొటోను పూజిస్తూనే వున్నాడు. ఇంతలో హఠాత్తుగా ఒక రోజున ఆ యువకుడికి ఒక ఉత్తరం వచ్చింది. అది తన ప్రియురాలు వ్రాసిన ఉత్తరం.

"ఇక నీ కోసం నేను ఎంతమాత్రం ఎదురుచూడలేను. అప్పుడే రెండేళ్ళ కాలం గడిచిపోయింది. నాకూ, మరొక వ్యక్తికీ పెళ్ళి నిశ్చయమైపోయింది. కనుక నువ్వు నామీద ఇక ఏమాత్రం ఆశ పెట్టుకోకు. ఇలా అంటున్నందుకు మరో విధంగా భావించకుండా నీ దగ్గర వున్న నా ఫొటోను తక్షణం తిరుగుటపాలో పంపమని కోరుతున్నాను." ఇదీ ఆ ఉత్తరంలో వున్న విషయం.

ఈ ఉత్తరం చదువుకునేటప్పటికి ప్రేమికుడైన ఆ యువకుడి గుండె గుభేలుమంది. భగభగా మండు భగ్నప్రేమాగ్ని అతన్ని నఖశిఖపర్యంతం దహించసాగింది.

యువకుడు ఆ రోజు రాత్రి తెల్లవార్లూ ఆ విషయాన్ని గూర్చే తీవ్రాలోచన చేసాడు. చివరికి ఒక నిశ్చయానికి వచ్చేసాడు. తన సైనిక శిబిరంలో వున్న మిత్రులందర్నీ కలుసుకుని వాళ్ళ దగ్గిరున్న వాళ్ళ ఫొటోలన్నీ సేకరించాడు. అంతేకాదు, వాళ్ళ తాలూకు ఆడబంధువులనీ, ముసలమ్మలవీ కూడా ఫొటోలు అడిగి తీసుకున్నాడు. ఇలా ఆ యువకుడు సేకరించిన వంద ఫొటోలతోపాటు తన ప్రియురాలి ఫొటో కూడా జతచేసి, ఆ ఫొటోల కట్ట యావత్తూ తన ప్రియురాలి పేర రిజిస్టర్ పార్సెల్‌లో పంపించేసాడు. ఆ పార్సెల్‌తోపాటు ఓ ఉత్తరం కూడా పోస్ట్ చేసాడు. ఇదీ ఆ ఉత్తరంలో వున్న విషయం :

"ఫొటో పంపమంటూ నువ్వు రాసిన ఉత్తరం అందినది. కానీ నువ్వు ఎవరో గుర్తులేదు. కనుక ఆ పంపిస్తున్న వంద ఫొటోలలో నీ ఫొటో ఏదో చూసుకుని, దానిని జాగ్రత్తగా భద్రపరచుకొని, మిగతా ఫొటోలన్నీ తిరుగు టపాలో పంపమని నా కోరిక."

—ముద్దా రమేష్, కాకినాడు.★

అపరాధ పరిశోధనపోటీ-91 [ఫలితాలు]

ఫిబ్రవరి '76 నెల "అపరాధ పరిశోధన పోటీ-91" కి సరియైన సమాధానాలు :

1. బీహారు.

2. ఫ్యాషన్లు.

3. చిత్రకళ.

4. దినపత్రికలు.

6. సుఖశాంతులు.

పై జవాబుల ప్రకారం ఒకే ఒక్కరు ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి మే '76 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక ఉచితంగా పంపబడుతుంది.

బహుమతి పొందిన విజేత:

శ్రీ జి. నాగేశ్వరరావు,
సీనియర్ స్టెనోగ్రాఫర్,
వెస్టరన్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్,
వైకుంఠపూర్,
సుర్ గుజా జిల్లా,
(మధ్యప్రదేశ్ స్టేట్)

సీరియల్

(గతసంచిక తరువాయి)

బయట అప్పటివరకూ ఎంతో ఓపికగా గోడమీద అడ్వర్టైజ్‌మెంట్ పెయింట్ చేస్తూ ఒక కంట ధర్మేంద్ర బంగళాను పరీక్షిస్తున్న వ్యక్తి, ఓ నవయువకుడు ధర్మేంద్ర యింటిలోనుండి బయటకు రావడం గమనించి క్షణం ఆశ్చర్యపోయినా, ఏదో ఆలోచన తట్టి చేస్తున్న పనిని అసిస్టెంట్‌కు అప్పజెప్పి వెనక్కు తిరిగి నిశ్శబ్దంగా మురళిని వెంబడించసాగాడు.

కిటికీలోనుండి అంతా గమనిస్తున్న ధర్మేంద్ర దాసును పిలిచి ఏదో చెప్పాడు. దాసు తలవూపి ఇంటి వెనుకవైపుకు వెళ్ళాడు.

ధర్మేంద్ర హాంగర్‌కు వున్న కోటు అందుకొని బయటకు నడిచాడు.

'ఇన్‌స్పెక్టర్ రంజన్‌ను కలుసుకోవాలి. తాజా సమాచారం ఏమైనా తెలిసిందేమో? ముఖ్యంగా తనను హత మార్చాలని ప్రయత్నించి హతులైపోయిన శత్రువర్గానికి చెందిన వ్యక్తుల గురించి సమాచారమేమైనా తెలిసిందేమో కనుక్కోవాలి. మురళికి బదులుగా ప్రాణాలు కోల్పోయిన వ్యక్తులు కూడా ఎవరో తెలుసుకోవాలి.'

మజ్దా ఎక్కి స్టార్ట్ చేశాడు ధర్మేంద్ర. మరుక్షణంలో మజ్దా ముందుకు దూసుకుపోయింది.

రోడ్ ప్రక్కనే వున్న కిళ్ళీ షాప్ దగ్గర న్యూస్‌పేపర్ అడ్డుపెట్టుకొని ధర్మేంద్రనే పరీక్షగా చూస్తున్న వ్యక్తి, త్రాగుతున్న సిగరెట్‌ను అవతల పారేసి, చిన్నగా తల

వూపుతూ ప్రక్కనే వున్న కారులోకి ఎక్కి స్టార్ట్ చేశాడు.

దుండగుల కారు మెల్లగా మజ్దాను వెంబడించసాగింది.

18

ఇంటి వెనక్కు వెళ్ళిన దాసు, అటూ ఇటూ చూసి చటుక్కున గోడ ఎక్కి దూకి రోడ్‌మీదకు వచ్చాడు. ప్రక్కనే వున్న సైకిల్ షాపులో సైకిల్ అద్దెకు తీసుకుని వేగంగా బయలుదేరాడు.

ఎంతో దూరం వెళ్ళకముందే కన్పించాడా వ్యక్తి. ముందు మురళి నడుస్తున్నాడు. వెనుక ఆ వ్యక్తి అనుసరిస్తున్నాడు.

దాసు స్పీడ్ పెంచాడు. వేగంగా వెళ్ళి వెనుక నుండి ఆ వ్యక్తికి డాష్ యిచ్చాడు. ఆ హఠాత్సంఘటనకు 'ధన్' మంటూ ఆ వ్యక్తి క్రింద పడ్డాడు.

అప్పటికే జనం చుట్టూ పోగయ్యారు. అంతా కలసి దాసును తిట్టిపోశారు. అందులో ఓ వ్యక్తి అతనికి సానుభూతి తెలుపుతూ "పదండి సార్, ఇటువంటి పోకిరీ వెధవలను వూరికే పోనివ్వకూడదు. పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్ళండి" అన్నాడు.

ఆ వ్యక్తి చిన్నగా వులిక్కిపడ్డాడు.

ఒకసారి తలెత్తి అందర్నీ చూసి "పోనీలెండి, ఏదో కుర్రాడు. అతను మాత్రం కావాలని ఢీ కొట్టాడా? ఏదో అనుకోకుండా జరిగిపోయింది. దీనికి పోలీస్ రిపోర్ట్ ఎందుకు?" క్రిందనుండి లేచి బట్టలకు అంటిన దుమ్ము దులుపుకుంటూ అన్నాడతను.

దాసు గబ గబ ప్రక్కనే వున్న కిళ్ళీ షాప్ నుండి కూల్‌డ్రింక్ ఒకటి తీసుకు వచ్చాడు. అతను చూడకుండా ఓ చిన్న టాబ్లెట్ అందులో వేశాడు.

"డ్రింక్ తీసుకోండి సార్! క్షమించండి సార్! సైకిల్ బ్రేకులు సడెన్‌గా జారిపోయాయి" అన్నాడు డ్రింక్ అందిస్తూ.

అతను ఆదుర్దాగా ముందుకు చూశాడు.

మురళి అప్పటికే టాక్సీ ఎక్కి కనుచూపు మేర దాటి పోయాడు.

ఇక వెంటాడినా లాభం లేదనుకొని దాసు యిచ్చిన డ్రింక్ అందుకున్నాడు.

డ్రింక్ త్రాగి బాటిల్ యిచ్చేస్తూ, "థాంక్యూ మై బాయ్" అంటూ ముందుకు నడిచాడు.

దాసు అతని వెనుకే నడవసాగాడు. ఓ పది అడుగులు నడిచేటప్పటికి అతని అడుగులు తడబడ్డాయి. నరనరాల్లో నీరసం ఆవహించింది. నడవలేకపోతున్నాడు.

"సార్, ఆటో పిలుస్తాను ఇంటికి వెళ్ళండి," అన్నాడు దాసు.

అతను అలాగే నన్నట్లుగా తల వూపాడు.

దూరంగా వెళుతున్న ఆటోని పిలిచి అతన్ని జాగ్రత్తగా వెనక సీటులోకి ఎక్కించాడు దాసు.

అతి కష్టంగా లోపలకు ఎక్కిన అతను సీటుపై వాలి పోయాడు,

"ఎక్కడకు సార్?" ఆటో డ్రైవర్ అడిగాడు.

"పోలీస్ కంట్రోల్ రూం" చెప్పాడు దాస్.

లీలగా విన్పించిన ఆ మాటకు ఉలిక్కిపడి లేవబోయాడు ఆ వ్యక్తి.

అయితే అప్పటికే పూర్తిగా ఆక్రమించిన మత్తుమందు ప్రభావం లేవనీయ లేదు.

ఆటో పోలీస్ కంట్రోల్ రూంవైపు దూసుకుపోయింది.

19

1 వ టవున్ పోలీస్ స్టేషన్ వద్దకు రాగానే మజ్దా ఆగింది. డోర్ తెరచుకొని కారు దిగాడు ధర్మేంద్ర. రెండడుగులు పోలీస్ స్టేషన్ వైపు వేశాడో లేదో, ఒక్క-క్షణం ప్రక్క-కు చూసి చటుక్కు-న బోర్లా క్రిందకు పడిపోయాడు ధర్మేంద్ర.

వెనుకనుండి వస్తున్న కారులోంచి మెషిన్‌గన్ వున్న చేయి ఒకటి బయటకు రావడం, టపటపమని ప్రేలడం వెంట వెంటనే జరిగిపోయింది.

నేలకు అతుక్కు-పోయిన ధర్మేంద్ర తలమీదుగా మెషిన్ గన్ బుల్లెట్స్ దూసుకుపోయి పోలీస్ స్టేషన్ గోడకు కొట్టు కొని క్రింద పడిపోయాయి.

మెషిన్‌గన్ మ్రోతకు స్టేషన్‌లోని వారంతా కంగారుగా బయటకు వచ్చారు. ఇనస్పెక్టర్ రంజన్ రివాల్వర్ పుచ్చు కొని బయటకు వురికాడు.

ధర్మేంద్ర లేచి బయటకు పరిగెత్తుతూ "అతనిని పారి పోనివ్వకండి. పట్టుకోండి," అంటూ అరిచాడు.

వెంటనే కొందరు కానిస్టేబుల్స్ జీప్ వేసుకొని బయలు దేరారు.

ఓ నిమిషం తర్వాత కర్చీఫుతో చమట తుడుచుకుంటూ స్టేషన్‌లోకి అడుగు పెట్టాడు ధర్మేంద్ర. రంజన్‌కూడా లోప లకు ప్రవేశించాడు.

"మిష్టర్ రంజన్, దుండగుల గురించి ఏమైనా సమా చారం తెలిసిందా?"

"నోసర్! డిపార్ట్‌మెంట్ అంతా వేయి కళ్ళతో శోధి స్తూనే వుంది. కమిషనర్‌గారుకూడా యింతకు ముందే ఫోన్ చేశారు."

"ఏమన్నా రేమిటి?"

"ఏమంటారు? నాలుగు చీవాట్లు పెట్టారు. ఈ క్షణం నుండి మీరు కోరిన సహాయం చేయమని సెలవిచ్చారు."

చిన్నగా నవ్వాడు ధర్మేంద్ర.

"అన్నట్లు ధర్మేంద్రజీ! ఓ ఫ్లాష్ న్యూస్! మురళి కారు వెనకే వచ్చి మంటలలో భస్మమైపోయిన ముగ్గురు వ్యక్తులు కూడా లైట్ రాకెట్‌కు సంబంధించిన వ్యక్తులే!"

ఆశ్చర్యపోయాడు ధర్మేంద్ర.

"ఈజిట్? ఎలా గుర్తుంచారు మీరు?"

"ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశోధిస్తున్న సమయంలో కారులోనుండి ప్రేలుడుకు దూరంగా విసిరివేయబడిన ఓ పవర్‌ఫుల్ ట్రాన్సిమిటర్ దొరికింది. దానిమీద విదేశీ గుర్తులు వున్నాయి. అయితే అది పూర్తిగా చెడిపోయి వుంది" సేఫ్‌లోంచి ఓ ట్రాన్సిమిటర్ తీసి యిస్తూ చెప్పాడు రంజన్.

ధర్మేంద్ర కుతూహలంగా ట్రాన్సిమిటర్‌నుపరిశీలించాడు.

అది చైనాలో తయారైనట్లు, దానిమీద వున్న గుర్తులు స్పష్టంగా చెబుతున్నాయి, అది చాలా శక్తివంతమైనది. ఆ ట్రాన్సిమిటర్‌తో ప్రపంచంలోని ఏ ప్రాంతాన్నయినా కాంటాక్టు అవ్వచ్చు!

"మిష్టర్ రంజన్, శతృవులు బృహత్తరంగా తమ కార్య కలాపాలను సాగిస్తున్నారనడానికి యీ ట్రాన్సిమిటర్ ఒక నిదర్శనం!

బహుశా వారిదగ్గర యిలాంటి ట్రాన్సిమిటర్లు, యింకా శక్తివంతమైన టెలివిజన్‌సెట్లు చాలా వుండి వుంటాయి" అన్నాడు ధర్మేంద్ర.

"అవును మిష్టర్ ధర్మేంద్ర! నిజంగా వారికున్నంత టెక్నికల్ ఎక్విప్‌మెంట్ మా డిపార్ట్‌మెంటుకు గూడా లేదేమోననిపిస్తోంది." సాలోచనగా అన్నాడు రంజన్.

జీప్‌లో ఆ అజ్ఞాత వ్యక్తిని బంధించడానికి వెళ్ళిన కానిస్టేబుల్స్ కాళీ చేతులతో తిరిగి వచ్చారు.

ఇనస్పెక్టర్ రంజన్ కళ్ళెర్రచేస్తూ చూశాడు వారివైపు. కానిస్టేబుల్స్ గడగడ వణికిపోయారు.

"సారీ సర్, ఎంత ప్రయత్నించేసినా ఆ కారును ఆపలేక పోయాం సార్! చివరకు ఆ కారును క్రాస్ చేయబోయే సమయంలో మన దురదృష్టవశాత్తు ఒక లారీ రోడ్‌కడ్డంగా చెడిపోయి నిలబడిపోయింది. మెల్లగా ఆ లారీని తప్పించుకెళ్ళేసరికి ఆ కారు మాకు కనబడకుండా వెళ్ళిపోయింది సార్!"

పెద్దగా అరిచాడు రంజన్.

"రాస్కెల్స్! బ్రూట్స్! మీలాంటివారుండబట్టే యీ డిపార్టుమెంటు ఇలా తగలడుతోంది. దుండగులు వేసిన ఆ ప్లాన్‌ను కనిపెట్టలేక పోయారు. మీరు ఇంత అసమర్థులని అనుకోలేదు. వాళ్ళు మిమ్మల్ని మధ్యలో ఆపాలనే లారీని ఆపారు. వాళ్ళు అంతా ముందు పథకం వేసుకొని ప్రవర్తిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తూనే వుంది. అలానే వాళ్ళను పట్టుకొచ్చి నాలుగు దులిపితే బండారం బయట పడేదిగా! ఇక చేసిన ఘనకార్యం చాలు, వెళ్ళండి. మన స్టేషన్ ముందు ఒక డిటెక్టివ్‌పై హత్యా ప్రయత్నమా? రేపు పత్రికలు మన పరువు నిలుపుతాయా? కమీషనర్‌గారు ఏమంటారు? మిమ్మల్ని పెట్టుకొని ఎలా సర్దుకుపోవాలో

అర్థం కావడం లేదు" ఏకధాటిగా దులపవలసినదంతా దులిపివేశాడు.

రంజన్ సంగతే అంత! అతనికి అనుగ్రహం వచ్చినా, ఆగ్రహం వచ్చినా పట్టపగ్గా లుండవు. రంజనే కాదు, బహుశా పోలీస్ డిపార్ట్‌మెంట్ అంతా ఇంతేనేమో?

"మిష్టర్ రంజన్!" మెల్లిగా పిల్చాడు ధర్మేంద్ర.

"ఎస్. ఏమిటి ధర్మేంద్రజీ?" కొంచెం ఆవేశం నుండి తేరుకుని అన్నాడు.

"మీ డిపార్టుమెంట్, ముందు ఆ కోపం తగ్గించుకోవాలోయ్! ప్రజలను ఎలా భయపెడుతున్నారు చాలదూ? కానిస్టేబుల్స్‌ను కూడా భయపెట్టాలా? శత్రువుల శక్తి యుక్తులను అంచనా వేసుకొని ముందు మళ్ళా ఆ పొరబాట్లు జరగకుండా చూసుకోవాలి. ఒక్కొక్కప్పుడు మనమే మోసపోతుంటాం. పాపం వాళ్ళను తిట్టి ప్రయోజన మేమిటి?" నిదానంగా అన్నాడు ధర్మేంద్ర.

ధర్మేంద్ర వైపు ఆశ్చర్యంగా చూశాడు రంజన్.

"మిస్టర్ రంజన్! సి. ఐ. డి. రిపోర్ట్సు ఏవైనా తెలిశాయా!"

"లేదు సర్."

"ఆల్‌రైట్! లైట్‌రాకెట్ కార్యకలాపాలు యింత భారీగా జరుగున్నాయంటే, ఇందులో చాలా పెద్ద చేతులే వుండి వుంటాయి. సో, పట్టణంలో వున్న 'పెద్దవారి'పై ఓ కన్నేసి వుంచు. కావాలంటే అదనపు సిబ్బందిని తెప్పించు. అందరి మీద నిఘా తీవ్రతరం చేయండి. మనకు లైట్‌రాకెట్ క్లూలు కొన్ని దొరికినట్లే దొరికి

మాయమయ్యాయి. మనం దొంకంతా కదపాలంటే కనీసం తీగె అన్నా దొరకాలి" చెప్పాడు ధర్మేంద్ర.

"అలాగే సర్! ఈ రోజు నుండి నిఘా ఏర్పాటు చేస్తాను. అంతేకాదు వారి డైలీ రిపోర్టు మీకు పంపిస్తాను" అన్నాడు రంజన్.

"వెరీగుడ్! అన్నట్లు నన్ను బంధించపోయి ప్రాణాలు కోల్పోయిన వారి ఆచూకీ ఏమన్నా తెలిసిందా?"

"లేదు సర్! వారి ఆకారాలు అసలు గుర్తు పట్టడానికి గూడా వీలు లేకుండా మారిపోయాయి. అయితే వేలి ముద్రల నిపుణులు శవాల ఫింగర్ ప్రింట్స్ తీసుకొని ఎక్స్‌పోజ్ చేస్తున్నారు. అవి వస్తే పాత నేరస్థుల ఫింగర్ ప్రింట్స్‌తో పోల్చి చూడవచ్చు. వాటిద్వారా ఏమైనా ఆధారం లభిస్తుందేమోనని మా ఆశ!''

అంతలో ఘణ గణ మంటూ ఫోన్ మ్రోగింది.

రంజన్ రిసీవర్ అందుకున్నాడు. ఒక నిముషం మాట్లాడి "సార్, మీరు కావాలట" అంటూ రిసీవర్ ధర్మేంద్ర కందించాడు.

20

బేగంపేట విమానాశ్రయమంతా సందడిగా వుంది. విమానం వచ్చే టైమ్ అవడంతో, ఎక్కేవారు, దిగేవారిని రిసీవ్ చేసుకోడానికి వచ్చినవారు అంతా హడావుడిగా వున్నారు.

మరో నాలుగు నిమిషాలలో విమానం లాండ్ అవబో తున్నట్లు విమానాశ్రయం అధికారులు ప్రకటించారు.

సరిగ్గా నాలుగు నిమిషాలు గడిచేసరికి సిగ్నలింగ్ క్యాబిన్‌లో లైట్లు వెలిగాయి. ఎయిర్ ఇండియావా